# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 10, అక్టోబర్ 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి: 18** **సంచిక: 10**


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం
డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్

**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శ్రీవారి బ్రహ్మోత్సవములు | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| కార్తీకమాస వైశిష్ట్యం | 21 |
| తిరుప్పావై | 23 |
| విజయదశమికి శమీ వృక్ష ప్రాముఖ్యత | 29 |
| రామాయణ రత్నాకరం | 30 |
| మీ ప్రశ్న – మా సమాధానం | 33 |
| నవవిధ భక్తి మార్గాలు | 36 |
| భ్రమరాంబికా మాహాత్మ్యము | 39 |
| ముకుందమాల | 41 |
| దుర్గా నవరాత్రి ఉత్సవం | 45 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 48 |
| తిరుమల సర్వస్వం | 53 |
| ఆనందాల కేళి– దీపావళి | 59 |
| వారాహి అమ్మవారు | 61 |
| పాండవుల అజ్ఞాతవాసం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# ప్రార్థన

ప్రతి దసరా నవరాత్రికి తిరుమల స్వామివారికి బ్రహ్మోత్సవాలను జరపడం ఆనవాయితీ. శ్రవణా నక్షత్రం రోజు చక్రస్నానంతో ముగిసే విధంగా ఈ ఉత్సవాలు జరుగుతాయి. తిరుమల స్వామివారు ఈ భూమిపై శ్రవణా నక్షత్రం నాడు అవతరించారని అంటుంటారు. అదే తిథిని పురస్కరించుకుని పూర్వము బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాన్ని జరిపి మార్గదర్శనం చేశాడని పురాణాల వాక్కు. ఈ బ్రహ్మోత్సవాల సమయాన స్వామివారి శక్తి అధికంగా ఉంటుంది కావున భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుని కోరికలు తీర్చుకొనుటకు పోతుంటారు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం 2002 సంవత్సరం దసరా (శ్రవణా నక్షత్రం) రోజున ఏర్పడింది. మొదట ఈ పీఠం కేవలం ఒక కోటి జప సమర్పణ నిమిత్తమై ఏర్పడ్డది. కాని స్వామివారి ఆదేశానుసారం ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ చేయ నిర్ణయించాము. మరియు స్వామివారి కృపచే మరెన్నో సేవలు లభించాయి. 1. తిరుపతిలో 2002 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప నిర్మాణం. 2. ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ. ఇందులో ప్రస్తుతం 24వ పర్యాయంగా జప పుస్తక వితరణ జరుగుచున్నది. 3. నమో వేంకటేశాయ రథయాత్ర – ఇది 2004 సంవత్సరం నుండి 2019 వరకు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ప్రతి సంవత్సరం 25 రోజులు చేశాము. 4. శ్రీవేంకటేశం మాసపత్రిక – ఇది 2007 నుండి నేటికీ కొనసాగుచున్నది. 5. భజగోవిందం – ఇది ప్రతి వైకుంఠ, తొలి ఏకాదశి రోజున నిర్వహిస్తాము. 2011 నుండి నేటికీ కొనసాగుతోంది. 6. శ్రీనివాస కళ్యాణాలు – ఇవి 2021 తొలి ఏకాదశి నాడు మొదలై ప్రస్తుతం 87వ కళ్యాణం నిర్వహించాము. ఇలా స్వామి కృపతో, వారి శక్తితో పై అన్ని సేవలు సంతృప్తికరంగా జరుగుచున్నాయి. కాని యోగ్యత సాధించి 'హరినామ క్షేత్రము' అనే మరో సేవను ప్రారంభించమని స్వామివారి ఆదేశం. ఇది అత్యంత కఠినమైన పని.

పూర్వము ఎందరో మహానుభావులు తగిన యోగ్యతను సాధించి స్వామివారి సాక్షాత్కారాన్ని పొందారు. కాని ఆ కాలములో వారు ఊరు విడిచి ఏకాంతంగా సాధన చేయుట వలన సాధ్యపడింది. కాని ఈరోజు పరిస్థితి వేరు, పైగా ఇది కలియుగం. నలుగురిలో జీవించాలి, నలుగురితో కలిసి సేవలు చేస్తుండాలి, ఈ సేవలకు తగిన ధనమును సమకూర్చుకోవాలి. కాబట్టి మనస్సు చంచలం అగుటకు అవకాశాలు మెండు. అయినప్పటికీ స్వామి కార్యంగా భావించి ఎన్నో కష్టాలకు ఓర్చి కొంతవరకు వచ్చామని భావిస్తున్నాము. కాని భాగవతుల ఆశీర్వాదముతో మాత్రమే ఈ పూర్తి గెలుపు సిద్ధించగలదని విశ్వసించాము. ఇందులకై స్వామివారు ప్రసాదించిన అనుభూతులను "తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం" అనే పేరుతో ఏప్రిల్ 2023 నుండి ఈ పత్రికలో ప్రచురిస్తున్నాము.

ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు ఏ పని చేసినా భక్తుల ఉద్ధరణ కోసమే ఉంటుంది. "హరినామ క్షేత్రం" కూడా భక్తుల ఉద్ధరణ కోసం అయినప్పటికీ మేము అల్పులము, శక్తిహీనులము, పైగా చంచల స్వభావము కలిగిన కలియుగ మానవులము. అరిషడ్వర్గాలను తెంచుకుని జీవించు స్వభావము కాని, శక్తి కాని లేనివారము. మీకు శరణాగతి ఘటిస్తున్నాము. మమ్మల్ని రక్షించే బాధ్యత మీదే అని వినమ్రంగా విన్నవిస్తున్నాము. మీరు సర్వశక్తిమంతులు. సంకల్పమాత్రముననే కార్యములు నిర్వహించగలరు. గత 23 సంవత్సరాల నుండి మీకు మరియు మీ భక్తులకు సేవ చేస్తున్నాము. ఈ శక్తి పూర్తిగా మీదేనని విన్నవిస్తున్నాము. ఏ విధంగా అయితే మమ్ములను ఒక పనిముట్టులాగా ఎన్నుకుని ఇంతవరకు సేవలను చేయించారో... అదే పనిముట్టుతో హరినామక్షేత్రం స్థాపించి తరతరాల జనాలను ఉద్ధరించగలరని ప్రార్థిస్తున్నాము. ఈ సృష్టిలో ప్రతి పనికి కర్త కర్మ క్రియ తమరేనని భావిస్తూ తగిన యోగ్యత ప్రసాదించి హరినామ క్షేత్రం స్థాపింప చేయుమని ప్రార్థన.

నమో వేంకటేశాయ! గోవిందా! గోవింద !!

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ______
చిరునామా: ______
పిన్‌కోడ్: ______
చందా వివరాలు: ______

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**– డా॥ కె.వి. రాఘవాచార్యులు**

**శ్లో ॥నిత్యానమ ద్విధి శివాది కిరీట కోటి**
**ప్రత్యుప్త దీప్త నవరత్న మహః ప్రరోహైః ।**
**నీరాజనావిధి ముదార ముపాద ధానౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

తాత్పర్యం – వేంకటేశ్వరా! బ్రహ్మ శివాది దేవతలు తమ తలలతో నీ పాదములు తాకి నమస్కరించునపుడు, వారి కిరీటములలో పొదగబడిన నవరత్నముల కాంతులు నీకు కర్పూర హారతి సమర్పించుచున్నట్లుగా ఉన్నది. అట్టి నీ పాదములను శరణు గోరుచున్నాను.

**శ్లో ॥'విష్ణోః పదే పరమ' ఇత్యుదిత ప్రశంసౌ**
**యౌ 'మధ్వ ఉత్స' ఇతి భోగ్యతయాఽప్యుపాత్తౌ ।**
**భూయ స్థథేతి తవ పాణితల ప్రదిష్టౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥**

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! ఋగ్వేదం విష్ణుదేవుని పాదములు పరమ శ్రేష్ఠములని, అవి తేనె స్రవించుటచే అందరికీ అనుభవింపదగినవి అని కీర్తించింది. అవి (విష్ణు పాదములవంటివే) అట్టివేయని నీ కుడిచేయి చూపుచున్న శ్రీపాదములను శరణు పొందుచున్నాను.

# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## దేవగాంధారి

ఇన్ని చేఁతలకు – నిది యొకటే
కన్నా మనసిది – కానదు గాని. ॥ పల్లవి ॥

1. పాతక కోటులు – భవములు భస్మీ
భూతము సేయఁగఁ – బొడ వొకటే,
శ్రీ తరుణీపతి – చింత నిజముగా
ఏతరి చిత్తం – బెఱుఁగదు గాని ॥ ఇన్ని ॥

2. మరణ భయంబులు – మదములు మలి నీ
కరణము సేయఁగఁ – గలదొకటే,
హరినామామృత – మందు మీఁదిరతి
నిరతము నాకిది – నిలువదు గాని ॥ ఇన్ని ॥

3. కుతిలములును దు – ర్గుణములును తృణీ
కృతములు సేయఁగ – గుఱుతొకటే,
పతియగు వేంకట – పతి సేవారతి
గతియని మతి గని – కానదు గాని ॥ ఇన్ని ॥





భావము – ఈ చెప్పబోవు పనులన్నిటిని నెరవేర్చుటకు ఇది ఒకటే సరియైన మార్గము. ఈ సంగతి గుర్తించియు చిత్తము గుర్తించినట్లు ప్రవర్తించదు.

కోట్లకొలది పాపములను, జనన మరణాది సంసార క్లేశములను కాల్చివేయుటకు తగిన సాధన మొకటే కలదు. అది లక్ష్మీపతి ధ్యానము. కాని ఈ దుష్టమైన చిత్తము ఈ విషయమును గుర్తింపకున్నది.

చావు మూడునేమో అన్న భయమును, వయస్సు, ధనము, కులము మున్నగు వానిచే గలుగు మదములను రూపు మాపుటకు తగిన సాధనమొకటే కలదు. అది విష్ణునామమను అమృతము. కాని నాకు ఎల్లవేళల ఆ యమృతము నాస్వాదించవలెనను ఆసక్తి నిలుచుటలేదు.

పలు బాధలను, దుర్గుణములను తృణీకరించుటకు చేపట్టవలసిన ఉపాయమొకటే కలదు. అది త్రిలోకాధిపతియైన శ్రీవేంకటేశ్వరుని సేవ యందలి అభిరుచి. కాని అదే గతియని నా మనస్సు తెలిసియు తెలియకున్నది.

# శ్రీవారి బ్రహ్మోత్సవములు

**– చింతలపాటి శివశంకర శాస్త్రి**



శ్లో ॥ "పంకజ సన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవ దానవ సిద్ధ సాధ్య నరాది భావిత వైభవమ్
సంకటోత్తరణోజ్జ్వల ద్రుచితోషితాఖిల సేవకమ్
వేంకటేశ్వర పాదపంకజ మాశ్రయే నిఖిలాశ్రయమ్"

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, పద్మచరణుడు, దేవదేవు డు, అనంతశక్తి స్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆపద్బాంధవుడు, అర్చామూర్తిగా ప్రసిద్ధికెక్కిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఎన్నో ఉత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర పద్ధతిన శాస్త్రోక్తంగా ఆచరింపబడుతున్నాయి. సంసార సాగర తాపత్రయ సంతోష మానసులైన భక్తజనులను ఉద్ధరించుటకై అనేకములైన నిత్య నైమిత్తిక కామ్యోత్సవాలు జరుపబడుతున్నాయి. భారత దేశంలో మరెక్కడా జరపబడని విధంగా పచ్చని తోరణాలతో కూడిన నిత్య కళ్యాణం సప్తగిరివాసునకు అత్యంత వైభవంగా జరుపబడుతున్నాయి. సుప్రభాత సేవ మొదలు ఏకాంత సేవ వరకు జరుగు ఉత్సవాలు నిత్యోత్సవాలుగానూ, సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో జరుగు విశేష పూజాది కార్యక్రమాలు వార జనిత ఉత్సవాలుగానూ, వసంతోత్సవం, పద్మావతీ పరిణయం, జ్యేష్ఠాభిషేకం, తెప్పోత్సవం, పుష్పయాగం, పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం మొదలగు ఉత్సవాలు సాంవత్సరిక ఉత్సవాలుగానూ నిర్ణయించవచ్చు.

కన్యామాస, శ్రవణా నక్షత్రము నాడు స్వామి ఆవిర్భవించిన రోజు. ఆ దినమున చక్ర స్నానాన్ని సంకల్పించిన వాహ్నిక దీక్షతో ఆబాలగోపాలం చూసి తరించు, పులకించు విధంగా అంగరంగ వైభవంగా ఆచరింపబడేది పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం. ధ్వజారోహణ, వివిధ వాహన సేవలు, కుంభ ఆరాధన, హోమం, నవసంధి మొదలగు ప్రక్రియలు వైఖానస ఆగమ శాస్త్ర రీత్యా ప్రామాణికంగా నిర్వహిస్తారు.

బ్రహ్మ ఒకనాడు ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవం చేయడానికి సంకల్పించి, అందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా స్వామిని ప్రార్థించాడు. బ్రహ్మ సంకల్పానికి స్వామివారి అనుమతి లభించింది. విధాత వైఖానస ప్రముఖులతో కూడి మునిజన సమేతుడై ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవాన్ని ప్రారంభించాడు.

**"ఉదిత్యుత్కృష్ట వచనం సవో యజ్ఞ ఉదాహృతః**
**తస్మా దుత్కృష్ట యజ్ఞత్వా దుత్సవః పరిభాష్యతే"**

అని భృగువు ఉత్సవ పదాన్ని నిర్వచించాడు. ఉత్+సవః =


ఉత్సవ. ఉత్ అనగా ఉన్నతమైన; సవః అంటే యజ్ఞమని అర్థం. అన్ని యజ్ఞములకంటె సమున్నతమైనది కనుక స్వామికి జరిపే ధ్వజారోహణ పూర్వకమైన ఈ సేవను ఉత్సవమని అత్ర్యాది మహర్షులు కూడా ప్రవచించారు.

బ్రహ్మ+ఉత్సవము = బ్రహ్మోత్సవం. చతుర్ముఖ బ్రహ్మ చేత ఆరంభింపబడిన ఉత్సవాలనేది ఒక అర్థము కాగా, సచ్చిదానంద ప రబ్రహ్మ స్వరూపుడైన శ్రీవేంకటేశ్వరునికి సంబంధించిన ఉత్సవాలని రెండవ అర్థం. ''నారాయణ పరబ్రహ్మ తత్వం నారాయణః పరం'' ఇత్యాది శృతి వాక్యములచే కీర్తింపబడుతున్న బ్రహ్మాత్మకుడైన శ్రీమన్నారాయణునకు చేస్తున్న ఉత్సవము.

''బ్రహ్మణః ఉత్సవః అథవా బ్రహ్మణే క్రియామాణః ఉత్సవః బ్రహ్మోత్సవః'' అనేది మరియొక నిర్వచనం. తొమ్మిది దినములలో జరుగుటచే శ్రీవారికి జరుగుతున్న ఈ ఉత్సవమును సర్వకామకమైన బ్రహ్మోత్సవమని ఆగమశాస్త్రం చెబుతోంది. కలియుగ ప్రత్యక్షదైవం, ఆశ్రితుల కొంగుబంగారం, ఆపద మొక్కులవాడు అయిన శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవములు అనంత ఫలదాయకాలు. సంతోషాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవి ఉత్సవాలు. ఆలయాలలో ఉత్సవాలు అనేక రకములుగా నిర్వహించుచున్నప్పటికీ, అన్ని ఉత్సవాల కంటే బ్రహ్మోత్సవాలు కమనీయం, రమణీయమైనవి. మరియు ప్రసిద్ధమైనవి.

ఈ పవిత్రోత్సవాలు ఆరంభమయ్యే తొలి రోజున జరిగే ఉత్సవం ''ధ్వజారోహణం''. ఉదయం స్వామివారికి సుప్రభాత, తోమాలసేవలు జరిగాక శ్రీదేవీ, భూదేవీ సమేత మలయప్ప స్వామికి ఏకాంతంగా తిరుమంజన ప్రక్రియ చేసి, నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలోని ధ్వజస్తంభం పైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తారు. ఋత్విక్కులు వేద మంత్రాలతో దర్భచాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభం పై వరకు చుడతారు. అనంతరం ఈ ఉత్సవాలు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాల ఏర్పాట్లను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించేందుకు స్వామివారి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయంలోని నైరుతి దిశలో ఉన్న వసంత మండపానికి విచ్చేస్తారు. ఆ తర్వాత నిర్ణీత ప్రదేశంలో భూదేవి ఆకారాన్ని లిఖించి, ఆ ఆకారమునందు లలాట, బాహు, కటి ప్రదేశాల నుండి మట్టిని తీసి ఆలయంలోకి వస్తారు. యాగశాలలో ఈ మట్టితో నింపిన తొమ్మిది పాళికలలో శాలి, వ్రిహి, యవ, ముద్గ, మాష, ప్రియంగు మొదలగు నవధాన్యములను పోసి పూజలు చేస్తారు. మహోత్సవము కొరకు తిరుమల మాడ వీధులన్నియు జెండాలతో, రత్న తోరణాలతో, పూలమాలలతో, అరటి చెట్లతో సుందరంగా అలంకరిస్తారు. మహర్షులు యాగశాలలో వేదమంత్రములతో హోమములను నిర్వహించుచుండగా ఆ మంత్రములన్నీ ప్రతిధ్వనించి తన్మయులను భక్తి భావములను కలిగిస్తాయి.

బ్రహ్మోత్సవాలలో జరిగే వాహన సేవలలో శ్రీదేవీ భూదేవీ సమేతుడైన మలయప్పస్వామి పెద్ద శేషవాహనం, ముత్యాలపందిరి వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, సువర్ణరథం, రథోత్సవం, బంగారు తిరుచ్చి వాహనాలతో వేడుకగా తిరుమల మాడ వీధులలో ఊరేగుతారు.



ధ్వజారోహణం జరిగిన రోజు రాత్రి ఉభయ దేవేరులతో ఏడు తలల బంగారు శేషుని వాహనంగా చేసుకుని శ్రీవేంకటేశ్వరుడు విశేషాలంకరణతో తిరుమల మాడవీధులలో భక్తులకు కనువిందు చేస్తాడు. బ్రహ్మోత్సవాలలో అగ్రతాంబూలం ఆదిశేషునికే దక్కుతుంది. శేషుడు శ్రీవారికి నివాస స్థలం, పడక, సింహాసనం, పాదుకలు, వస్త్రం, దిండు, గొడుగు ఇలా ఆయా సమయాలకు కామరూపియై సేవలందిస్తాడు.

రెండవరోజు చిన్న శేషవాహనంపై కృష్ణమూర్తి రూపియై ఉదయం దర్శనమిస్తాడు. గీతాచార్యుడు అర్జునునితో ''అనంతోశ్చాస్మి

నాగానః సర్పణా మస్మి వాసుకిః'' అని పేర్కొన్నాడు. అనగా నాగజాతిలో అనంతుడిని, సర్పజాతిలో వాసుకిని అని తె లియజేశాడు. పెద్దశేషవాహనం ఆదిశేషుడిగా, చిన్నశేషవాహనం వాసుకిగా భావించవచ్చు. ఆ రోజు రాత్రి స్వామివారు హంస వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి అధిష్ఠించి పురవీధులలో ఊరేగుతారు. లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొని తన్మయులవుతారు.

అనంత తేజోమూర్తి, శిష్టజన రక్షకుడు, శ్రీవేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. భగవద్గీతలో కృష్ణభగవానుడు ''మృగాణాంచ మృగేంద్రీహం'' – మృగాలలో నేను సింహాన్ని అని తెలియచేశాడు. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, గమన శక్తికి ప్రతీకగా భావిస్తారు.

సాయం సమయంలో ముత్యపు పందిరి వాహనంలో సంచరిస్తాడు. భక్తులకు కనువిందు కలిగిస్తాడు. ఆదిశేషుని వేయి పడగలను శ్రీవారికి ముత్యాల గొడుగుగా కీర్తిస్తారు.

నాలుగవ రోజు శ్రీవారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. కల్పవృక్షం కోరిన కోరికలు తీర్చే దేవతావృక్షం. శ్రీనివాసుడును కల్పవృక్షం వలె కోరిన కోరికలను తీర్చే కరుణార్ద్ర హృదయుడు. కల్పవృక్షం కన్నా అధికమైన ఫలాన్ని అనుగ్రహించగలడని, ఆ స్వామి దర్శనం అక్షయానంద దాయకమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనాటి రాత్రి స్వామి సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. విశ్వానికే ప్రభువైన శ్రీవేంకటేశ్వరుడు సర్వభూపాల వాహనంపై అధిరోహించి తన సర్వలోకైశ్వర్యత్వాన్ని చాటి ఆశ్రిత భక్తకోటికి అధికార సంపదను ప్రసాదిస్తాడు.

బ్రహ్మోత్సవాలలో అయిదవ రోజు అత్యంత ప్రధానమైనది. ఆనాటి ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం జరిగే గరుడసేవ విశిష్టమైనవి. అన్ని వాహన సేవలు వాహన మండపం వద్దనుండి ప్రారంభమైతే, ఆనాటి రాత్రి స్వామి గరుడ వాహనంపై మాడవీధులలో విహరిస్తాడు. ఈ గరుడ వాహన సేవ అన్ని సేవల కంటే సర్వోత్కృష్టమైనది. వైనతేయుడు తన తల్లి దాస్యాన్ని దూరం చేసిన ధన్యుడు. సవతి తల్లి కోరికపై సురలోకం నుండి అమృతాన్ని తెచ్చిన దక్షుడు. స్వామివారి సేవలో తరించాలన్న కాంక్షతో వాహనంగా ఉండి తరించిన భక్తాగ్రేసరుడు.

ఆరవరోజు గజ వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిస్తాడు. గజం ఐశ్వర్యానికి ప్రతీక. శ్రీనివాసుడు పార్వేటలో గజరాజును తరిమినప్పుడు పద్మావతిని చూసినట్లు, పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి కూడా ఒక గజరాజం మూల కారణమైంది. వసంతోత్సవ వేళ స్వామి కళ్యాణమూర్తిగా గజవాహనంపై దర్శనమిస్తాడు. వేంకటేశ్వరుని సహస్ర నామాలలో ''గజరక్షకః'' అని శ్రీహరిని పేర్కొనడం జరిగింది.

తెల్లని చంద్ర వాహనంపై విహరించే శ్రీహరిని సేవిస్తే భక్తకోటికి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికమనే త్రివిధ తాపాలు తొలగుతాయి. చంద్రుడు భగవంతుని మనస్సు నుండి ఆవిర్భవించాడు. అందువల్ల చంద్రుడు ఉదయించినా, చంద్రశబ్దం చెవిన పడినా ప్రకృతి చల్లదనంతో పులకించిన అనుభూతిని, హాయిని గొల్పుతుంది.

చతురంగబలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వం. ఇది రాజసానికి చిహ్నం. అశ్వారూఢుడైన అనంతుని దర్శనం అనంత ఫలప్రదం.

''రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే'' రథంపై శ్రీనివాసుని దర్శిస్తే జన్మరాహిత్యం, పరమపద ప్రాప్తి కలుగుతాయి. శ్రీవారు ఉభయ దేవేరులతో భక్తుల మనోరథాన్ని ఈడేర్చే కొంగుబంగారం. వేంకటేశ్వరుడు రథోత్సవంలో భక్తులకు కనువిందు చేస్తాడు. వివిధ వర్ణాల పుష్పాలతో, అరటి పిలకలతో, మామిడి ఆకులతో అలంకరింపబడిన రథంలో అత్యంత విలాసంగా దర్శనమిస్తాడు. రథవాహనం మీద ఉన్న మలయప్ప స్వామి దర్శనం జ్ఞానాన్ని, జన్మ కర్మాణి బంధములు లేని శాశ్వత ముక్తిని కలిగిస్తుంది. గీతాచార్యుడు సకల వేద వేదాంత సారమైన గీతను రథంపైనే నరుడికి బోధించాడు. అంతేకాక రుక్మిణీ అమ్మవారిని గౌరీపూజ అనంతరం వివాహం చేసుకుని వెళ్ళింది రథంపైనే.

వివిధ వాహనాల్లో అత్యంత విలాసంగా సేవలు అందుకున్న వేంకటేశ్వరుడు సేద తీరడానికి అందుకునే కైంకర్యం అవభృథ స్నానం. స్వామి పుష్కరిణీ తీరంలో క్షేత్రనాయకుడైన వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ ద్రవ్యాలతో అభిషేకాన్ని అందుకుని దివ్య మంగళ స్వరూపుడై భాగవతులను రంజింపచేస్తాడు. స్వామి పుష్కరిణిలో మంగళస్నానం అందుకోవడంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమవుతాయి. చక్రస్నానం జరిగిన సాయంత్రం శ్రీవారి దేవాలయంలో ధ్వజస్తంభంపై ఎగురవేసిన దేవతాహ్వానపూర్వక ధ్వజపటాన్ని అవరోహణం చేస్తారు. బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన ముక్కోటి దేవతాకోటికి ధ్వజారోహణం గరుడాళ్వార్ సాక్షిగా వీడ్కోలు పలుకుతారు.


అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవం, ఆశ్రితుల కొంగుబంగారం అయిన వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవములు అనంత ఫలదాయకములు, కైవల్యపద సోపానములు. శ్రీవారి బ్రహ్మోత్సవ వేళ శ్రీనివాసుని కమనీయ, రమణీయ, ముగ్ధమనోహర రూపాన్ని దర్శించుకుని ధన్యులమవుదాం.

**నమో వేంకటేశాయ**



31వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు



తెలంగాణలో మరో తిరుపతిగ తన
‘హరినామ క్షేత్రము’ను ఏర్పాటు చేయుటకై తిరుమల
**శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం:** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన ‘హరినామ క్షేత్రము’ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 31 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2016 నుండి జనవరి 2019 వరకు). ఈ కాలములో స్వామివారు, బహుశా నేను తపిస్తూ సాధన చేయాలని భావించి అరుదుగా వారి లీలలను చూపసాగారు. మొత్తం 111 కోట్ల జప సమర్పణ చేసినప్పటికీ నేను స్వామివారిని మెప్పించలేకపోయాను. కావున ఒక గురువును ప్రసాదించమని ప్రార్థించసాగాను. వాటిని చూద్దాం!

## ముఖములో ముఖము పెట్టి దర్శనమిచ్చుట

తేది 05-02-2016 శుక్రవారము నాడు నేను, నా భార్య తిరుమల శ్రీవేంకటేశ్వరుని శుక్రవార అభిషేక సేవ, యేల్పాచ్ వస్త్రమును చేశాము. అభిషేక సమయాన నేను స్వామివారి ముందర హాలులో వెనుక కూర్చున్నాను. నా భార్య మాత్రము ముందరనే అంటే ఈ.ఓ తరువాత రెండవ వ్యక్తి కావడము వలన నా కంటే బాగా చూడగలిగింది. స్వామివారి అరచేతిలోని గీతలను కూడా ఆమె చూడగలిగింది. నేను కూడా ముందు ఆమెతో పాటు దగ్గరలోనే కూర్చున్నాను. కాని ఎవ్వరో ముఖ్యమైనవారు రావడంతో టి.టి.డి అధికారులు నన్ను వెనుకకు నెట్టివేశారు. కాబట్టి నేను కొంచెము దూరంగా ఉన్నందున అంత స్పష్టంగా, తృప్తిగా చూడలేకపోయాను. 1 గంట 15 నిమిషములు మేము స్వామివారి గర్భాలయములో ఉన్నాము. ఉదయం 4.30 గంటలకు మొదలైన అభిషేకము 5.45 గంటల వరకు జరిగింది. చాలా సంతోషించాము. కాని నేను దూరంగా ఉన్నందున పూర్వం అభిషేక సమయాన పొందిన అనుభూతిని పొందలేదు. మరియు అంత స్పష్టంగా చూడలేదు. అందుకని స్వామివారిని మళ్ళీ ఒకసారి చాలా దగ్గరగా చూడాలనే కోరిక కలిగింది. తేది 06-02-2016 ఉదయం హైదరాబాద్ చేరుకున్నాము. నేను ఎంతో ముందు అంటే 2005 సంవత్సరంలో ఈ సేవను బుక్ చేసుకున్నప్పటికీ స్వామివారిని తృప్తిగా దగ్గరనుండి చూడలేదని బాధ పడ్డాను. హైదరాబాద్ వచ్చిన తరువాత సాయంత్రం మా ఆఫీసులో స్వామివారిని ఈ విధంగా ప్రార్థించాను. “ప్రభూ శ్రీవేంకటేశ్వరా! మీ అభిషేకము చేశాను అన్నమాటే కానీ మిమ్ములను తృప్తిగా చూడలేదు,




స్వామి వారు ముఖంలో ముఖం పెట్టి చూపుట

తృప్తి చెందలేదు . మిమ్ములను చాలా దగ్గరగా, జానెడు కంటే తక్కువ దూరములో చూడాలని ఉన్నదని, నా ఈ కోరిక తీర్చుమని ప్రార్థించాను''. నిజానికి స్వామివారిని జానెడు కంటే తక్కువ దూరము నుండి చూడాలనేది నా ఉద్దేశ్యము కాదు, కాని స్వామివారిని తృప్తిగా దగ్గరనుండి దర్శించాలన్నదే నా ఉద్దేశ్యం. వారిని తృప్తిగా చూడలేదనే ఒకింత నిరాశతో, ఆత్రుతతో ఈవిధంగా జానెడు కంటే తక్కువ దూరంలో చూడాలని ఉన్నదని ప్రార్థించాను. స్వామివారు కరుణించారు, నా ముఖంలో తన ముఖము పెట్టి చూడు చూడు అంటూ చూపెట్టారు. ఇది ఒక అద్భుతమైన లీల. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 07-02-2016 కల:** నేను మా ఇంటి వెనుక, యూనివర్సిటీ వైపు ఉన్న బాల్కనీలో నిలబడ్డాను. ఆ బాల్కనీకి పిట్టలు లోనికి రాకుండా ఒక ఇంచ్ గ్యాపులు కలిగిన ప్లాస్టిక్ జాలీ బాల్కనీ పిట్టగోడకు కొట్టబడ్డది. నేను ఆ బాల్కనీలో నిలబడి నా రెండు చేతులతో ఆ జాలీని పట్టుకుని, దాదాపు ఆ జాలీకి నా ముఖమును ఆనించి బయటి దృశ్యమును చూస్తున్నాను.నా రెండు చేతులతో, నా చేతి వ్రేళ్ళను ఆ జాలీ రంధ్రాల లోనికి చొప్పించి నా చెవుల లెవెల్లో ఈ జాలీని నా వ్రేళ్ళతో పట్టుకున్నాను. బయట యూనివర్సిటీలో ఏదో ఒక దృశ్యమును చూస్తూ నిలబడ్డాను. ఇంతలో బయట మా గురువుగారి రూపము కనబడ్డది. ఈయన ఎవ్వరో తెలియదు, ముఖము గుర్తు పట్టలేను కాని ఈయన నా గురువు అనే భావము నా మనస్సు లోనికి వచ్చింది. ఇంతలో ఇదే గురువు నాకు, నేను పట్టుకున్న జాలీకి మధ్యన క్రిందినుండి పైకి చొచ్చుకు వచ్చారు. ఈయన చక్కని రూపురేఖలు కలిగిన ముఖము కలవాడు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని ముఖ పోలికలను నూటికి నూరుపాళ్ళు కలిగి ఉన్నాడు. ఈయన నల్లగానే ఉన్నాడు, కాని అంత నల్లగా లేడు. ఆయన రూపు రేఖలను చూచిన వెంటనే మీరు నా గురువు కాదు తిరుమల స్వామివారు అని అనుకున్నాను. ఆయన కళ్ళు నా కళ్ళు, ఆయన ముక్కు నా ముక్కు, ఆయన నోరు నా నోరు దాదాపు ఒక ఇంచు దూరములో మాత్రమే ఉన్నవి. మా గురువనుకుని ముందు ఏదో మాట్లాడాను. ఎందుకు నీవు సరిగా మసలుకోలేదని ఏదో అన్నాను. అందుకు ఆయన ''నీవు కోరితే అలా మసులుకునేవాడినని'' ఏదో ఒకటి చెప్పారు. నిజానికి ఆయన చెప్పలేదు, నోరు తెరవలేదు కాని ఆకాశము నుండి ఆయన మాట్లాడినట్లు మాటలు వినబడ్డాయి. ఆయన ముఖమును చూచిన వెంటనే ఈయన నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడే అని అనుకుని ఒక్కసారి ఖిన్నుడనైనాను. ఆ చెవులు, ముక్కు, నోరు, చిన్న చిన్న పెదవులు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. చూడు ఇంకా చూడు, మళ్ళీ మళ్ళీ చూడు, నీ తనివి తీరా చూడు అనే భావాలు నా మనస్సున పదే పదే వచ్చాయి. తనివితీరా దర్శించాను. కలలోనే స్వామీ...! నా నిన్నటి కోరికను ఈ విధంగా తీర్చారంటూ కోటి ప్రణామాలను అర్పించాను. నా ఆనందానికి హద్దులు లేవు. కల చెదిరింది. తెల్లవారి కూడా నా ఆనందము తారాస్థాయికి చేరింది. స్వామివారిని ఇంత దగ్గరగా ముఖములో ముఖము పెట్టి చూచే అదృష్టము పొందినందుకు ఎంతో సంతోషించాను. ఆ రూపురేఖలు మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చాయి, నా మదిలో ముద్రించుకున్నాయి.

## జీవితము క్షణభంగురము

జనరల్ చెకప్‌లో భాగంగా నా హృదయంలో బ్లాకులు ఉన్నవని తెలిసి 2016 లో ఒక స్టెంట్ వేశారు. ఆరోగ్యంగా ఉన్నాను, కాని జీవితం క్షణభంగురమని తెలిసింది. స్వామివారు నన్ను మరచుట వలన ఈ అనారోగ్య సమస్య వచ్చిందని బాధపడసాగాను.

## స్వామివారు దూరం కాలేదు - శుచిత్వమును సూచించుట

గ త కొన్ని రోజుల నుండి స్వామివారు మునుపటిలాగా అనుభూతులను చూపుట లేదు. రెండు మూడు నెలలకు ఒకసారి చూపుతున్నారు. పైగా నన్ను ఆదుకోలేదనే బాధతో ఉన్న నాకు చాలా రోజుల తరువాత స్వామివారు ఒక లీలను చూపెట్టారు. చాలా సంతోషించాను. మళ్ళీ స్వామివారి కరుణకు పాత్రుణ్ణి అవుతున్నందులకు మురిసిపోయాను.

**తేది 28-03-2016 కల:** అది శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారి ఆశ్రమము లాంటిది. వారు ఏవో పూజలు చేస్తున్నారు. వారిని బహు చక్కగా దర్శించాను. మరియు వారితో పాటు వారి శిష్య బృందము చాలామంది ఉన్నారు. అందులో కొందరు నాకు తెలిసినవారట. నన్ను వారు గుర్తు పట్టారు. నా వద్దకు ఒక ఇద్దరు ముగ్గురు శిష్యులు వచ్చారు. మేము ఇదివరకు చేయించిన పూజల గురించి వివరించారు. ఆ తరువాత ఒక చాలా చిన్న వయసున్న శిష్యుడు ప్రేమతో నన్ను ముట్టుకున్నారు. నేను తగదంటూ ప్రక్కకు తప్పుకున్నాను. అప్పుడు అక్కడ ఉన్న పెద్ద స్వామి అలా చేయవద్దని, ముట్టుకోవద్దని చిన్న శిష్యునితో అన్నారు. కల చెదిరింది. మొత్తం మీద శ్రీవైష్ణవ స్వాముల కలయికను చూచాను, వారితో మాట్లాడాను. మరియు శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారిని చూచుట కూడా జరిగింది. దీనర్థం – నేననుకుంటున్నట్లు స్వామివారు దూరం కాలేదని, మా మధ్యన బంధం కొనసాగగలదని, మరియు శుచిత్వం అలవాటు కాగలదని సూచించారు.

ఇంతటితో నేను వ్రాసుకున్న మొత్తం 6 అనుభూతుల పుస్తకములలో 5వ పుస్తకము పూర్తైంది. ఇంతవరకు మొత్తం 358 కి పైగా స్వప్న అనుభూతులను, మరెన్నో హృదయాంతర భావాలను తెలిపాను. ఇప్పటి నుండి ఆరవ భాగపు అనుభూతులను తెలుపుచున్నాను. ఈ భాగములో తేది 31-03-2023 వరకు 203 అనుభూతులు ఉన్నప్పటికీ ఇందులో నేను స్వామివారు చెప్పినట్లు వినక తప్పు చేశాననే పశ్చాత్తాపము ఎక్కువగా ఉంటుంది.

## స్వామి కోసం వేచి చూచుట

5వ పుస్తకములో చివరి అనుభూతి తేది 28-03-2016 న వచ్చింది. 6వ పుస్తకము తేది 04-01-2017 నుండి వ్రాశాను. ఈ 8 నెలలు స్వామివారి అనుభూతులను పొందలేదు. 2000 సంవత్సరం నుండి మార్చి 2016 వరకు స్వామివారు మమ్ములను తన వైపు త్రిప్పుకొనుటకు ఎన్నో అనుగ్రహాలను ప్రసాదిస్తూ లీలలను చూపెట్టారు. వరుసగా 10 రోజులు ఆయన లీలలను చూడకుండా ఉండలేని స్థితిని కల్పించారు. కాని ఏప్రిల్ 2016 నుండి వారి లీలలను చూపుట మానివేశారు. నేనెన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. వరుసగా 8 నెలలు స్వామివారి లీలలను చూడలేదు, కాబట్టి నేనే స్వామివారి చెంతకు పోవుటకు సిద్ధమైనాను. స్వామివారు చెప్పినట్లు హరినామ క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తే, స్వామి కృపను తిరిగి పొందగలనని తీవ్రంగా ప్రయత్నించాను. మరియు ఈ 8 నెలల కాలము ఏమి చేశానని తేది 17-12-2023 రోజున, ఈ 31వ భాగము అనుభూతులను వ్రాయునప్పుడు స్వామివారిని తెలుపమని ప్రార్థించాను. ఆయన ఈ రాత్రి అంటే తేది 18-12-2023 నాడు "నీవు వేచి చూస్తున్నావు" అంటూ తెలిపారు. ఉదా: ముక్తినాథ్ లాంటి క్షేత్రానికి వెళ్ళి కొంత దూరములో దేవస్థానము వారు భక్తులకు ఏర్పాటు చేసిన విడిది ప్రదేశములో వేచి చూస్తున్నట్లు చూపెట్టారు. కాని ఈ ప్రాంతము తమిళనాడు వైపు ఒక గుట్టపైన తెలుపు నలుపు పులి చారలలాగా ఉన్న ఒక పరుపు బండపైన ఉన్నట్లు భావించాను. ఆ ఆలయము వారు హెలికాప్టర్ లాంటి వాహన సదుపాయము పంపేవరకు ఈ వేచి ఉండుట జరుగును అని తెలిపారు. మరియు నా ప్రవర్తన, అభిరుచులు చూసి, నేను ఇతర భక్తులతో పోల్చితే మెరుగైన స్థితిలో ఉన్నానని కూడా చెప్పారు. దీనర్థం : నేను లోకంలోని ఇతరుల కంటె మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, స్వామివారు ఆశించిన స్థితికి చేరుకోలేదు. మరియు ఈ 8 నెలల కాలంలో 14వ జప సమర్పణ ఈ విధంగా జరిగింది.

## 14వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సంకల్పించిన 111 కోట్ల జప సమర్పణలో భాగంగా 14వ పర్యాయంగా 7 కోట్ల జపమును గోకులాష్టమి తేది 25-08-2016 గురువారం నాడు తిరుపతిలో సమర్పించాము.

అంతకుముందు ఈ జపానికి మా ఇంటిలో తేది 24-07-2016 నుండి 30-07-2016 వరకు 7 రోజులు ప్రత్యేక పూజలు చేశాము. తేది 30-07-2016 నాడు 'నమో వేంకటేశాయ' రథయాత్రను ప్రారంభించాము. శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతుల ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమము జరిగింది. హైదరాబాదులో తేది 16-08-2016 వరకు తిరిగిన పిదప కృష్ణా పుష్కరాలు కావడం వలన బీచుపల్లి, రంగాపూర్,

అలంపూర్ మొదలగు కృష్ణానది పుష్కర ప్రాంతాలలో తిరిగి, ఆ తరువాత నంద్యాల, గిద్దలూరు, కడప చూచుకుంటూ తేది 23-08-2016 నాడు తిరుపతి చేరాము.

తేది 24-08-2016 నాడు సాయంత్రం అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించాము. తేది 25-08-2016 గోకులాష్టమి గురువారం నాడు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జప హోమాదులు నిర్వహించాము. ఈ.ఓ శ్రీమాన్ సాంబశివరావు గారు పూర్ణాహుతి సమర్పించి జపమును స్వామివారికి సమర్పించారు. ఆ తరువాత 15వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని ప్రారంభించారు. ఆ తరువాత భక్తులు తలా కొంత జపమును స్వామివారికి సమర్పించారు.


ఆ తెల్లవారి కొండపై స్వామివారిని దర్శించి, స్వామివారి కళ్యాణము కూడా చేసి తేది 28-08-2016 ఉదయం హైదరాబాద్ వచ్చాము.

## జపమాల, మంత్రోపదేశం, మొదటి భజన

గత కొన్ని నెలల నుండి స్వామివారి లీలలను చూడలేదు. నేను చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్వామివారు నన్ను మరచారని, పట్టించుకొనుట లేదని భావించాను. నేను చేయు ప్రార్థనలను స్వామివారు వింటున్నారా? అని అనిపించే విధంగా నా మనస్సు తయారైంది. కాని పూర్వపు జ్ఞాపకాల వలన నా స్వామి ప్రతీది వింటున్నారు, చూస్తున్నారు. కాని నాకు అనుభూతిని కలిగించుటలేదు అని అనుకున్నాను. స్వామివారిని కనబడమని, నా ప్రార్థనను వినమని, కనీసం ఏదైనా అనుభూతిని కలిగించమని ఎన్నోసార్లు వేడుకున్నాను. కాని లాభం లేకపోయింది. ఇక చేసేది లేక స్వామివారి దయ అనే స్థితికి వచ్చాను.

నేను చేసిన తప్పుల వలన లేదా నేను స్వామివారి ''హరినామ క్షేత్రం'' ఏర్పాటును మరచుట వలన నాకు స్వామివారు దూరమైనారని భావించాను. నిజానికి నేను జీవిస్తున్నదే నా స్వామిని పొందుట కోసం. అలాంటిది నా స్వామివారు దూరం కావటం వలన చాలా బాధ పడ్డాను. ఎలాగైనా తిరిగి స్వామి కృపను పొందాలని, అందుకు ''హరినామ క్షేత్రమును'' ఎలాగైనా ఏర్పాటు చేయాలని భావించాను. దీనికి తగిన స్థలమును వెతుకుట ప్రారంభించాను. 'ఈనాడు' పేపరులో తేది 01-04-2017, 07-04-2017 మరియు 14-04-2017 మూడు ఆదివారాలు, మరియు శ్రీవేంకటేశం మాసపత్రికలో తగిన స్థలము కొరకు ప్రకటన ఇచ్చాను. ప్రజల స్పందనను చూచాను. మరియు గత 2 రోజుల నుండి ''శ్రీనివాసా గోవిందా, శ్రీవేంకటేశా గోవిందా'' అనే మహా మంత్రమును అఖండ హరినామ సంకీర్తనకు వాడవచ్చా? తెలుపమని ప్రార్థించాను. చివరికి అతి కష్టము మీద, నా అదృష్టం అన్నట్లు నేటి రాత్రి ఒక చిన్న కలతో స్వామివారి ప్రసాదము లభించింది. మహా భాగ్యమని భావించాను.

**తేది 08-04-2017 కల :** నేను ఎక్కడో ఒక హరేరామ హరేకృష్ణ మఠము లాంటి హరిక్షేత్రమునకు పోయాను. ఆ క్షేత్రములో ఒక శ్రీ వైష్ణవ స్వామీజీవారు, అత్యంత పరిపూర్ణుడు, గొప్ప మహాత్ముడు, సాధుపురుషుడు లాంటివారు ఉన్నారు. ఈయన ఇలాంటి ఎన్నో క్షేత్రాలకు గురువట, ప్రస్తుతం ఇక్కడికి వచ్చారట. ఈ క్షేత్రములో మంచి గురువుగారు కలరు అని నాకు వెనుక నుండి ఎవరో చెప్పారు, లేదా ఆకాశము నుండి ఈ మాటలు వినబడ్డాయి. నేను ఈయనను కలవాలని వారి గుమ్మం వద్దకు వెళ్ళి నిలబడ్డాను. చివరికి ఈ స్వామీజీ లోనుండి బయటకు వచ్చి నన్ను చూచి, చిరునవ్వుతో జపమాలగా రుద్రాక్షమాలను ఇచ్చుటకు ముందుకు వచ్చారు. అప్పుడు నేను మరియు నా వెనుక ఉన్న మరో చేయి నాకు కావాలంటే నాకు




జప మాలను ప్రసాధించుట

కావాలని చేతులను చాపాము. కాని ఆ స్వామి చిరునవ్వుతో నన్నే చూస్తూ నా చేతిలోనే ఈ మాలను పెట్టి ఆశీర్వదించారు. వెంటనే ''శ్రీనివాస గోవింద, శ్రీవేంకటేశ గోవింద'' అనే మంత్రమును అఖండ హరినామ సంకీర్తనకు వాడమంటూ ఒక హృదయాంతర భావము ఏర్పడ్డది. కలలోనే ఆనందించాను. ఇంతేకల.

స్వామివారు ఈ మంత్రమును వాడుకొమ్మని సూచించారు, కాబట్టి తేది 15-04-2017 శనివారం సాయంత్రం 6.22 గంటల నుండి ఒక గంట వరకు మా ఆఫీసులో నేను మరియు మరో ముగ్గురు భక్తులు కలిసి భజన ప్రారంభించాము. స్వామివారిని స్మరించి దీవించమని ప్రార్థించి ''శ్రీ శ్రీనివాసా

గోవిం దా! శ్రీవేంకటేశా గోవిందా! గోవిందా హరి గోవిందా వేంకట రమణా గోవిందా!" అంటూ రెండు చరణాలు మాత్రమే పాడుతూ ప్రారంభించాము. దీనిని ఒక గంట కాలము చేసి స్వామివారికి ప్రసాదం నివేదించి, హారతి ఇచ్చి ముగించాము. ఈ విధంగా మొదటి భజన మా ఆఫీసులో తేది 15-04-2017 రోజున ఒక గంట కాలము జరిగింది. దీనిని ప్రతి శనివారము చేయాలని నిర్ణయించుకున్నాము.

## కాలమాన పట్టికను మార్చకుండుట

తేది 15-04-2017 శనివారం రోజు సాయంత్రము కేవలం ఒక గంట భజన చేయుటలోనే నేను అలసిపోయాను, గొంతు బొంగురు పోయింది. ఒక గంటకే ఈ విధంగా ఉంటే, రోజు మొత్తం ఎలా చేయాలని అనుకున్నాను. నా ఈ అశక్తిని స్వామివారికి తెలపాలనుకున్నాను. చివరికి ఏది ఏమైనా దీనిని చేసి తీరాలనే పట్టుదల నాలో కలిగింది. అంతా ఆయనకే వదిలి శరణాగతుణ్ణి కావాలని భావించాను. మరియు ఆలస్యమైనప్పటికీ చివరికి స్వామివారు సూచించిన మార్గము లోనికి వచ్చినందులకు స్వామివారు సంతోషించి ఈ క్రింది లీలను ప్రసాదించారు.

**తేది 24-04-2017 కల :** అది ఒక స్వామివారి ఆలయం. మేము ఆ ఆలయ బాగోగులు చూచుకుంటున్నామట. ఒక సందర్భములో ఆ పెరుమాళ్ళ ఉత్సవమును జరిపించాలి. దాని కొరకు కొన్ని ఏర్పాట్లు చేయవలసి ఉన్నది, కొన్ని ఆభరణములను చేయించవలసి ఉన్నది. వాటిని మేము కొంత ఆలస్యముగా చేయించి, ఇంటి నుండి గుడి దగ్గరకు తీసుకుపోవుచున్నాము. ఇంటి నుండి గుడి దాదాపు 2-3 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. స్వామివారి ఆభరణాలు కాబట్టి నేను ఒక్కడినే కాకుండా, మా ఇంటివారితో పాటు మరికొందరిని వెంటపెట్టుకుని నేను స్వామివారికి ఇచ్చుటకు గుడికి బయలుదేరి కొంతదూరం వెళ్ళాను. కాని తగిన సమయము, సుముహూర్తము దాటిపోతుందని భావించిన పురోహితులు, మాకు తెలియకుండానే ఈ ఉత్సవమును ప్రారంభించి ఎలాగూ మేము ఈ ఆభరణములను తప్పక తెచ్చుదుమని దృఢంగా విశ్వసించి, స్వామివారిని తీసుకుని ఊరేగింపుగా మాకు ఎదురుగా వస్తున్నారు. వీరిని చూచిన నేను చాలా ఆనందించాను. మాపై ఉన్న నమ్మకంతో ఇలా వస్తున్నారని, సమయం ఆదా చేశారని భావించాను. కల చెదిరింది.

దీనర్థం – నేను ఆలస్యంగా స్వామి దారి లోనికి వచ్చినప్పటికి, స్వామివారు మాత్రం నేను తప్పక వారి దారికి చేరుదునని నమ్మి వారి కాలమాన పట్టికను మార్పు చేయలేదు. దీనికి నేను ఎంతో కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

## స్వామివారు నొచ్చుకొనుట

సృష్టిలో భగవంతునితో పాటు దుష్టశక్తి కూడా ఉంటుంది. ఈ శక్తి మనలను భగవంతుని దగ్గరకు పోనివ్వకుండా చేస్తుంది. ఏదో రకమైన సమస్యలను సృష్టించి, మన మనస్సును అన్య విషయాలపై పోవునట్లు చేస్తూ భగవంతుని మార్గానికి అడ్డుకట్ట వేస్తుంది. బహుశా నాకు ఇదే జరిగింది. స్వామివారు వారి ఎన్నో దివ్యమైన లీలలను చూపెట్టినప్పటికీ కొద్ది రోజులలోనే వాటి ప్రభావము మరచి, మామూలు వానిగా ఇంకా చెప్పాలంటే స్వామి సంకల్పానికి వ్యతిరేకంగా మారే వాడిని. దీనితో స్వామి నొచ్చుకునే వారు. ఒక్కొక్కసారి దండించేవారు, చీవాట్లు పెట్టేవారు. ఇలాంటి గంభీరమైన సంఘటన నా జీవితంలో ఒకటి జరిగింది. అది ఇలా ఉంది.

గత కొన్ని నెలలుగా శ్రీవేంకటేశం మాస పత్రికపై తగిన రీతిలో శ్రద్ధ చూపలేదు. ఇందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. ఈ పత్రికకు రచయితలు తగినంత వ్యాసాలు వ్రాయుట లేదు. ప్రజలు తగిన సంఖ్యలో చదువుట లేదు. నేను కూడా నా మనస్సును కేంద్రీకరించకపోవుట వలన సంపాదకీయమునే సరిగా వ్రాయుటలేదు. ఒకరకంగా చెప్పాలంటే బలవంతంగా ఈ పత్రికను నడుపుచున్నానన్న రీతిలో జరుగుచున్నది వ్యవహారం.

తేది 01-05-2017 సాయంత్రం ఒక్కసారి నా మనస్సులో ఈ పత్రిక గురించి చెడు ఆలోచన వచ్చింది. చాలారోజుల నుండి స్వామివారు ఎలాంటి అనుభూతిని కలిగించకపోవుట వలన కూడా నిరుత్సాహం పెరిగింది. మొత్తం మీద ఏది ఏమైనా నా మనస్సులో నేను ఈ పత్రికను నడుపుటలో ఎలాంటి ఉపయోగం లేదు, నా స్వామి ఆజ్ఞ ప్రకారం 16వ పర్యాయంగా 7 కోట్ల జపము సమర్పించేవరకు మాత్రమే దీనిని నడుపుతాను. ఆ తరువాత స్వామివారు శిక్షించినా సరే దీనిని నిలుపుతానని నిర్ణయించుకున్నాను. అంటే సెప్టెంబర్ 2018, ఇంకా 16 నెలల వరకు నడిపి ఆపుతానని అనుకున్నాను. 16 నెలల వరకు తగిన ఆర్టికల్స్ ను కూడా చూచుకున్నాను. ఈ నెలతో ఒకటి తగ్గుతుంది. అంటే ఇంకా 15 మాత్రమే ఉన్నవని కూడా అనుకున్నాను. ఈ విషయం నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి చెప్పాలనిపించింది. కాని చెప్పలేకపోయాను. నోటినుండి మాట రాలేదు. కాని ప్రభూ! నా మనస్సులో ఏముందో మీకు తెలుసని ప్రార్థించాను. స్వామివారి స్పందన ఏముంటుందో చూడాలనుకున్నాను. కాని కొన్ని రోజుల వరకు ఏమీ లేదు. నా మనస్సులో మాత్రం ఈ భావన ఇలాగే బలంగా కొనసాగుతోంది.

మేము గత 15 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరము 7 కోట్ల జప సమర్పణ, నమో వేంకటేశాయ రథయాత్ర మరియు శ్రీవేంకటేశం మాసపత్రిక అనే మూడు రకాల సేవలను చేస్తున్నాము. కాని ఇప్పుడు, శారీరక, ఆర్థిక బాధలచే మరియు

రథయాత్ర వలన ఇం టిలోని అధిక పని భారముచే 2018 సంవత్సరంలో నా సంకల్పం తీరిన వెనువెంటనే శ్రీవేంకటేశం మాసపత్రికను, నా వయస్సు 60 వచ్చిన తరువాత అంటే 2020 తరువాత నమో వేంకటేశాయ రథయాత్రను కూడా నిలిపివేయాలని నిర్ణయించుకున్నాము. ఒక్క జప సమర్పణను మాత్రము జీవితాంతం కొనసాగించాలని భావించాను. నేను నా స్వామివారికి మొక్కు చెల్లించుకొనుటకు సేవ చేయుట లేదు, నేను ఆయన సేవకుడను, నా జీవితం ఉన్నంత వరకు నా వద్దకు వచ్చిన ప్రతి భక్తునికి నా ప్రభు జప పుస్తకాన్ని ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. శ్రీవేంకటేశం మాసపత్రికను మరియు రథయాత్రను మానుకుంటాను కాని జప సమర్పణ కార్యక్రమాన్ని మాత్రం జీవితాంతం కొనసాగించ నిర్ణయించుకున్నాను. 16వ పర్యాయంగా 7 కోట్ల జప పుస్తక ముద్రణ సమయాన ఈ కార్యక్రమము 2018 తో ముగియదని, స్వామివారి కృపతో జీవితాంతం కొనసాగగలదని ఆ పుస్తకములో తెలుప నిర్ణయించాము. దీనిని స్వామివారు ఆదరించారు. కాని శ్రీవేంకటేశం మాసపత్రికను మానివేయుటకు ఎంతమాత్రం సహించలేదు. మూసివేస్తాననే నా భావనను మరి మూడు నెలలు పెరగనిచ్చి దీనికి తగిన జవాబిచ్చారు.

మరో ముఖ్యమైన విషయము. ఎందుకో గాని 15వ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించిన నాటి నుండి నాలో స్వామివారిని పొందాలనే భావం క్రమ క్రమంగా పుంజుకుంది. 16వ పర్యాయంగా 7 కోట్లు సమర్పించిన తరువాత నా ప్రభు తప్పక నాకు ఒక మంచి బహుమానం ఇవ్వగలరని, బహుశా ఆయన దివ్యదర్శన భాగ్యమును పొందగలనని భావించాను. కాబట్టి ఆ ఘడియ కోసం వేచి చూస్తున్నాను. ఈ భావన ద్వారా ఎంతో మానసిక మార్పుకు గురైనాను. క్షణం వదలక స్వామివారి చింతనలో ఉండుట వలన, చెవుడు వచ్చిందనే స్థితితో పాటు చిక్కిపోసాగాను.

## స్వామివారికి 15వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

15వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకై తేది 21-07-2017 నాడు రథయాత్ర ప్రారంభించాము. 17 రోజులు అనగా తేది 07-08-2017 వరకు హైదరాబాద్ లో తిరిగింది. ఆ తరువాత విజయవాడ, గుంటూరు, బాపట్ల, చీరాల, ఒంగోలు, చీమకుర్తి, నెల్లూరులో తిరిగి తేది 13-08-2017 సాయంత్రానికి తిరుపతి చేరింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. భక్తులు, మేము సంతోషించాము.

తేది 14-08-2017 సాయంత్రం పాదాల మండపం వద్ద ఈ జపమును స్వామివారి పాదాలకు సమర్పించాము. జపము వ్రాసిన వారి కోరికలను తీర్చుమని, మా సేవను స్వీకరించుమని వేడుకున్నాము.

తేది 15-08-2017 ఉదయం ఎస్.వి. గోశాలలో పూజ మరియు యజ్ఞం చేశాము. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు వారి రాష్ట్ర జెండా వందనాన్ని తిరుపతిలో చేయుట వలన ఈ.ఓ గారు ముఖ్యమంత్రి వద్దనే ఉండుట వలన యజ్ఞ పూర్ణాహుతికి రాలేకపోయారు. డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కె.హరినాథ్ రెడ్డి గారే పూర్ణాహుతి కావించారు. చివరికి జాయింట్ ఈ.ఓ గారు వచ్చారు. ఆ తరువాత జపమును స్వామివారికి స్థూపములో సమర్పించాము. ఆ తరువాత 16వ 7 కోట్ల జపమునకు శ్రీకారము చుట్టారు. మొత్తం మీద 15వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దిగ్విజయంగా పూర్తైనది. మరియు 16వ పర్యాయంగా 7 కోట్ల జపము ప్రారంభించబడ్డది. నా సంకల్పం ప్రకారంగా ఇది చివరిది, అయినప్పటికీ స్వామి సంకల్పానుసారం పని చేస్తానని అనుకున్నాను. ఆ తరువాత కొండపైకి వెళ్ళి స్వామివారిని దర్శించుకుని తేది 18-08-2017 నాడు హైదరాబాద్ వచ్చాము.

## 15వ జప సమర్పణలో స్వామివారి అనుభూతులు – అప్పుడే దమ్మొచ్చిందా?

గత కొన్ని నెలలుగా శ్రీవేంకటేశం మాసపత్రికను సెప్టెంబర్ 2018 తో ముగిస్తాననుకున్నాను. స్వామివారి శిక్షనైనా భరిస్తాను కాని ఈ పత్రికను మాత్రం మూసివేస్తాననుకున్నాను. అంత దృఢ సంకల్పముతో ఉన్నాను. ఇలా మాసపత్రికను మూసివేయుట స్వామివారికి నచ్చలేదు. దీనితో స్వామివారు ఉగ్రుడైనారు. చివరికి ఎంతటి విరక్తి భావనతోటి ఈ మాసపత్రికను మానేద్దామనుకున్నానో అంతే నీచమైన పదమును ఉపయోగించి నా మనస్సు మారే విధంగా చేశారు. ఒక్కసారి నా మనస్సు తిరిగిపోయింది. పత్రికను కొనసాగించ నిర్ణయించాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

తేది 29-07-2017 నాటి ఉదయం స్వామివారు నాకు చాలా ఘాటైన కలను కలిగించారు. గత కొన్ని నెలల నుండి నా మానసిక దృష్టి అనుసారము, దానికి తగినట్లుగా, నా మనస్సు పరివర్తనము చెందడంతో, నాపై చాలా కోపంగా ఉన్నట్లు తోచింది. సేవకుడు తప్పు చేస్తే యజమాని శిక్షించునట్లు లేదా బెదిరించునట్లుగా అనిపించింది. అప్పుడే దమ్మొచ్చిందా? అంటూ ఘాటుగా హెచ్చరించారు. ఆ పదాన్ని చెప్పాలంటే సిగ్గేస్తుంది.

**తేది 29-07-2017 కల:** రథయాత్రలో ఉన్నాను కావున అలసి గాఢంగా నిద్రపోయాను. ఉదయం 5 గంటలకు వచ్చిందీ కల.

అది ఒక పందెపు పరుగు. ఒక నిర్దిష్టమైన ఇంటివరకు నేను వెళ్ళాలని నియమము. దీనికోసం చాలా దూరము నుండి ఒక పందెపు జీపులో వస్తున్నాను. నేను ఆ జీపు ముందు భాగాన, డ్రైవర్ ప్రక్కసీటులో కూర్చున్నాను. డ్రైవర్ ఎవ్వరూ లేరు, నాకు

కనబడలేదు కాని చాలా వేగంగా ఈ జీపు పరుగెత్తుచున్నది. ఒక అదృశ్య శక్తి ఈ జీపును నడుపుచున్నది. మేము దాదాపు మా నిర్దిష్ట ఇల్లు వరకు వచ్చాము. ఇంకా చాలా కొద్ది దూరమే ఉన్నది, ఆ ఇల్లు కనబడింది. ఒక పొడుగాటి వీధి మధ్యలో ఈ ఇల్లు ఉన్నది. ఇంకో పదిళ్ళు దాటితే లక్ష్యం వస్తుంది. ఇంతలో నాకు మల విసర్జన చేయాల్సిన అవసరం ఏర్పడింది. పొత్తి కడుపు నొప్పి కలుగుతోంది. ఎంత ప్రయత్నించినా ఆపుకోలేకపోయాను. చివరికి మా నిర్దిష్ట ప్రదేశం చేరకమునుపే ఈ జీపులోనే విసర్జించాను. కాని ఈ జీపుకు మల విసర్జనకు కావలసిన ఏర్పాటు ఉన్నదట. నాకు కాని, జీపుకు కాని ఏమీ కాలేదు, అంటలేదు. నేను అంతా చూచుకున్నాను. అంతా బాగానే ఉన్నది. కాని ఈ విధంగా అయిందేమని అనుకున్నాను. కల చెదిరింది.

ముందు దీనర్థమును తెలుసుకోలేదు. ఆలోచించగా మూడు నాలుగు రోజుల తరువాత దీని సరైన అర్థమును గ్రహించాను. మోటుగా చెప్పాలంటే ఇలా ఉంది. ''దగ్గరికి వచ్చేసరికి దొడ్డికొచ్చిందా?'' అని ఎగతాళిగా అన్నారని భావించాను. అంటే శ్రీవేంకటేశం మాసపత్రికను ఇంకా కొనసాగించమని ఆజ్ఞాపించారన్నమాట. దీనితో నా మనసుకు చాలా బాధేసింది. ఇంత పెద్ద స్వామివారితో ఇంత నీచపు మాటను పలికే విధంగా చేశానని సిగ్గుపడ్డాను. క్షమించమని, తప్పైందని ప్రాధేయపడ్డాను.

## దుష్టశక్తి నుండి రక్షించుట

లోకంలో భగవంతునితో పాటు దుష్టశక్తి కూడా తన ప్రభావాన్ని చూపుతుంది. ఇది రకరకాల ప్రయత్నాల ద్వారా మనలను స్వామి నుండి దూరము చేయుటకు ప్రయత్నిస్తుంది. సదా భగవంతుని స్మరణ చేయువారి వద్దకు ఇది రాదు. వ్యాపారము మానివేసి ఏకాంతము లభించిన తరువాత ఈ ఏకాంతాన్ని నూటికి నూరుపాళ్ళు సద్వినియోగం చేసుకోలేదు. అప్పుడప్పుడు మనస్సు లౌకిక విషయాలపై లాగేది. దీనికి తోడు ఈ మధ్యన మా పెద్ద కుమారుడికి పెండ్లి సంబంధాలు చూచే విషయమై నేను చాలామందితో మామూలు వ్యక్తిగా, లౌకికంగా వ్యవహరించాను. స్వామి స్మరణకు కొంత విరామం ఏర్పడ్డది. దీనిని ఆసరాగా చేసుకొని ఆ దుష్టశక్తి నన్ను స్వామినుండి మరింత దూరం చేయ ప్రయత్నించింది. కాని నేను స్వామివారి సహాయముచే దీనిని అధిగమించే ప్రయత్నాలు ఎన్నో చేశాను. చివరికి ఈ దుష్టశక్తి నన్ను అంతం చేయుటకు విశ్వ ప్రయత్నం చేసింది. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 10-10-2017 కల:** ఇది ఒక అసాధారణమైన కల. నేను ఒక ట్రాక్టరుపై వెనకాల కూర్చున్నాను. ఒక అదృశ్య వ్యక్తి దీనిని నడుపుచున్నాడు. అతడు నన్ను ఒక క్రొత్త ప్రదేశానికి తీసుకుపోవుచున్నాడు. నేను మాత్రము ఏమీ తెలియక ఎక్కడికి తీసుకుపోవుచున్నాడా? అని అనుకొన్నాను. ఇంతలో ఇతడు కొండలు, గుట్టలు కలిగిన, పచ్చికబయళ్ళతో దట్టమైన చెట్లచే ఆవరించబడిన ఒక నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళాడు. అది ఒక స్మశానం లాగా ఉన్నది. బాగా బలిసి నిగనిగలాడుచున్న పెద్ద పెద్ద రాబందులు ఆ ప్రాంతమంతా తిరుగుచున్నవి. చివరికి అది ఒక స్మశాన ప్రదేశమని అర్థం అయ్యింది. కాని చాలా ప్రశాంతంగా ఉన్నది. ఈ వ్యక్తి నన్ను ఆ నిర్జన ప్రాంతములో చాలా దూరంగా, లోనికి తీసుకుపోయాడు. వెంటనే అనుమానము వచ్చి నన్ను ఇక్కడికి ఎందుకు తెచ్చాడని అనుకున్నాను. ఇంతలో ''ఎంత అరిచినా ఇక్కడికి ఎవ్వరూ రారు'' అనే మాటలు వినిపించాయి. నాకు ఎవ్వరూ సహాయము చేయువారు లేరని, రారని అనుకోవద్దని వారితో పలికి, వేంకటేశ్వరా! వేంకటేశ్వరా అని రెండుసార్లు గట్టిగా పెద్దగా అందరికీ వినిపించేలా అరిచాను. వాడు ఈ ట్రాక్టర్ ను ఒక పెద్ద బావి లోనికి తీసుకుపోవుటకు ప్రయత్నించాడు. ఆ బావి లోనికి వెళితే బయటి వారు కనబడరని, నేను అక్కడనే ఇరుక్కుపోతానని భావించి ఉంటాడు. కాని వీడు లోనికి తీసుకెళ్ళేలోపల నేను ఆ ట్రాక్టర్ వెనుక నుండి క్రిందికి దూకాను. మరియు భయముచే మేల్కొన్నాను. కల చెదిరింది.


ఈవిధంగా ఈ దుష్టశక్తి నన్ను హత్య చేయుటకు ప్రయత్నించింది కాని స్వామివారి కృపచే తప్పించుకున్నాను.

## హరినామ క్షేత్ర నిర్మాణమునకు డబ్బులు సమకూర్చు సూచనలు

నా ప్రవర్తన వలన స్వామివారు ఇంతగా నొచ్చుకున్నారు కాబట్టి వారిని అదే స్థాయిలో సంతోషపెట్టదలచాను. ఎలాగైనా హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుటకు తగిన స్థలముల గురించి వెతకనారంభించాను. ముఖ్యంగా నాకు అందుబాటులో ఉంటే నిర్వహణ సులభమవుతుందనే భావనచే ఉన్నాను. తేది 03-01-2018 నాడు హైదరాబాద్ దగ్గరలోని గాజుల రామారం లోని ఒక మిత్రుని సూచన మేరకు అక్కడి వారి గుట్టపైకి వెళ్ళాను. అక్కడ శ్రీవేంకటేశ్వర ఆలయము నిర్మించాలని భావించి తగిన స్థలము చూచి దానిని ఏ విధంగా నిర్మించాలని ఆలోచించాము. చివరికి తిరుమల ఆలయ ప్రతిరూపముగా నిర్మించాలని నేను సూచన చేయగా వారు సంతోషించి ఒప్పుకున్నారు. పైగా దీనిని నా చేతులమీద, నా కనుసన్నలలో జరగాలని చెప్పారు. నేను కూడా ఇది నా భాగ్యంగా భావించి ఆనందించాను. నా కల నెరవేరే సమయం వచ్చిందని మురిసిపోయాను. తెల్లవారి మా ఆఫీసులోని పుస్తకములు వెతికి శ్రీవారి ఆలయ నమూనాలను, కొలతలను సేకరించు పనులు మొదలుపెట్టి దీని గురించిన ఆలోచనలలో పడిపోయాను. ఎలా చేయాలి? డబ్బులు ఎలా సమకూర్చాలి? ఏయే పనులకు

ఎవ్వరినీ సంప్రదించాలని ఆలోచించాను. చివరికి అన్నీ నా ప్రభు ఆజ్ఞ ప్రకారమే జరుగునని భావించి సహాయము కొరకు స్వామివారిని మనస్సున ప్రార్థించాను. స్వామివారు ఒక చక్కని కలను ఈవిధంగా చూపెట్టారు.

**తేది 05-01-2018 కల :** ఈ కలలో నేనో ముసలి వ్యక్తిని చూచాను. అతడు పిచ్చివానిలాగా, మతిస్థిమితము లేనివానిలాగా ఉన్నాడు. అతనిని కొందరు తరుముతున్నారు. అతని నుండి ఏదో పొందాలనుకుంటున్నారు. అతడు మాత్రము వారినుండి తప్పించుకునే వాడిలాగా ఉన్నాడు. చివరికి ఎలాగో అతడు నన్ను ఏకాంతాన కలిసి ఎవరికీ తెలియకుండా నాకు తన సంపదకి




**ముసలి వ్యక్తి తో మాట్లాడుట**

వారసునిగా, పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈ విషయము ఆయనకూ నాకూ మాత్రమే తెలుసు. ఇతరులకు తెలియదు. మేము బజారులో నడుస్తున్నాము. ఇంతలో ఆయన ఏదో నెపముతో నా దగ్గరికి వచ్చి ఎవ్వరూ లేనిది చూచి మాట్లాడారు. ఆశ్చర్యం ఏమంటే ఆయన పిచ్చివారు కారు, మంచివారే మరియు మతిస్థిమితము కలవారే అని గ్రహించాను. ఆయన నాతో ఇలా చెప్పారు. తిరునల్వేలి (లాంటి తమిళ ఊరిపేరు, మరచాను) లో మూడు లక్షల ఎకరముల స్థలము ఉన్నది, దానిని వెతికి రక్షించమని నాకు చెప్పారు. నన్ను దానికి వారసునిగా నియమించారన్నమాట. ఇది వినగానే నేను ఆశ్చర్యపోయాను. నేను కూడా సాధ్యమైనంతవరకు ఎవ్వరికీ కనబడకుండా ఆ ప్రాంతానికి వెళ్ళాలనుకున్నాను. కల చెదిరింది.

**దీని అర్థం:** హరినామ క్షేత్రం నిర్మించుటకు నా వద్ద సరిపడా డబ్బులు లేనప్పటికీ స్వామివారే ఏదోవిధంగా సమకూర్చుదురని భావం.

## భగవంతుడే నీవాడు, ఆత్మ పరిశీలన


కాలము గడుస్తూ ఉంది. ఈ మధ్యన నా జీవితములో కొన్ని విచారకర సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనల వలన నాలో చాలా మార్పు వచ్చింది. తేది 26-04-2018 రోజున నాలో ముద్రించుకున్న ఈ భావాలను ఈ క్రింది విధంగా వ్రాసుకున్నాను.

మానవుడికి భగవంతుడు తప్ప మరెవ్వరూ దిక్కుండరు. ఇది ప్రతి జీవికి వర్తిస్తుందన్నది నిత్య సత్యం. కాని అర్థం కావాలంటే ప్రతివారికి తగిన సమయము రావలసిందే తప్ప అంతవరకు బుర్రకెక్కదు. నేను ఎంతో సంపాదించాను. నావారు దీన్ని సంతోషంగా అనుభవిస్తున్నారు, సుఖపడుచున్నారు, ఈ సుఖానికి నేనే కారకుణ్ణి, నన్ను మా వారందరూ ఎంతో ఆదరిస్తారు. నేనంటే వారికి ప్రాణం అని అనుకుంటాము. కాని సమయం వచ్చినప్పుడు నా వారు అనే ఎవ్వరూ నీవారు కారు. నీకు శత్రువులుగా కూడా మారవచ్చు జాగ్రత్త! మరి ఏది మనది అంటే... కేవలము భగవంతుడే మనవాడు. నీవు ఎంతో కష్టపడి, చెమటోడ్చిసంపాదించిన ఆస్తి కూడా నీది కాదు. నీ అవసరానికి ఆదుకోదు. ఆదుకునేవాడు కేవలం భగవంతుడే. అయితే ఈ సంపాదన గురించి కాని, నీ మధ్యన ఉండే వ్యక్తుల గురించి కాని, నీ కుటుంబ సభ్యుల గురించి కాని, ఎప్పుడు మనకు వారి నిజస్వరూపాలు అర్థం అవుతాయంటే... భగవంతుని కృప మనపై ప్రసరించినప్పుడు, అప్పుడే వారి నిజస్వరూపాలు తెలుస్తాయి. అంతవరకు వారు నావారు, వీరు నా వారు, ఇది నా ఆస్తి, నేను సంపాదించాననే అహంభావం మనలను ముంచేసి శ్రీహరి యొక్క యోగమాయలో పడి భ్రమిస్తుంటాము. జీవితం యొక్క నిజమైన జ్ఞానమును అర్థం చేసుకోము. ఎప్పుడైతే ఈ మాయ ప్రభావం నుండి విడిపోతామో, ఎప్పుడైతే ఈ నిజస్వరూపాలు తెలుస్తాయో ఆనాడు మనకు శ్రీహరి కృప కలిగిందని భావించాలి. ఆనాటి నుండి సత్యమును గ్రహించాము కనుక పరమాత్ముని మరవక జీవించుట చాలా ఉత్తమము. ఆయన సేవే మన జీవిత లక్ష్యంగా జీవించాలి, ప్రపంచంలో దేన్నీ నమ్మవద్దు, దేనిపైనా ప్రేమాభిమానాలను కలిగి ఉండరాదు, దేన్ని ఆశించవద్దు, దేనిపైన మమకారము పనికిరాదు. కేవలం శ్రీవేంకటేశ్వరుడే మన లక్ష్యం. ఆయనే మన దైవం. ఎల్లప్పుడూ మరువకుండా చేయమని సదా ప్రార్థిద్దాం!

ఈ విధంగా నా జీవితంలో కొన్ని విచారకర సంఘటనలను సృష్టించి, నాకు జీవితంలో స్వామి తప్ప మరే దానిపైన ఆసక్తి లేకుండునట్లు మార్చుట ప్రారంభించారు. నేను కూడా స్వామివారు వారి లీలలను ముందులాగా చూపకపోయేసరికి చింతిస్తూ, నాలోని లోపమును సరిదిద్దుటకు ప్రయత్నిస్తూ స్వామి చెంతకు చేరుటకు నా వంతు ప్రయత్నం చేయ ప్రారంభించాను.

## నా పెద్ద కుమారుడు చి|| వేదాంత్ వివాహం

ఈ మధ్యన తేది 06-07-2018 నాడు నా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్ వివాహాన్ని ఎ.ఎస్.రావు నగర్ నివాసులైన శ్రీమాన్



**మా పెద్ద కొడుకు చి||వేదాంత్,**
**కోడలు చి||సౌ|| పూజతో మా కుటుంబం**

నాగిరెడ్డి సంజీవరెడ్డి మరియు గీత దంపతుల పుత్రిక చి|| సౌ|| పూజ తో జరిగింది. ఇది కూడా స్వామివారి ఆశీర్వాదముల చేతనే జరిగింది. వధువు కోసం ఎందరినో చూచాము, కాని ఈ సంజీవరెడ్డి ఇంటికి వెళ్ళినప్పుడు నా మనస్సులో ఏదో ప్రశాంతమైన వాతావరణముతో పాటు వీరు మావారు అనే అభిప్రాయము కలిగింది. సహజంగా ఇలాంటి అభిప్రాయం స్వామివారి కృపతోనే కలుగుతుంది. కాబట్టి వధువు కుటుంబం గురించి ఎలాంటి ఎంక్వైరీలు చేయకుండా వెంటనే ఒప్పుకుని తేది 06-07-2018 నాడు పెండ్లి చేశాము. ఆ తరువాత తిరుపతికి వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నప్పుడు, అక్కడి పెద్ద జీయరు స్వామివారు 'సుపుత్ర ప్రాప్తిరస్తు' అని ఆశీర్వదించారు. వెంటనే ఇది ఫలిస్తుందనే భావమేర్పడ్డది. అమ్మాయి 'పూజ' కూడా అమెరికాలో మాస్టర్స్ చదువుట వలన వివాహం తరువాత ఇద్దరూ అమెరికా వెళ్ళిపోయారు. అక్కడ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నారు.

## ఇతరులతో పోల్చుకొనుట

ఈ కాలంలో నా ప్రవర్తన, అలవాట్లు, ఆలోచనా విధానం ఇతరులతో పోల్చితే భిన్నంగా ఉన్నదని గ్రహించాను. మరియు ఇదే సమయంలో శుద్ధత, సత్వగుణ ప్రధానమైన ఆహారాలు ఆకర్షించాయి. హోటల్ లేదా పార్టీల ఆహార పదార్థాలు నచ్చేవి కావు. లౌకిక విషయాల కాలక్షేపం కూడా నచ్చేది కాదు. భక్తుల సాంగత్యం మరియు ఏకాంతం రుచించేది. నిజానికి భక్తుడు భగవంతుని తృప్తే ప్రధానంగా భావించి ఉన్నదాని కంటే అల్పునిగా జీవిస్తాడు. కాని లౌకికులు సంఘములో గొప్పవారమనే భావాన్ని కలిగించుటకు ఉన్నదానికంటే అధికులమని ప్రవర్తిస్తారు. ఇదే భక్తునికి, లౌకికునికి తేడా! ఈ తేడాను మా కుమారుడి పెండ్లి సందర్భంగా స్పష్టంగా తెలుసుకున్నాను. మా పెంపకంలో పెరిగిన మా పిల్లలు కూడా కొంత అల్పుని భావనతోనే ప్రవర్తించేవారు. భక్తునికి భగవంతుడే బలం, లౌకికునికి ధనమే బలం.

## ఆపద నుండి కాపాడిన స్వామి హస్తం

తేది 23-07-2018 నాడు తొలి ఏకాదశి. ఈ రోజు మేము భజగోవిందమును నిర్వహించాలి. కాని తేది 06-07-2018 నాడు నా పెద్ద కుమారుని వివాహము జరగడంచే, బంధువులు, పిల్లలు అప్పుడే తిరిగి అమెరికాకు వెళ్ళడం చేత, నేను పెండ్లి హడావుడిలో అలసిపోవడం వలన మరియు టిటిడి వారు వారి హాలును ఇవ్వనందున భజగోవిందం నిర్వహించలేదు. అందుకని ఈ తొలి ఏకాదశి నాడు స్వామివారిని మన్నించమని మరీ మరీ వేడుకున్నాను. కాని ఒక దుష్టశక్తి మాత్రం నన్ను స్వామివారి చెంతకు పోనివ్వడం లేదు. లౌకిక విషయాల పట్ల ఆకర్షణ కలిగిస్తూ స్వామివారికి వీలైనంత దూరంగా ఉంచుటకు ప్రయత్నించింది. కాని ఎన్నో జన్మలను కేటాయించి స్వామి ఋణం తీర్చుకోవాలనే సంకల్పంతో ఉన్న నేను ఆ దుష్టశక్తి ప్రభావం నుండి స్వామి కృపతో బయటపడ్డాను. ఈ విధంగా మళ్ళీ ఒకసారి ఆ దుష్టశక్తి నాకు హాని తలపెట్టింది. బహుశా నేను నా కొడుకు పెండ్లి సందర్భంగా కొంత లౌకికంగా తిరిగినందున ఇదే అదనుగా చూచుకొని ఈ దుష్టశక్తి తనవైపు త్రిప్పుకొనుటకు ప్రయత్నించింది. కాని స్వామివారి కృపతో బయటపడగలిగాను. తేది 25-07-2018 నాడు కొత్తగా ఏర్పడిన బంధువులకు సంబంధించిన దూరపు ప్రాంతము, బంజారా హిల్స్ లో జరిగిన ఒక ఫంక్షన్ కు వెళ్ళి వచ్చి అలసిపోయి గాఢంగా నిద్రించాను. తెల్లవారి 4.30 గంటల తరువాత వచ్చింది ఈ కల.

**తేది 26-07-2018 కల :** నేను ఎవ్వరిదో ఒక అత్యంత విశాలమైన, చాలా సౌకర్యవంతమైన ఇంటిలో ఉన్నాను. బాత్రూమ్ చాలా పెద్దగా మరియు సౌకర్యవంతంగా ఉంది. దానిలో పురాతన సినిమాలలో చూపినట్లు ఖరీదైన ల్యాండ్ లైన్ ఫోన్ కలిగి, ఖరీదైన బంగారు రంగు గల రిసీవర్ తో ఉన్నది. నేను ఆ బాత్రూమ్ లో స్నానము చేయుటకు పోయాను. తలుపులు మూసి ఉన్నాయి కాని ఏదో శంక ఆవహించింది. నన్ను ఎవరో హత్య చేయుటకు లేదా హాని కలిగించుటకు కుట్ర జరుగుచున్నదనిపించింది. స్నానం చేయుటకు నీళ్ళు శరీరంపై పోసుకొనుటచే ఆ బాత్రూమ్ మొత్తం నీటితో తడిసిపోయింది. ఇంతలో ఫోన్ గణ గణ మ్రోగింది. ఏదో విషయాన్ని నాకు చేరవేయుటకు ఈ ఫోన్ వచ్చిందని నేను భావించి రిసీవర్ ను ఎత్తాను. వెంటనే ఆ రిసీవర్ నుండి ఇలా మాటలు వస్తున్నవి. "జాగ్రత్త! జాగ్రత్త! అందులో ఎలక్ట్రిక్ షాక్ అమర్చారని..." రిసీవర్ లేపిన వెంటనే దాని నుండి వచ్చిన ఎలక్ట్రిక్ షాక్ మెరుపులు బాత్రూమ్ మొత్తం నీటి తడి ద్వారా వ్యాపించాయి. ఆ షాక్ నాకు తగిలేలా ఉంది. వెంటనే నా వెనుక నుండి ఒక నల్లని చేయి, మణికట్టుపై బంగారు ఆభరణములతో ప్రత్యక్షమై రిసీవర్ ను తానే పట్టుకుంది. నాకు షాక్ తగలకుండా చేసింది. కల




ఆపద నుండి కాపాడిన స్వామి హస్తం

చెదిరింది. ఈ విధంగా స్వామివారు నన్ను రక్షించారు. బహుశా నేను లౌకిక విషయాల పట్ల ఆకర్షితుణ్ణి కాకుండా తిరిగి తన వైపుకు త్రిప్పుకున్నారని భావించాను.

## 16వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 16వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకై తేది 09-08-2018 రోజున ''నమో వేంకటేశాయ'' రథయాత్రను ప్రారంభించాము. త్రిదండి శ్రీశ్రీశ్రీ శ్రీనివాస వ్రతధర్ నారాయణ రామానుజ జీయరు స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. చాలామంది భక్తులు పాల్గొన్నారు. ఈ యాత్ర తేది 26-08-2018 వరకు హైదరాబాదులో తిరిగి ఆ తరువాత మహబూబ్ నగర్, కర్నూలు, నంద్యాల, ఆళ్ళగడ్డ, కడపలో తిరిగి తేది 01-09-2018 న సాయంత్రం తిరుపతి చేరింది. తేది 02-09-2018 సాయంత్రం అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు జపాన్ని సమర్పించి పూజించుట జరిగింది. మరియు తేది 03-09-2018 గోకులాష్టమి నాడు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జప హోమాదులు నిర్వహించి పూర్ణాహుతి పిదప స్వామివారికి సమర్పించుట జరిగింది. అప్పటి టిటిడి ఈఓ శ్రీమాన్ అనిల్ కుమార్ సింఘాల్ గారు రాలేదు. ఛైర్మన్ శ్రీమాన్ సుధాకర్ యాదవ్ గారు, జాయింట్ ఈఓ కోలా భాస్కర్ మొదలగు వారు వచ్చారు. ఆ తరువాత 17వ 7 కోట్ల జపానికి శ్రీకారం చుట్టుట కూడా జరిగింది. భక్తులు చాలా ఉత్సాహంగా పాల్గొని నామ జపాన్ని సమర్పించారు.

దీనితో నేను సంకల్పించిన మొత్తం 111 కోట్ల జపము, 2002 సంవత్సరం నుండి 2018 సంవత్సరం వరకు మొత్తం 16 సంవత్సరాలు ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణను నా స్వామివారికి సమర్పించుట పూర్తైనది. ఈ విషయాన్ని స్వామివారికి తెలిపి అందరినీ రక్షించమని వేడుకున్నాను. నాకు తన పాద సేవకుడిగా ఉండే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. మరియు ఈ జప సమర్పణ కార్యక్రమము ఈ జీవితాంతం జరగగలదని నిర్ణయించుకున్నాము. రథయాత్ర మాత్రము 2020 సంవత్సరం అంటే నా వయస్సు 60 సంవత్సరాలు నిండే వరకు చేయాలని, ఆ తరువాత నిలిపివేయాలని భావించాను.

## స్వామివారికి సమర్పణ

తిరుపతి నుండి వచ్చిన వెంటనే తేది 06-09-2018 సాయంత్రం మా ఆఫీసులో స్వామివారిని తనివితీరా ప్రార్థించి నేను గత 16 సంవత్సరాల నుండి సమర్పిస్తున్న ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ మొత్తం ఫలితాన్ని, గత 2004 నుండి 2018 వరకు మొత్తం 15 సంవత్సరముల ''నమో వేంకటేశాయ'' రథము నడపడము వలన పొందిన ఫలితాన్ని, దీనితో పాటు 2007 సంవత్సరం నుండి నడుపుచున్న శ్రీవేంకటేశం మాసపత్రిక ఫలితాన్ని నా ప్రభువు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సమర్పించాను. సేవకుని సంపాదనకు యజమానే అర్హుడు కాబట్టి మీకే సమర్పిస్తున్నానని, నీటిని చేతిలో పోసుకుని స్వామివారి పాదాలకు అమితమైన ఆనందంతో జారవిడిచాను. ఇంతటితో నేను గత 16 సంవత్సరాల నుండి సంపాదించిన మొత్తం ఫలితాన్ని నా ప్రభువుకు ధారపోసి ఏమీ మిగుల్చుకోకుండా ఉండిపోయాను. నన్ను కాపాడే బాధ్యత తమదే స్వామీ, నన్ను మీ చరణ దాసునిగా ఉండనివ్వమని, నా సుఖాలు మీవి, మీ కష్టాలు నావి అని అనుకొని ప్రార్థించి ఆనంద బాష్పాలు కారుతుండగా, అమితమైన ఆనందముతో ముగించాను. 16వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించి, తిరుపతి నుండి నేటి ఉదయం 7.30 కు వచ్చాను. 12 గంటల లోపే దీని ఫలితాన్ని స్వామివారికి సమర్పించాను. మీ ఋణాన్ని తీర్చుకోలేను కాని ప్రయత్నిస్తున్నానని కూడా అన్నాను.

## ఇంకా పాస్ కాలేదని తెలుపుట

ఈ విధంగా నా మొత్తం 16 సంవత్సరాల రకరకాల సేవా ఫలితాన్ని స్వామివారికి సమర్పించి, ఆ ఫలిత పుణ్యముతో స్వామివారికి బొట్టుపెట్టి మా ఇంటికి ఆహ్వానించాను. స్వామివారు తప్పక ఏదో ఒక లీల చూపుతారని భావించాను. అనుకున్నట్లే ఒక లీల చూపారు. కాని అది నన్ను తృప్తి పరచలేదు, స్వామి సంకల్పము, లీల అర్థం కాలేదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

తేది 07-09-2018 కల : నేను ఆధ్యాత్మికంగా ఇంకా

ఎదగాలని భావించిన స్వామివారు, గతంలో నన్ను ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో పై తరగతిలో చేర్పించారు. ఈనాటి రాత్రి కలలో మా తరగతిలోని క్లాస్ మేట్స్ అందరూ అప్పటికంటే పెద్దవారైనారు. చివరి పరీక్షలు జరుగుచున్నవి, కాని నేను మాత్రము ఏమీ చదవలేదట. నా తోటి మిత్రులని ఎలా ఎలా అని అడుగుచున్నాను. చివరికి ఏదో విధంగా జరుగుతుంది, స్వామివారు కరుణిస్తారనే ధీమాతో ఉన్నాను. నా క్లాస్ మేట్స్ ని కలలో స్పష్టంగా చూచాను. ఎలా... పాస్ కావాలని, ఎలా... పరీక్షలు వ్రాయాలని అనుకుంటున్నాను. కల చెదిరింది.

దీనర్థం - 16వ పర్యాయంగా 7 కోట్ల జపము సమర్పించినప్పటికీ, నేను స్వామి ఆశించిన స్థాయికి చేరలేదని, ఇంకా జ్ఞానాన్ని సాధించవలసిన అవసరం ఉన్నదని అర్థం. నిజానికి నేను కోరింది కూడా ఇదే! మీ సంకల్పం తీరిందని నన్ను విడువకండి, ఇంకా సేవ చేయాలని ఉందని ప్రార్థించాను. బహుశా దీని ప్రభావమే ఈనాటి కల అని భావిస్తూ నేను ఇంకా స్వామి సేవకుడిగా ఎదగవలసి ఉన్నదని భావించాను. మరియు స్వామివారు ఈ విశ్వానికి అధిపతి. ఆయనకు ఎన్నో పనులు ఉంటాయి. వీలున్నప్పుడు నన్ను తప్పక కరుణించి మా ఇంటికి వస్తారని వేచి చూడసాగాను. 16 సంవత్సరాలు ఒక్క తప్పు లేకుండా సేవ చేసినప్పటికీ ఇలా కావడం నిరుత్సాహపరిచింది, నమ్మలేకపోయాను. అయినప్పటికీ తాటికాయలంత అక్షరాలతో సంకల్పం సిద్ధించిందంటూ శ్రీవేంకటేశం మాసపత్రికలో ప్రకటించాను.

## భజగోవిందమును స్వామివారు స్వీకరించలేదు

గతంలో లాగా స్వామివారు, వారి లీలలను చూపుట మానివేశారు. చివరికి వైకుంఠ ఏకాదశి వచ్చింది. ఆ రోజు అనగా తేది 18-12-2018 నాడు సాయంత్రం హబ్సిగూడలో పెద్ద యెత్తున భజగోవిందమును ఏర్పాటు చేశాను. చక్కని అరేంజ్ మెంట్స్ వేయి మంది భక్తులకు ఏర్పాటు చేశాను. ఇద్దరు యతీశ్వరులు, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి మరియు శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతి గార్లతో పాటు శ్రీమాన్ రమణాచారి గారు కూడా వచ్చారు. కాని ఆరోజు చలి కారణంగా ఎక్కువమంది భక్తులు రాలేదు. 250-300 మంది మాత్రమే వచ్చారు. చివరికి తెల్లవారి ఈ భజగోవిందము మీకు నచ్చిందా? అని స్వామివారిని అడిగాను. వారికి నచ్చనట్లే అభిప్రాయం ఏర్పడింది. కాబట్టి, నా తప్పు ఎక్కడ ఉన్నదో వెతకనారంభించాను. ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టాననే నాలోని భావమే స్వామి స్వీకరించకపోవుటకు కారణమని భావించాను. క్షమించమని వేడుకున్నాను.

## గురువుకై వెతుకులాట

తేది 20-01-2019 : స్వామి అనుభూతులను చాలా రోజుల నుండి చూడని కారణంగా స్వామివారి నుండి దూరంగా పోయిన భావం ఏర్పడ్డది. దీనికి తోడు లౌకిక విషయాల పట్ల, ఒక సాధారణ మానవునిగా ప్రవర్తించసాగాను. యూట్యూబ్, వాట్సాప్ మరియు ఇతరములైన సాధనాలపై మనస్సు పరిపరి విధాలుగా లాగింది. సంకల్పం పూర్తైనది అనే దృష్టికోణంలో ఉండి లౌకిక విషయాలపై దృష్టిని కేంద్రీకరించాను. కాని స్వామి సాధనపై దృష్టి పెట్టలేదు. దీనిని ఒకసారి పునరాలోచించుకుని బాధ పడ్డాను, స్వామి వారిని ఈ విధంగా ప్రార్థించాను. ప్రభూ! నేను ఏమీ తెలియనివాణ్ణి, ఎలా జీవించాలో, ఎలా ప్రవర్తించాలో తెలియదు, నాకు గురువు లేడు. నా సాధన ఫలించటం లేదు కాబట్టి దయచేసి నాకు గురువువై మంత్రోపదేశం చేయమని, నన్ను సన్మార్గమున నడిపించమని మరీ మరీ వేడుకున్నాను. తరువాత స్వామి దయ, నా అదృష్టం, వేచి చూడాలి, భవిష్యత్తు ఎలా ఉండునో? నన్ను వారు ఏ రకమైన మార్పుకు గురి చేయుదురో అనుకున్నాను. అయినప్పటికీ గురువు కావాలనే విషయమై మరికొన్ని సార్లు ప్రార్థించాలని కూడా గట్టిగా నిర్ణయించుకున్నాను.

**నా దశ :** స్వామివారిని దగ్గరనుండి దర్శించాను. సాత్విక ఆహారం, శుచిత్వం అలవాటు పడ్డాయి. జపమాల, మహామంత్రం లభించాయి. మాసపత్రికను కొనసాగించ నిర్ణయించాను. దుష్టశక్తుల నుండి స్వామివారు కాపాడారు. 16 సంవత్సరాల సంకల్పం స్వామివారికి సమర్పించాను. తిరిగి గురువు గారి కొరకు వేచి చూస్తున్నాను.


**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.
శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సిగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# కార్తీక మాస వైశిష్ట్యం

– పరాంకుశం శ్రీనివాసమూర్తి



**"సశంఖచక్రం – సకిరీట కుండలమ్ ।**
**సపీతవస్త్రం – సరసీరుహేక్షణమ్ ।**
**సహారవక్షస్థల – కౌస్తుభశ్రియమ్ ।**
**నమామివిష్ణుం శిరసాచతుర్భుజమ్"**

"శంఖ చక్ర గదాధరుడై, అభయహస్త ప్రసాదితుడై – పీతాంబరశోభితుడు – కౌస్తుభహార ప్రియుడైన – చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువుకు, శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అని భక్తిప్రపత్తులతో విష్ణుసాయుజ్యాన్ని కోరే భక్తులకీ మాసం పవిత్రమైనది.

సృష్టిలో సకల చరాచర జగత్తుకు ఆదిపురుషుడు, పరబ్రహ్మ స్వరూపుడు, స్థితికారుడైన శ్రీమహావిష్ణువు "వందే విష్ణుం భవభయ హరమ్ సర్వ లోకైకనాథమ్" – అంటూ శిరసా, మనసా, ఉరసా, మనోవాక్కాయ కర్మలచే త్రికరణ శుద్ధిగా ఆ భగవంతుని ప్రార్థిస్తే, సర్వులకు మోక్షసిద్ధి భగవత్కరుణ భక్తుల వశ్యమవుతాయి. ఇదంతా వారి వారి పూర్వజన్మ సుకృత ఫలం వల్ల లభిస్తుంది. కార్తీకమాసం శివకేశవాభేదమై, శ్రీవిష్ణు మహేశ్వరులు ఉభయులకు పూజనీయమైన మాసము. భక్తుల ఆర్తిని తీర్చే భగవదనుగ్రహానికి పాత్రమైన మాసం. "శివాయ విష్ణురూపాయ – విష్ణుశ్చ శివశ్య హృదయం" – ఇరువురు భక్తుల మనోభీష్టాలను తీర్చే ముక్తి సాధకులు, కార్తీక సోమవారాలలో శివ ప్రీతికరమైన అభిషేకాదులు, నమక చమక రుద్రాభిషేకములు, బిల్వదళార్చనలు శివుని అనుగ్రహాన్ని కల్గిస్తాయి. "విష్ణోరలంకారప్రియః – శివోఽరభిషేకప్రియః" అన్నట్లుగా శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన అలంకారార్చనలు, తులసి పూజలు. విష్ణువుకు ప్రీతిని కల్గించే మాసం కార్తీకమాసం. అందువల్లనే ఈ మాసమంతా ఆధ్యాత్మికతకు ప్రతీకమైన సమస్త దేవాలయాలు శోభతో భక్తుల సందోహంతో, కార్తీక దీప తోరణాలతో ప్రకాశిస్తూ భక్తులానందానికి, భక్తి ప్రపత్తులకు ప్రతీకములుగా నిలుస్తాయి.

భగవంతునికి ప్రీతికరమైన నవవిధ భక్తులలో ఏదేని ఒక భక్తి మార్గాన్నెంచుకొని శివకేశవుల నర్చించిన సకల భక్తులకు ముక్తిమార్గము ఏర్పడుతుంది. సకల దానములు, దీపారాధనలు, తులసి – బిల్వపత్ర పూజలతో శివ కేశవులనిద్దరినీ తృప్తిగా పూజించి ఆనందాన్ని పంచే పవిత్రమాసం, నదీస్నానాలతో పుణ్యఫలాన్నిచ్చేదీ మాసం.

మాసములలోకెల్లా మిక్కిలి ప్రాశస్త్యము పొందినది కార్తీక మాసం. ఈ కార్తీక మాసంలోని 4 సోమవారము లత్యంత భక్తి, పుణ్యతములు. "విష్ణోఽరలంకార ప్రియః శివోఽరభిషేకప్రియః" శివకేశవాభేదము కలిగిన మాసము కార్తీకము. శివకేశవార్చనలకు సమ ప్రాధాన్యమిచ్చే మాసం కార్తీకం.

కార్తీక మాసంలో కృత్తికా నక్షత్ర దర్శనం – దీపదర్శనం – అత్యంత ప్రాధాన్యములు. కార్తీక పౌర్ణమి – విష్ణువుకు ప్రీతికరము. ఈ రోజున వేకువ జామునే లేచి కాలకృత్యాదులు తీర్చుకొని విష్ణు ధ్యానాన్ని గావించి ఉసిరిక చెట్టు కింద దీపారాధన చేసి పూజించిన వారి జన్మలు ధన్యములు.

నాల్గు సోమవారములలో శివునకు ప్రీతికరమైన మహన్యాస రుద్రాభిషేకములు భక్తిశ్రద్ధలతో చేసినవారికి శివానుగ్రహము, కైవల్యప్రాప్తి కల్గుతాయి. "కలౌ నామ సంకీర్తనః" ఈ కలియుగంలో భగవన్నామ స్మరణమే ముక్తి ప్రదాయకము. పవిత్రమైన కార్తీకమాసమంతయు భక్తాళికి శివానుగ్రహం, మహావిష్ణు కటాక్షములు కల్గిస్తాయి.

కార్తీకమాసంలో నదీస్నానం అత్యంత ముక్తిదాయకం. సముద్రస్నానం, పౌర్ణమినాడు దీప మహోత్సవము – కేదారేశ్వరునికి ప్రీతికరమైన వ్రతములు,

శివసాయుజ్యములనిస్తాయి. అందుకే పెద్దలు సంవత్సరంలో సాధించే పుణ్యాన్నంతయు ఈ కార్తీక మాసానికే ఆపాదించారు.

కార్తీకమాసంలో దేవాలయం లేదా గృహములో కార్తీకదీపం వెలిగించి, సాయం సంధ్యలలో కానీ, ఉదయకాలమందు కానీ దీపం ఉంచి భగవంతుని పుష్పాక్షతలతో పూజించిన అత్యంత పుణ్యప్రదం. ఈ మాసంలో దీపదానం శివునికి ప్రీతికరము. గోధుమపిండితో ప్రమిదను చేసి, ఆవునెయ్యితో దీపం వెలిగించి, భక్తితో పూజించి, ఈ దీపాన్ని బ్రాహ్మణునకు దానమిచ్చిన స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. దీపదానం ఏ రోజు చేసినా పుణ్యప్రదమే.

కార్తీకమాసంలో అన్ని రోజులూ పర్వదినాలే. కార్తీక శనిత్రయోదశి, సోమ మంగళ వారాల్లో శ్రీవల్లీ – దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించడం మంచిది. పౌర్ణమి అత్యంత ఫలదాయకం. ఏకాదశి కంటే ద్వాదశి అత్యంత ఫలాన్ని ఇస్తుంది. కార్తీక ద్వాదశి పారాయణ, బ్రాహ్మణ సమారాధనలు చేయడం పుణ్యప్రదములు. ద్వాదశి నాటి సంతర్పణ అనంత కోటి పుణ్యాన్నిస్తుందని పురాణ ప్రవచనము.

శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలో నుంచి మేల్కొనే రోజు కార్తీక ద్వాదశి. ఈ ద్వాదశి నాడు ఒక్కరికైనా అన్నదానం చేస్తే విష్ణు సాయుజ్యాన్ని పొందుతారు. ఏ దానం చేసినా జన్మాంతర పాపాలు నశిస్తాయి. సాలగ్రామం – తులసి దానం చేయడం వల్ల భూదానం చేసినంత ఫలితాన్ని ఇస్తుంది. శివునికి అభిషేకమొనర్చి మారేడు దళాలతో అర్చించిన భక్తునికి శివ సాయుజ్యము కలుగుతుంది.

కార్తీకమాసంలో ఆచరించాల్సిన పుణ్యకార్యాల ఫలితమనంతము. నదీ లేదా సముద్రస్నానం, వేకువనే చన్నీటి స్నానం, దీపారాధన లేదా దీపదానం, కార్తీక సోమవార, కేదారేశ్వర వ్రతం, ద్వాదశి పారాయణం, కార్తీక వనభోజనాలు, వివిధ దానాలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాది కార్యక్రమాలు, పారాయణలు, తులసిపూజ, శివకేశవార్చనలు, క్షీరాబ్ధి ద్వాదశి – ఈ పుణ్య కార్యాలన్నీ మోక్ష సాధనలకు మార్గాలుగా చెప్పబడ్డాయి.

కార్తీక సోమవారాలు నాల్గింటిలో ఏ ఒక్క వారమైనా శివార్చన, అభిషేకాదులొనర్చిన పరమేశ్వరుడు భక్తానుగ్రహాన్ని ప్రసాదిస్తాడు.

**వివిధ దానాలు :**

కార్తీక మాసంలో బ్రాహ్మణునికే దానం చేసినా అత్యంత పుణ్యఫలం. దానములలో దీపదానం – స్వయంపాకం – శాకాదానం (కూరగాయలు), ధనదానం – వస్త్రదానం – తండుల (బియ్యం) దానం – సువర్ణ – (బంగారు) దానం ప్రధానమైనవి. ఈ మాసంలో కన్యాదానం ఫలం ఉత్తమమైనది. అందువల్లనే ఈ



మాసంలో మన తెలుగింటివారి సంప్రదాయమైనది. గోదానం – అన్నదానం పుణ్యప్రదమైనవి. శయనదానం (అంటే పరుపు – మంచం – దుప్పట్లు) దానంగా ఇస్తే ఫలితం స్వర్గప్రాప్తి యని శాస్త్ర వచనం.

ఈ మాసంలో పారాయణలు అనగా భగవంతుని మహిమలను తెలిపే పుణ్యగాథలు, పవిత్ర గ్రంథాల పారాయణలు పుణ్యఫలితాన్నిస్తాయి. పంచసూక్త – శ్రీసూక్త – నారాయణ – దుర్గాసూక్త – పురాణాదుల శ్రవణం స్వర్గప్రాప్తికి మూలము. పండుగలలోని పరమార్థము కూడా భక్తి శ్రద్ధలతో భగవంతుని ధ్యానించి పూజించడం కొరకే అని మన పెద్దలేర్పాటు చేసినారు.

కార్తీక సోమవారాలలో ఏకైక ముక్తిప్రదాత శివభగవానుడు. ఒక్క చెంబు గంగాజలంతో, బిల్వదళార్చనతో, విభూది స్నానంతో సంతోషించి భక్తుని అభీష్టాలు తీర్చే భోళా శంకరుడు శివుడు. ఈ మాసమంతా శివ – వైష్ణవాలయాలు రెండూ కళకళ లాడుతూ భక్తులు దీపాలు వెలిగించి, ఫల పుష్పాదులు సమర్పించి, దైవానుగ్రహానికి పాత్రులయ్యే పవిత్రమాసమే ఈ కార్తీక మాసం. జల కళలతో, వివిధ పుష్పకాంతులతో పవిత్రాలయాలన్నీ భగవన్నామ స్మరణతో మారుమ్రోగే పుణ్యమాసము ఈ కార్తీకము. భక్తులు, ఈ మాసంలో భగవంతు నర్చించి ముక్తి మార్గాన్ని పొందుదాము. సకల భక్తులు ఈ మాసము యొక్క ప్రాధాన్యాన్ని గుర్తించి భక్తితో ముక్తి నొందగలరని ఆశిద్దాము.

శివ కేశవులిద్దరినీ భక్తి శ్రద్ధలతో పూజించడం ఈ మాసం విశిష్టత. ఈ నాల్గు సోమవారాలలో కానీ, పౌర్ణమి, ఏకాదశులలో సత్యనారాయణుని వ్రతం చేయడం అత్యంత పుణ్యప్రదం. తులసీ దళార్చన విష్ణువుకు, మారేడు దళాలతో అర్చన శివునికి ప్రీతికరములు. కావున కార్తీక మాసాన శివ కేశవులలో ఎవరిని అర్చించినా ముక్తి మార్గమే.

ఓం నమః శ్శివాయః । ఓం నమో నారాయణాయ – అనే దివ్య పంచాక్షరీ, అష్టాక్షరీ మంత్రాలు రెండూ ముక్తి ప్రదాయకములు. వీనితో మనమందరం తరిద్దాం. భగవత్సాయుజ్యాన్ని పొందుదాం.

**జై గోవిందా!**

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**



## 28 వ పాశురం

**కఱవైగళ్ పిన్ శెన్రు కానం శేర్ న్దుణ్బోమ్**
**అఱివొన్రు మిల్లాద వాయ్ క్కులత్తు, ఉన్దన్నై**
**పిఱవి పెఱున్దనై పుణ్ణియుమ్ యాముడై యోమ్,**
**కుఱై వొన్రుమిల్లాద గోవిన్దా! ఉన్దన్నోడు**
**ఉఱవేల్ నమక్కు ఇంగొళిక్క వొళియాదు,**
**అఱియాద పిళ్ళైగళోం అన్బినాల్, ఉన్దన్నై**
**శిఱు పేరళైత్తనవుమ్ శీఱి యరుళాదే,**
**ఇఱైవా నీతారాయ్ పఱై యేలో రెమ్బావాయ్.**

తాత్పర్యము – శ్రీకృష్ణా! పశువుల వెనుకబడిపోవు అజ్ఞానులం. వాటి వెనుక అడవికి పోయి శుచిలేకనే భుజించువారలం. ఇసుమంతైనా జ్ఞానము లేనట్టి పుణ్యమంటే తెలియని గొల్లకులమునకు చెందిన వారలమైనప్పటికీ, మాతో సమానమైన వానిగా నిన్ను పొందినవారలమయ్యా! మేము. మాకెన్ని లోపములున్ననూ తీర్చగలిగినట్లు పరిపూర్ణుడవు నీవు. గోవిందా! ఇచట నీకు మాకు గల ఈ సంబంధము మనమిరువురము కలిసి పోగొట్టుకొందమనిననూ పోవునది గాదు సుమా! లోకమర్యాదలను ఎఱుంగని చిన్నపిల్లలము. ప్రేమాతిశయముచే తెలియక ఇప్పటివరకు నిన్ను తగీ తగని చిన్ని చిన్ని పేర్లతో పిలచినాము. అంతమాత్రాన కోపడక, ఓ స్వామీ! మేము కోరిన పఱై అను దానిని మాకొసంగి కటాక్షించుము.

విశేషార్థము – శ్రీ ఆండాళ్ తమ వ్రతానికి కావలసిన పరికరములను అడిగారు. వెంటనే శ్రమదీర ఓదార్చి ఇస్తాడనుకున్నారు. కానీ వీళ్ళ మనస్సులో 'సాధనము'గ దేనిని విశ్వసించి ఉన్నారో శోధించడం ప్రారంభించాడు శ్రీకృష్ణుడు. అట్టి స్థిర సాధనం నీవే తప్ప వేరు లేదంటారు వీరు. ఏదో ఒక దానిని సాధనముగా భావించేట్టు చేయాలని చూస్తాడు తాను. తనకంటే ఇతరములయిన కర్మయోగమో, జ్ఞానయోగమో, భక్తియోగమో లేక వీరి ప్రయత్నమో, ప్రార్థనయో ఉంది కనుక ఉపాయముగ, అదే ఫలితము నందించింది అనే భావన వీరిలో కలుగుతుందా లేదా శోధిస్తున్నాడు. అవేవీ ఉపాయములుగా తలవరు వీరు. ఉపాయము శ్రీకృష్ణుడే తప్ప వేరు కాదని నిరూపిస్తారు.

ఉపాయాలు రెండు రకాలు. 1. సాధ్యోపాయం. 2. సిద్ధోపాయం. మన పని వల్ల ఉపాయత్వాన్ని పొందే యజ్ఞ యాగాదులు ఎంత చేస్తే అంతే ఫలమిస్తాయి. వాటిని చేసి సాధించవలసి ఉంటుంది. భగవానుడు ఒకరు చేస్తే తయారు కాడు కదా! ఆయన ఉపాయంగా ఉండమంటే ఉంటాడు. సిద్ధమై నిలచి ఉన్నట్టి 'సిద్ధోపాయ'మంటారు. ఆయన విషయంలో జీవుల శక్తితో ప్రమేయమేమీ లేదు. వీళ్ళు పట్టినది సిద్ధోపాయాన్ని కదా. అలాంటి సిద్ధోపాయ నిష్ఠులకు కూడా ఫలమును పొందాలంటే తామార్జించుకున్నదంటూ ఏమీ లేదని ఓ ఆరు విషయములు తెలపాలి.

1. తామార్జించుకున్న యోగ్యతంటూ ఏదీ తమకు లేదనాలి.
2. అన్ని లోపములు తమలో ఉన్నవని అంగీకరించాలి.
3. భగవానునిలో సమస్త గుణపూర్తి ఉందనాలి.
4. ఆయన మనకి విడరాని సంబంధము ఉన్నదని గుర్తించమనాలి.
5. చేసిన అపరాధాలన్నీ క్షమించమని ప్రార్థించాలి.
6. పొందనిదే ఉండలేననే త్వరను తెలపాలి.

యోగ్యుడైన వైద్యుని దగ్గర చేసిన తప్పు చెప్పి వ్యాధి

తగ్గించుకోవాలి. అలానే పరమాత్మ వద్ద దోషాలంగీకరించి క్షమా ప్రార్థన చేయాలి. లోకంలో మందు, వైద్యుడు, తయారీ అన్నీ వేరు వేరు. భగవత్ప్రేమ వ్యాధికి మందూ వైద్యుడూ కూడా పరమాత్మే. భేషజం భిషక్. రోగులకు మందు అవుతాడు. మిగిలినవారికి ఆ తృప్తామృతమౌతాడు. నిత్యులకేమి, బద్ధులకేమి అందరికీ ఆయన మంచి మందే. ఆ విషయం అతనికి తెలియదు. మనం ఉపచారమనుకొని చేసే అపచారములను కూడా సహించే మంచి మం దు . అసలు ఎవరి కళ్ళు పడతాయోనని భయపడవలసిన దివ్యౌషధమని 'నచ్చు మామరుందు' అంటారు ఆళ్వార్.

మనం చేసే కర్మలన్నీ భగవానుని మీద ఆధారపడి ఉంటాయి. ఆయన అనుగ్రహించనిదే ఇవేవీ అవసరం లేదు. వదలివేయాలి వీనిని. ఇవి స్వరూప విరుద్ధాలు కనుక వదలాలి. పైగా అచేతనాలు కనుక కూడా వదలివేయాలి. ఒకవేళ వీటిని ఆశ్రయించని వాళ్ళు 'మాకు అవేమీ లేవు' అని స్పష్టం చేయాలి. అదే ఆండాళ్ చెప్తోంది.

'మీరు కోరినవన్నీ చూస్తే చాలా గొప్ప యోగ్యతలున్నవారికి లభించేవిగా ఉన్నాయి. మరి మీకేమి యోగ్యతలున్నాయర్రా?' అడిగాడు స్వామి.

'పాలిచ్చు పశువుల వెంట పోయి అడవులు చేరుతూ, చద్దికూడు తింటూ ఉండేవారము. జ్ఞానమిసుమంతైనా లేని గొల్లవాళ్ళమయ్యా!' ఇదీ మా యోగ్యత. ఏ సాధనాలైనా చేయాలంటే వేద విచారం చేసి ఉండాలి. ముందుగా సాంగ వేదాధ్యయనం చేసి అర్థం తెలిసి ఉండాలి. దానికి ముందు గురుకులవాసం చేసి ఆచార్య శుశ్రూష చేసి ఉండాలి. ఆ ఆచార్యులు విద్య, వృత్తము, వంశగౌరవము కలవారై ఉండాలి. జ్ఞానవృద్ధులు, వయోవృద్ధులు, శీలవృద్ధులు అయి ఉండాలి. మార్గదర్శకులు అయి ఉండాలి. మేమాశ్రయించిన గురువులు ఈ పశువులయ్యా! 'జ్ఞానేన హీనః పశుభిః సమానః' అని జ్ఞాన రాహిత్యానికి పోలిక చెప్పే పశువుల వెంట తిరిగే మాకీ పై యోగ్యత లెక్కడినుండి వస్తాయి? పోనీ నిస్వార్థముగా జాతి ధర్మమని వీటివెంట తిరగటం లేదు. పాలిస్తాయంటేనే, స్వార్థం కోసం తిరిగేవాళ్ళం. అదైనా వాటివెంట క్షేత్రాలకు వెళితే పుణ్యమైనా వచ్చే అవకాశముండవచ్చు. అయోధ్య, మధుర, మాయా లాంటి క్షేత్రాలకి కాదు మేం పోయేది. అడవులకి గడ్డి కోసం, ఆ అడవులకైనా దండకారణ్యం, నైమిశారణ్యం లాంటివైతే పుణ్యం రావచ్చు. ఉత్త కిరాతులు తిరిగే అడవులు. గడ్డీ, నీరు దొరికితే చాలు.

'అది స్వజాతి ధర్మం కదర్రా పశువుల పాలన! అదీ మా ఆరాధన క్రిందే లెక్క' అన్నాడు స్వామి పుణ్యాన్నారోపిద్దామని. వానప్రస్థాశ్రమ ధర్మం కూడాను. దిలీపుడు, సత్యకాముడు అలాగేగా పశుసేవ చేసి తరించారు.

'కావచ్చు. మేమూ ఆరాధన గానో, ధర్మమనో కాదు పోయేది, శరీర పోషణ కోసమయ్యా! ఆ తిండి కూడా స్నానాదులు చేసి తినాలనే నియమం పాటించి కాదు. ఒక దేవతకి నివేదించి తినటం లేదు. తామసాహారంగా ప్రసిద్ధి చెందిన ''యాతయామం, గతరసం, పూతి పర్యుషితం, ఉచ్ఛిష్టం, అమేధ్యం' ఇన్ని లక్షణాలున్న చల్దులు కూర్చుని తినడం కూడా కాదు. నడుస్తూ తినే అనుష్ఠాన హీనులం''. బాగుందర్రా! నేనూ అదే కద చేసేది. నా అంత వాళ్ళన్నమాట అన్నాడు స్వామి. ''నీవు తేజస్వివి. నీకేమీ అంటవు. మేం అజ్ఞానులం. చుట్టుకుంటాయి'' అన్నారు. ''సరి ఏ కర్మోపాయం లేదన్నారు. పూర్వజన్మ సుకృతాలేమైనా ఫలించి జ్ఞానాన్నిచ్చి ఉన్నాయేమో''. ధర్మవ్యాధుడు, విదురుడు, జడభరతుడు, శబరి వీళ్ళలాగా అన్నాడు స్వామి.

అన్నశుద్ధి ఉంటే కర్మలు ఫలించే ఆచరణ ఉండేది. కర్మల వల్ల జ్ఞానం, దానివల్ల భక్తి వచ్చేవి. అసలు అన్నశుద్ధి లేని మాకు జ్ఞానావకాశం లేదు. జన్మహీనులం, జ్ఞానహీనులం. ''అమ్మో ఇవి జ్ఞానులనే మాటలేనే! అహమస్మి అపరాధ చక్రవర్తీ'' ఇలాగ, అన్నాడాయన. ''స్వామీ! జ్ఞానముండ వీలులేని గొల్ల కులము మాది. జ్ఞానం ఉంటుందని శంకించే నువ్వు అజ్ఞానివి అవాలి'' అంతే అన్నారు ఆండాళ్ బృందం.

''కర్మ లేదు, జ్ఞానం లేదు, ఏ పుణ్యమూ లేని మీరు నన్ను కోరడం, దుస్సాహసమర్రా! మరచిపొండి'' అన్నాడు.

''సరి సరి! మేము సంపాదించినది లేదన్నాం. మా కోసం పుట్టి వచ్చి పుణ్యమైతే ఉంది. ఏమీ తినడని 'అనశ్నన్ అన్యః అభిచాకశీతి' అని ఉపనిషత్ చెప్పిన 'నిన్ను పశువుల వెంట తిరిగే కులంలో పొందాం. ఎవరి ధ్యానాలకీ అందని నిన్ను, అజ్ఞానమయ గొల్లకులంలో పొందాం. సూర్యవంశం లాంటి గొప్పవంశం కాదే నీవిప్పుడు పుట్టి ఉన్నది! మా పుణ్యం మమ్ము వెతుక్కుంటూ వచ్చింది. మాది సాధించాల్సిన పుణ్యం కాదు. సిద్ధపుణ్యం. బ్రహ్మకూ 'అహో!... అని ఈర్ష్య పుట్టించిన పుణ్యం ఆ పుణ్యం. పరమ చేతనమైనది నీవే కదా. కృష్ణా! గుదిబండ వేసుకొనినట్లు మా స్వంతం ఏదీ లేదన్నాం కాని, నీవే స్వయంగా ఇచ్చినపుడు దాన్ని లేదని ఎలా అంటాం?''

'ఏమర్రా! పుణ్యం లేదంటారొకసారి. ఉందంటారొకసారి. ఏమిటీ విరుద్ధపు మాటలు?' అడిగాడట స్వామి. 'మాట కూడా సరిగా రానివాళ్ళం. అయినా నీకేమి లోటు, పూర్ణుడువి కదా. మా పుణ్యము నశించదు. పాపాల వల్ల తరగదు. మానవశక్తి మీద ఆధారపడదు' అలాంటి సిద్ధ పుణ్యం నీవే కదా! గోవిందా! పశువుల వెంట బడి నిన్ను నీవు మరిచావు. దేవతల ప్రభువు అని, నీకు స్వాతంత్ర్యమున్నదని, నిత్యసూరి అధిపతినని మరిచావు. అవి మరవడమే మా పాలిట అదృష్టం. లేకపోతే మాతో తిరుగుతావా? లేదు కదా! నేను మీ బంధువునర్రా! అని గోవర్ధనాన్నెత్తి పట్టి మరీ ప్రతిజ్ఞ చేశావ్. నీకూ మాకూ విడరాని

సంబంధముంది స్వామీ! ఒకటి కాదు 9 సంబంధాలున్నాయి. శరీరానికి, ఆత్మకు వలె గుణి గుణముల వలె విడరానిది మన సంబంధం. ఇద్దరమూ తీసేద్దామన్నా అది తెగనిదే. 'అదలా ఉంచి, తెలియని చిన్నపిల్లలం, ప్రేమ పరవశులం. నిన్నేదో చిన్న పేర్లతో పిలిచి ఉంటాం. అంతమాత్రాన కోపపడవచ్చా? అజ్ఞులం తప్పు చేశాం. విజ్ఞుడివి నువ్వు రక్షించాలి కదా. పిల్లలం తప్పు చేస్తాం. తండ్రివి కదా! రక్షించవద్దూ! ప్రేయసి చేసేవి ప్రియుడికి తప్పులవుతాయా? మా దగ్గర వ్యామోహంతో చేస్తే శాస్త్రాలడుగుతావా?'' అని తిరిగి ప్రశ్నించారు. ''గతంలో నారాయణుడే అన్నారు గదర్రా!'' అని గుర్తు చేశాడు స్వామి తను గొల్లవాడిని కాదనడానికి.

''అవునూ. నీవూ ఆయనా ఒకటే అని తెలుసు లేవయ్యా! ''గోవింద'' బిరుదు నీ కష్టార్జితమైన గొప్ప పేరని తెలియక ఇతర చిన్నపేర్లేవో చెప్పాం. తప్పే, క్షమించి అనుగ్రహించు అని ప్రార్థించారు. సరే. ఏ యోగ్యతా లేనివాళ్ళకిస్తే అంతా నన్ను నిలదీయరూ!'' సందేహించాడు స్వామి. 'చాల్లేవయ్యా! నీ సొంతవాళ్ళకు చేసుకొంటున్నావంటే ఎవడడుగుతాడు నిన్ను? మేం నీలో భాగాలు కదా? తన కాలు, చేయి మీద ఎవరైనా కోప్పడతారటయ్యా స్వామీ! అడ్డకుంటే చాలు అనుకునే ఇతరోపాయ శూన్యులమైన మాకు ''పఱై''ని ప్రసాదించుమా!' అంటూ ''మామేకం శరణం వ్రజ'', 'నన్నొకనినే ఉపాయమని విశ్వాసముతో ఆశ్రయించు' అని స్వామి చెప్పిన క్రమంలోనే ఉపాయ నిష్కర్ష చేసి ఆశ్రయించింది ఆండాళ్. రేపు ఫలమైన పఱై ఏమిటో చెబుతుంది.

## 29 వ పాశురం

**శిత్తం శిఱుకాలే వందున్నై చ్చేవిత్తు, ఉన్**
**పొత్తామరే యడియే పోత్తుం పొరుళ్ కేళాయ్,**
**పెత్తం మెయ్ త్తుణ్ణం కులత్తిల్ పిఱందు, నీ**
**కుత్తేవల్ ఎంగళై క్కొళ్ళామల్ పోగాదు,**
**ఇత్తై పఱైకొళ్వా నన్ఱుగాణ్ గోవిందా!**
**ఎత్తెక్కుం ఏళేళ్ పిఱవిక్కుం, ఉందన్నోడు**
**ఉత్తోమే యావోం ఉనక్కే నాం ఆట్చెయ్వోం,**
**మత్తైనం కామంగళ్ మాత్తేలో రెమ్బావాయ్.**

తాత్పర్యం – తెల తెలవారక మునుపే నీవున్న చోటికి మేమే స్వయంగా వచ్చి, నిన్ను సేవించి ఆపై నీ యొక్క బంగారు తామరల వలె స్పృహణీయములైన శ్రీపాదములను కీర్తించుచున్నాము. ఇందువలన మేము కోరు ప్రయోజనమును తెలిపెదము వినుము. ఓ స్వామీ! పశువులను మేపి అవి తినిన పిదప భుజించు మా గోకులమున పుట్టిన నీవు, మేము నీకై చేయదలంచిన అంతరంగ కైంకర్యములను స్వీకరింపకుండ వీలులేదు. (మాలో పుట్టావు కనుక స్వీకరించి తీరవలసినదియే) గోవిందుడా! ఇప్పటివరకు మేము చెప్పినట్లు నీవనుకొనెడి కేవలము పఱై అను వాయిద్యమును (ఢంకా) పుచ్చుకొనుటకు కాదయ్యా! మేమీ వ్రతాచరణకు దిగినది, మరి మేము కోరు పఱై వేరు. అది ఏమిటనగా, ఆత్మ ఉన్నంతవరకు, ఏడేడు జన్మలకున్నూ నీతోనే సకలవిధ బంధుత్వము కలవారలముగ మేము కావాలి. మేము నీకొరకయ్యే సకల సేవలను చేయు వారలము కావలెను. ఇందుల కాటంకములయిన ఇతర కోరికలన్నింటినీ మానుండి వెంటనే నశింపచేయు స్వామీ! ఇదే మేము కోరు పరమ ప్రయోజనము.

విశేషార్థము – మన ఆండాళ్ కృష్ణుణ్ణి చేరడానికి ముందు రెండుసార్లు పరిశుద్ధులమై వచ్చాం అంది. భగవానుడైన కృష్ణునే ఉపాయమని, సాధనమని నమ్మారు. అలాంటివారు ఇతర సాధనాలను పట్టినా, తన ప్రయత్నమైన సాధనమని తలచినా అది శవాన్ని స్పృశించినట్లే. అవన్నీ అచేతనాలు. శక్తిరహితాలు కదా! అపుడు వీణ్ణి కృష్ణుడూ వదిలేస్తాడు. అది లేదన్నారు నిన్న. వీళ్ళ అభిప్రాయాల ప్రకారం స్నానమంటే వాణ్ణి చేరడమే. పఱై అంటే వాని సేవయే. భగవంతుణ్ణి చేరాక, ఇతర ఫలాలు కోరినా ఈ జీవుడు నా ఆనందమే ప్రయోజనమనినా భగవంతునికి అది విషభోజనం లాగా, ఎంగిలి కూడు లాగా అనిపిస్తుంది. అంటే అన్య ప్రయోజనాలు కోరేవారు కారు వీళ్ళు. ఆ అశుద్ధి తమకు లేదని ఈ 'శిత్తుమ్ శిఱుకాలే' ద్వారా స్పష్టం చేస్తోంది.

భగవానుడే సాధనమని పట్టాక భగవద్రుచియే ఇతర ఉపాయముల నుంచి వీణ్ణి విముక్తుణ్ణి చేస్తుంది. ఆ రుచియే వీడిలో పొందాలనే త్వర పుట్టిస్తుంది. స్వామిని నిర్బంధిస్తారు 'పఱై' ఇమ్మని. వీళ్ళు కోరే 'పఱై' స్వామి యొక్క నిత్య కైంకర్యమే. ఇది సాధ్యం కాని దీనిని సాధనగా భావించడం, ఆయన్ని అడగడం, ఆర్తిని ప్రదర్శించడం ఇవన్నీ ప్రయోజనాలు కావు. చైతన్యం ఒకటి వీరిలో ఉంది. దీనివల్ల ఊరక ఉండలేరు కనుక ఏదో చేస్తూ ఉంటారు. అందరినీ లేపుకొని వీళ్ళంతా తెల్లవారుతూ రావడం 'త్వర'ను తెలుపుతుంది. 'మేమేమి కోరుతున్నామో విను!' అంటారు. వేరే కోరికలేమీ వీరికి లేవసలు. కలతచే అలా అంటారు. వేరే 'పఱై' అనేది వంక. కైంకర్యము వానికి చేయాలి. దోషాలు దూరం అవాలి అంటారు. కృష్ణుణ్ణి చేరి ఇతర ప్రయోజనాలు కోరడం, కామధేనువుని చేరి కౌపీనం కోరడం లాంటిది కదా! అందుకే నిన్న 'నీ సొత్తు నిస్తానంటే ఎవరొద్దంటారని నిర్బంధించారు'.

'మీరు చెప్పినట్లల్లా చేశాను. సులభుడనై అడిగినవన్నీ గతంలోనే ఇచ్చేశాను. అయినా ఇంకా మీరు 'పఱై' అంటూనే ఉన్నారు. ఏమిటో తెలియడం లేదన్నట్లు' ఊరుకున్నాడు స్వామి.

మా స్థితి, త్వర చూశాక కూడా మేమేం కోరామో తెలియటం లేదా? ఆయన సర్వుల ''హృద్దేశే తిష్ఠతి భ్రామయన్'' హృదయాల్లో

ఉండి పలికించేది వాడే అయినా నాలిక ఉన్నందుకు దాపరికం మాని నోరు తెరచి చెప్పాలి. అదే చెప్తున్నారు.

స్వామీ ! ఐహిక సుఖాలు కోరే తామసులు లేచేది కాలమంటారు. ఆత్మ ప్రాప్తి నమ్మి రాజసులు లేచేది 'శిఋకాలం'. నిన్ను తప్ప ఇతరములు వేనినీ కోరని మాలాంటి వాళ్ళు సత్వముద్రేకించి లేచేది 'శిత్తుమ్ శిఋకాలం'. ఇలాంటి సమయంలో మంచులో తడుస్తూ వచ్చాం. త్వరాతిశయం వల్ల తెల్లవారితే కర్ర, బువ్వపట్టి దూడలవెంట పడిపో అంటూ అమ్మ శాసిస్తే అంతే, వెళ్ళిపోతాడు. వెళ్ళకముందే నిన్నాశ్రయించాలని వచ్చాం. నీవే రావాలి, మేం కాదు. అయినా ప్రీతి తోసింది వచ్చాం. వచ్చి నీకు నమస్కరిస్తున్నాం. నీవే చేయాలి ఆ పనిని. మే ము చేస్తున్నాం. శబరిని నీవే కదా వెతుక్కుంటూ వెళ్ళావు. మేం రాకూడదు. అన్నీ తప్పులే చేస్తున్నాం. క్షమించు. నీ బంగారు తామరల వంటి విలువ, సౌందర్యం కలిగి మాకు ప్రాప్తం అయిన పాద ద్వంద్వమును స్తుతిస్తున్నాం. ఎందుకో చెప్తున్నాం వింటున్నావా స్వామీ. వీళ్ళకేం కోరికల్లేవు. అయినా కలతచే అలా అంటారు. మిగిలిన వాళ్ళైతే వాళ్ళ లోపాలు తీర్చమంటారు. అమంగళాలు తీర్చమంటారు. కాని వీళ్ళు వాని లోపం తీర్చుకొని అమంగళాలు అంటకుండా చూస్కోమంటారు. వీళ్ళ జ్ఞానసౌందర్యం, దేహసౌందర్యం ద్వారా ప్రకటితమవుతోందని తదేక దీక్షతో చూస్తుండిపోయాడు కృష్ణుడు. తన భక్తులేం మాట్లాడినా ముద్దుగా ఉంటాయి కదా అని వింటున్నాడట. శీరియ సింహాసనంలో కూర్చున్నది వినడానికా? నిద్రపోడానికా? మమ్ము చూడ్డానికా? అడుగుతోంది. ఈమె స్వామిని లేపి పాఠం చెప్పిన తల్లి కదా! గద్దిస్తోంది.

పశువులు మేపి తినే కులంలో పుట్టావు నీవు. శాస్త్రంలో తప్ప గోచరించని నువ్వు గొల్లపిల్లవాడవయ్యావు. పశువుల కడుపు నిండాకే తమ తిండి తింటారు వీరు. మేము నీ పశువుల వంటి పరికరాలము కద! మమ్మల్ని తృప్తి పరచిన కద నీకు ఆహారం సహించేది! మేమార్త ప్రపన్నులం. విరహాన్నేర్వజాలక వచ్చి చేరాం. నీ పశువులకు వేరే రక్షకులుండవచ్చు. మాకు మాత్రం నీవొక్కడివే రక్షకుడివి. మేం ఒప్పుకోనంత వరకు నువ్వూ చేయలేవు. అంగీకరించాం నీ సేవని. స్వరూపాన్ని తెలిపావు. ఆశ నీయందు పుట్టించావు. ఇవాళ సేవలందిద్దామని వస్తే మాట్లాడవు? నిన్ను వదిలేది లేదు. మధుర నుండి రాత్రికి రాత్రి ఎవరు రమ్మన్నారు నిన్ను? రాకుండా ఉంటే మేమడిగే వారమే కాదు అన్నారు.

'ఏదో పఱై అంటూ వచ్చారు కదర్రా! అదే ఇదుగో తీసుకోండి! తప్ప, సేవలూ గట్రా అంటూ ఏమిటిది?' అన్నాడాయన.

ఏమయ్యా వెఱ్ఱివాడా! భావం గ్రహించడం రాని జన్మ కదా! కోపంతో అమ్మ 'విషం'రా, అది 'తినరా' అంటుంది. తినమనా అర్థం? విషమనా? కాదు. తినొద్దనడంలో తాత్పర్యం కదూ! ప్రేయసి ఊరికి వెడతానన్న ప్రియుడితో వెళ్ళు నేనక్కడే పుడతానంటుందిట. వెళ్ళమని కాదు అర్థం. వెళ్ళవద్దని. అదేం తెలియని అజ్ఞునిలా ఉన్నావే నువ్వు? అన్నారు వీళ్ళు.

'సరేనండి నేను వరాహ అవతారము లోనో, వామనుడిగనో, హయగ్రీవుడిగానో ఉంటే అవి జ్ఞానం ప్రసాదించే అవతారాలు కనుక మీ భావాలన్నీ తెలిసి ఉండేవి. ఇప్పుడు మీ బంధువునే కదా' అన్నాడట. ''వీల్లేదు'' అంటోంది ఆండాళ్. ''ఈ రోజుకి మాత్రమే చాలదు. ఎప్పటికీ, ఏడేడు జన్మలకీ, నీవు స్వామిగా, మేము నీ సొత్తుగానే ఉండాలి. ఎక్కడున్నా సరే, అది ఈ లోకంలోనో, ఆ లోకంలోనో, స్వర్గమా, నరకమా, అడవిలోనా, ఊరులోనా ఈ నిర్బంధమేమీ లేదు. నీ సంబంధం వీడకుండా ఉండాలనేది నిర్బంధం. మేము నీలో ఒక భాగమై ఉండిపోవాలి''.

ఫలానా సంబంధం కావాలనలేదు ఆండాళ్. అంచేత అన్ని సంబంధాలు నీతోనే ఉండాలని కోరుతోంది. ఇది అందరూ జీవులూ కోరవలసిన కోరిక. ఇదియే పరమ పురుషార్థం. జ్ఞానమున్నందుకు పరమ ప్రయోజనం. వీళ్ళు కోరిన 'పఱై' ఇదియే. 'సరి ఇంకేం కావాలి?'. నీకొక్కనికే మేమన్నివిధాల సేవలు చేయాలి. భరతునిలా దూరంగా ఉండి కాదు. లక్ష్మణునిలా నీతోనే ఉండి సర్వదేశ సర్వకాల సర్వావస్థల యందు సర్వవిధ సేవలనూ చేయాలి. అందులో మా స్వార్థం, అహంకారము కలుగరాదు సుమా! నీ సేవ చేయుటకు ఆటంకముగా ఏర్పడు దోషములను ఇతర కోరికలు ఏమైనా వాటన్నింటినీ నీవే నిర్మూలించుమా!' అంటూ పరమ ప్రయోజనమైన భగవత్కైంకర్యమనే పురుషార్థాన్ని వివరించి పాడింది ఆండాళ్.

## 30 వ పాశురం

వంగక్కడల్ కడైంద మాదవనై కేశవనై,
తింగళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్దిఱైంజి,
అంగప్పఱై కొండ వాత్తై అణిపుదువై
పైంగమల తణ్ తెరియల్ పట్టర్ పిరాన్ కోదై శొన్న,
శంగ త్తమిళ్ మాలై ముప్పదుం తప్పామే,
ఇంగు ఇప్పరిశురైప్పార్ ఈరిరండు మాల్వరైత్తోళ్,
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్,
ఎంగుం తిరువరుళ్ పెత్తు ఇంబురువ రెమ్బావాయ్.

తాత్పర్యం – సముద్ర మథనమును చూడవచ్చిన ఋషులు ఎక్కి ఉన్న ఓడలతో నిండి ఉన్న క్షీరసాగరమును మథించుటచే లభించిన లక్ష్మిని ధరించుటచే మాధవుడై, సుందర శిరోజములతో బ్రహ్మ రుద్రాదులను కూడా ధరించుటచే కేశవుడైనట్టి స్వామిని, చంద్రబింబముల వలె ఆనందముతో ప్రకాశించు ముఖ మండలములు, దివ్యాభరణములు ధరించిన గోపికలు చేరి,

ప్రార్థనా పూర్వకముగా స్తుతించి నంద వ్రజమున ఆనాడు ద్వాపర యుగమున తమ ప్రయోజనమైన శ్రీకృష్ణుని, లోకుల కొఱకు వర్షమును లభించిరి. ఆ చరిత్రను, భూమికాభరణమనదగిన శ్రీవిల్లిపుత్తూరు నందు నివసించు చల్లని తామర పూసల మాలికను ధరించు బ్రాహ్మణోత్తములగు శ్రీవిష్ణుచిత్తుల ముద్దులపట్టియైన, గోదాదేవి సుందరమైన ద్రవిడ పాశురముల మాలికగా గూర్చి శ్రియఃపతికి అర్పించినది.

సంఘముగా కూర్చబడిన ఈ ద్రవిడ పాశురముల మాలిక యందలి ముప్పదింటిని క్రమము తప్పక ఈ లోకములో తనవలె అనుసంధింతురో అట్టివారు కూడా పర్వతశిఖరముల వలె పెరిగియుండు నాలుగు భుజములను ధరించియున్నట్టి, వాత్సల్యములు నిండిన నేత్రములు కల్గినట్టియు, ఐశ్వర్యమునిచ్చు దివ్యముఖమండలము కల్గినట్టియు, లక్ష్మీనాథునిచే ఎల్లప్పుడూ అన్ని విషయములలో దివ్య కటాక్షమును పొంది ఆనందింపబడుదురు. ఈ పాశురములే శ్రియఃపతి కటాక్షమును, తమ ననుసంధించువారల కొసగును.

విశేషార్థము – ముప్పది పాటలున్న తిరుప్పావై ఆధ్యాత్మిక వాఙ్మయానికే శిరో భూషణము. ఓ దివ్యమైన ప్రబంధ రాజము. సకల వేదాలకీ బీజము. ఇది నేర్వని వారికి జీవితములో ఓ లోటు ఉండనే ఉంటుందని, భూమి అట్టివారిని మోయుట బరువు చేటని విజ్ఞులందరూ భావించారు.

గోదాదేవి తాను దాల్చి విడచిన మాలలను రెండు రకాలుగా అర్పించింది స్వామికి. ఒకటి పుష్పముల మాల ఉచ్ఛిష్టముగా అందిస్తే 'అదే కావాలని' తీసుకున్నాడు పెరుమాళ్ళు. రెండవది పాశురముల మాలిక. తానునుభవించినవన్నీ స్మరించి అవే పాటలుగా పాడింది. ఇదీ ఆమె ముఖోచ్ఛిష్టమే. ఆ పాటలను స్వీకరించి, 'అవి నిజమేనని' నిరూపించడానికే మానవ కన్యగా ఉన్న గోదాదేవిని అర్చావిగ్రహంలో శ్రీరంగనాథునిగా శ్రీరంగక్షేత్రంలో వివాహమాడి, తనలో చేర్చుకున్నాడు. అందుకనే ఆమె పాటలలో ఎక్కడా అతిశయోక్తులు, అర్థవాదనలు కాని, వ్యర్థ వర్ణనలు కాని ఉండవు. జాగ్రత్తగా అర్థం తెలుసుకుని విశ్వసించాలి. ఈ చివరి పాశురంలో ప్రబంధాన్ని కంఠస్థం చేసినవారికి కలిగే ఫలితాన్ని వివరిస్తోంది ఆండాళ్.

వ్రతాన్ని ఆచరిస్తే కలిగే ఫలితాన్ని 3వ పాశురంలోనే వివరించేసింది. ఇక ఇప్పుడు ఈ ప్రబంధాన్ని నేర్చుకున్నవారికి, అంతమాత్రం చేతనే కలిగే ఫలితం చెప్తోంది. గోపికలు శ్రీకృష్ణ సమాగమానికై వ్రతం చేశారు. ఫలితం పొందారు. ఆండాళ్ శ్రీరంగని చేరటానికి, ఆ వ్రతాన్ని అనుకరించింది. ఫలితాన్ని గోపికల కంటే గొప్పగా పొందింది. మనకీనాడు అన్ని శ్రమలు అక్కర్లేదు. ఇవి చదువుకుంటే చాలునట. వారు పొందినదానికంటే గొప్ప ఫలితాన్ని పొందగలమని ఆండాళ్ వివరిస్తోంది. ఇది పాడినది శ్రీకృష్ణుని గురించి. ఆయన ఒకనాడు తననుండి దూరమై సాగరంలో దాగిన లక్ష్మిని పొందుటకై చేసిన గొప్ప ప్రయత్నమే క్షీరసాగర మథనం. ఆనాడు కొండ క్రింద కూర్మంగా ఒకరూపం, ఆ కొండ పిండి కాకుండా కొండలో కూడా మరో రూపం, నీరసం రాకుండా దేవతలలో, అసురులలో తలోరూపం, త్రాటిగా చుట్టిన వాసుకి తలలో ఒకటి, తోకలో ఒకరూపం, నిలిపిన మంధరం పడిపోకుండా ఆకాశంలో మరో రూపం ఇలా ఎన్ని రూపాలో ఎత్తి దేవతలకు కావలసిన అమృతం వాళ్ళకు ఇచ్చి తనకు కావలసిన లక్ష్మీదేవిని తాను పొంది, మాధవుడైనాడు. మాధవ అంటే లక్ష్మీనాథుడని అర్థం. ఆనాడు సాగరం చిలుకుతుంటే ఆయన యొక్క ప్రశస్తమైన నీలకుంతలములెంత చెదిరిపోయాయో! సుకుమార కేశసంపద అంతా అలా ఎగురుతుంటే ఆయన అందం ఇనుమడించింది. దర్శించిన వారెవ్వరూ అయ్యో! ఏమి దృష్టి తగులుతుందోనని విచారించిన వారు లేరు.

సాగరాన్ని మథించేటప్పుడు వ్యాసభగవానుడికి కన్పడని అద్భుతమొకటి మన ఆండాళ్ కి కన్పించింది. ఆ సాగర జలాల్లో అటూ ఇటూ తిరుగాడే కర్రపడవలు కూడా ఉన్నాయి. అందులోని వారికే ఇబ్బంది కలుగకుండా స్వామి సాగరాన్ని చిలికాడు. ఆ సాగరమే ఈ సంసారము. అందులోని పడవలే ఈ శరీరాలు. అందులో ఉన్నవాళ్ళు స్వామికి మంగళం పాడవచ్చిన ఋషులు. వారికి శ్రమలను తీర్చాడు స్వామి. ఈ సంసారంలో స్వామి గుణాలను అనుభవిస్తూ మంగళం పాడగోరిన భక్తులకు ఈ సాగరపు అలల తాకిడి లేకుండానే స్వామి కాపాడతాడట. అమ్మతో కలిసి వారిని రక్షిస్తాడట.

ఆనాటి ఆ ప్రయత్నమంత ప్రయత్నము, ఈనాడు తమ వైముఖ్యాన్ని తగ్గించి, గోప పెద్దలను ఒప్పించి తనవైపు త్రిప్పుకోవడానికి శ్రీకృష్ణుడు తననే చేసుకొన్నాడు. దానికడ్డుగా ఉన్న తమ దురభిమానాన్ని కేశి యనే అసురుణ్ణి సంహరించినట్లే తొలగించివేశాడు. కేశవుడైనాడు. కేశిని వధించినవాడని అర్థం.

రెండవ పాశురంలో పాల్కడలిలోని పరముని పాదమును పాడి ఆరంభించిన ఈ నోమును 'కేశాంతము' పాడి ముగిస్తున్నారు. భగవంతుని సేవించేటప్పుడు కేశాంతము దర్శించాలి. అలాగే దర్శించి వీరి ముఖములు వికసించాయి. హృదయములోని విరహ తాపము తీరి చల్లని చంద్రకాంతులీను ముఖ సౌందర్యము వచ్చింది. అదే గొప్ప ఆభరణములా ఉంది మనవారందరికీ. ఈ అందం చెదరకుండానే స్వామిని చేరాలనే త్వరతో వెళ్ళి శ్రీకృష్ణుని చేరిరి. మంగళాశాసనం చేసి తాము కోరిన పఱై పురుషార్థాన్ని పొందారు.

మొదట వ్రేపల్లెలో వ్రతం చేసి ''కృష్ణప్రాప్తి'' అనే ఫలం పొందారు గోపికలు. ఆ విధానాన్ని పాడింది మన ఆండాళ్.

ఆమె విష్ణుచిత్తులవారి కుమార్తె. వీరు శ్రీవిల్లిపుత్తూరు నివాసులు. ఆ విల్లిపుత్తూరు భూమండలానికి అలంకారమనదగిన కేంద్రం. కారణమేమిటి? ప్రపంచానికే ఆధారుడైన పరమాత్మ విష్ణుచిత్తులవారి హృదయంలో ఉన్నాడు. ఆ పరమాత్మలోంచే కదా విశ్వపద్మకోశం పుట్టి అందులోంచి చతుర్ముఖుడు వచ్చాడు. ఆ పద్మానికి బీజం పరమాత్మ. ఆయన్నే హృదయంలో కలవారు శ్రీవిష్ణుచిత్తులు. ఆ ఒక్కనినే కాదు, ఆయన వివిధ అవతార చేష్టలను పద్మబీజాల మాలికగా ధరించినవారు వీరు. భగవంతుణ్ణి తమ స్వాధీనంలో కల సదాచార్యలు సంబంధంతోనే ఆండాళ్ చెప్పుకుంటోంది తనని గురించి. వారికి చెందిన గోదా అంటే మనకు ఒక ఆదరము ఏర్పడుతుంది కదా. ఆమె చెప్పిందే 30 పాటల తిరుప్పావైగా ప్రసిద్ధి గాంచింది.

ఈ పాశురాలు ఒంటరిగా పాడటం కంటే అందరూ కలిసి పాడవలసినవి. ఎందరుంటే అంత తృప్తినీ, ఆనందాన్ని ఇచ్చే ద్రావిడ మాలికలీ తిరుప్పావై. భూదేవి గోదా అయినట్లే, ఉపనిషత్తులూ ద్రావిడ గీతికలయినాయి.

వీటిని ''ఇక్కడ 'ఈ విధంగా' అనుసంధించండి చాలు'', అంటూ ఎంతో ఉదారంగా ఆండాళ్ పాడి, శ్రీరంగనిచే ఆమోదముద్ర వేయించింది. ఇక ఆయన కూడా కాదనలేదు. 'ఇక్కడ' అంటే, శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ ఆచరించిన విధానాన్ని తలవండి అన్నట్లుంది కదా! అదంతా మనం తలవగలమా? ఇంకా క్రిందకు వద్దాం. అక్కడ జరిగినదానిని మన ఇళ్ళలోనే కూర్చుని తలుచుకుంటే చాలునట. ఆ మాత్రం చేసేవారందరికీ కూడా ఎంత లాభం కలుగుతుంది? ఆండాళ్ చెబుతోంది. తనకంటే అధికమైన ఫలం శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుని దివ్య కృపతో ఈ లోకంలో సౌఖ్యాలను, పై లోకాలలోని సౌఖ్యాలనూ కూడా తప్పక పొంది తీరుతారు. అలా వాళ్ళని అనుగ్రహించడానికే రెండు చేతులను, ఆశ్రితులను విడువనే విడువనన్నట్లు దృఢమైన నాలుగు బాహువులుగా చేసుకొని సిద్ధంగా ఉంటాడట. ఆ పని కూడా మనకోసం అని గాక, తనకే అదొక అలభ్య లాభంగా భావిస్తాడని ఆయన యొక్క వాత్సల్య పూర్ణమైన ఎఱ్ఱని ముఖారవిందమే చెప్తోంది. చూడండి! అన్నది ఆండాళ్.

తెల్లవారుతూ ఈ 30 పాటలు పాడుకున్నా సరే, లేదా చివరి రెండూ చదువుకున్నా సరే. అదీ రాకపోతే మన ఆచార్యులు ఫలానా చోట ఇలా ఆచరించారట అని అన్నా సరే చాలు. తత్ఫలితాన్ని పొందడంలో లోపమేమీ లేదంటుంది ఆండాళ్. అలాగే వాళ్ళకీ పొందిస్తానన్నాడు శ్రీరంగనాథుడున్నూ, అమ్మతో ఎప్పుడూ చేరి ఉంటాడు, కనుక తన ప్రతిజ్ఞ నెప్పుడూ మరువడు. మనకా ధైర్యం సడలినప్పుడల్లా తిరిగి జ్ఞాపకం చేసుకోవడానికే గోదా రంగనాథుల కళ్యాణ మహోత్సవం భోగి నాడు జరుపుకుంటాం. 'ఆ గోదా రంగనాథుల కళ్యాణం దేశంలోని, లోకంలోని ఉపద్రవాలు, ఉద్రేకాలు, హింసలు, ఘోర మారణ యుద్ధాలు ఉపశమింపచేసి లోక కళ్యాణాన్ని కలిగించు గాక' అని మనమంతా ప్రార్థిద్దాం.

**ఆండాళ్ తిరువడిగళే శరణమ్ – జై శ్రీమన్నారాయణ!**


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# విజయదశమికి శమీ వృక్ష ప్రాముఖ్యత

– కౌతా నిర్మల

**"శమీ శమయతే పాపం, శమీ శత్రు నివారిణీ**
**అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ"**

ఈ శ్లోకం చదువుతూ శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఆ వృక్షాన్ని పూజిస్తారు. శమీ వృక్షానికి జమ్మిచెట్టు అని మరో పేరు ఉంది. శమీ వృక్షం లోనే అపరాజిత అనే దేవత ఉంటుందట. అందుకే శమీవృక్షం దేవతా వృక్షమయింది. విజయదశమి పండుగనాడు శమీ వృక్షాన్ని పూజిస్తారు. ఆనాటి సాయంత్రం నక్షత్ర దర్శనం చేసుకుని, అపరాజితాదేవిని పూజిస్తారు. శమీవృక్షపు శ్లోకాన్ని రాసి, ఆ కాగితాన్ని చెట్టుకొమ్మలకు కడితే, అమ్మవారి అనుగ్రహంతో పాటు, శనిదోష నివారణ కూడా జరుగుతుంది. శమీవృక్ష దర్శనం, స్పర్శ వల్ల పాపాలు తొలగిపోతాయి. శత్రునాశనం జరుగుతుంది. తలపెట్టిన పనులన్నీ శమీ దేవత సక్రమంగా జరిగేలా చేస్తుంది. శమీచెట్టుకు ఎంతో విలువ, ప్రాధాన్యత, విశిష్టత ఉన్నాయి.

పాండవులు అజ్ఞాతవాస సమయంలో వారి ఆయుధాలను శమీవృక్షపు గుబురులో దాచి, అజ్ఞాతవాసము ముగియగానే, ఆ వృక్షము వద్దకు వెళ్ళి, ఆ చెట్టుకు నమస్కరించి, ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. తమ ఆయుధాలు ఇతరుల కంట పడకుండా భద్రపరచినందుకు శమీదేవతకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఆ ఆయుధాలకు అపరాజితా దేవి అనుగ్రహం లభించి, పాండవులకు ఆ దేవి ఆశీర్వాదం లభించి, వారు కౌరవులపై విజయాన్ని పొందారు. శ్రీరాముడు విజయదశమి రోజున శమీవృక్షాన్ని పూజించి, రావణుడిని యుద్ధంలో పరాజితుడిని కావించి, సంహరించి, విజయాన్ని పొందాడు. అయోధ్యకు వెళ్ళటానికి ముందుగా శ్రీరాముడు శమీవృక్షాన్ని పూజించాడు.

మరొక పురాణ కథ కూడా ప్రస్తావించబడింది. శ్రీరాముని వంశంలోని పూర్వీకులలో రఘు మహారాజు ఒకరు. ఆయన ప్రపంచమంతా జయించి, ఆ విజయోత్సవం సందర్భంగా ఒక యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞానికి విశ్వజిత్తు అని పేరు. తన వద్ద ఉన్న సంపదనంతా ఈ యజ్ఞం ద్వారా ప్రజలకు పంచిపెట్టేస్తే యజ్ఞము చేసిన ఫలితం లభిస్తుంది. తనకు ఉన్నదంతా ప్రజలకు పంచేసిన మహారాజు తన సర్వస్వం కోల్పోయి, బికారిగా మారి ఒక పూరిగుడిసెలో నివసించసాగాడు. అటువంటి దైన్యస్థితిలో ఉన్న మహారాజు వద్దకు ఓ మునికుమారుడు వచ్చి, తనకు ఏడు కోట్ల బంగారు వరహాలను ప్రసాదించవలసిందిగా ఆయనను కోరాడు. ఆ వరహాలను తన స్వార్థం కోసం కోరలేదనీ, వాటిని గురుదక్షిణగా సమర్పించాలనీ చెప్పాడా మునికుమారుడు.



అతని గురుభక్తికి మెచ్చిన ఆ మహారాజు ఇంద్రుని మీద దండెత్తి, అతనిని ఓడించి, అక్కడి సంపదతో పాటుగా, శమీ ఔషధాలను భూలోకానికి తెచ్చాడు. ఏడుకోట్ల బంగారు వరహాలను మునికుమారునికి ఇచ్చి పంపుతాడు రఘు మహారాజు. ఇంద్రుని పరాజితుని గావించి, సంపదను అపహరించిన విషయం తెలుసుకున్న దేవతలు ఆగ్రహావేశాలతో తమ విమానాల్లో భూలోకానికి బయలుదేరారు. అయితే ఆ విమానాలను మోసే శక్తి, ఆ వేగాన్ని ఆపే శక్తి భూమికి సాధ్యం కాలేదు. అప్పుడు ఆ విమానాల వేగాన్ని శమీవృక్షం ఆపిందట. శమీవృక్షాల మధ్య, ఆ వనంలో రఘుమహారాజుకు, దేవతలకూ మధ్య తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. ముని కుమారునికి ఇవ్వగా మిగిలిన బంగారు వరహాలను, ఆ సంపదను ఆ మహారాజు ఇంద్రునికి ఇవ్వబోగా, దానిని అతడు తీసుకోవటానికి నిరాకరించాడు. ఎవరు ప్రాధేయపడినా ఇంద్రుడు అంగీకరించకపోవడంతో అవి తనకు కూడా అవసరం లేదని, ఆ మహారాజు వాటిని శమీ వృక్షాలకు పంచేశాడు.

"నీ వేర్లు వ్యాపించిన భూమి అంతటా నీరు ఉండుగాక, నీ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారికి పాపాలు తొలగిపోవు గాక, నీ ఆకులు విషాలను హరించు గాక" అని శమీ వృక్షానికి వరాలను ప్రసాదించాడు. సిరి సంపదలను తన స్వంతం చేసుకున్న శమీ వృక్షాన్ని పూజించినట్లయితే దరిద్ర బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. జమ్మి ఆకులను బంగారంగా భావించి, పెద్దవారి చేతిలో జమ్మి ఆకులను పెట్టి వారి ఆశీర్వాదాన్ని పొందుతారు.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

దూతలకు అనేక శిక్షలున్నాయని శాస్త్ర వచనం. వికలాంగునిగా చేయవచ్చు. కొరడా దెబ్బలు కొట్టి పంపించవచ్చు. శిరోముండనం చేయించవచ్చు. శరీరంపై వాతలు వేయించవచ్చు. అందులో ఏదో ఒక దండన విధించవచ్చు. కాని దూతని వధించటం మనం ఎన్నడూ వినలేదు.

రాక్షసరాజా! నీవు ధర్మార్థ విదుడవు. మంచి చెడ్డలు ఆలోచించు. కోపావేశంతో ఏ పనీ చేయవద్దు. జ్ఞానులు కోపాన్ని అణుచుకుంటారు. వీరుడా! ధర్మకార్యాల్లో ధర్మ నిరూపణలో నీకు నీవే సాటి. నీలాగా లోకాచారం తెలిసినవాడు మరొకడు లేడు. సురాసురలలో నీవు గొప్పవాడవు. నీ బుద్ధికుశలత అమోఘం. కపిని చంపితే నీకేం లాభం? ఎవరైతే ఈ కోతిని పంపారో – వాళ్ళని చంపాలి. వీడు మంచివాడా, చెడ్డవాడా – ఎవడైనా సరే శత్రువుల చేత పంపబడ్డాడు. వీడు పరతంత్రుడు. అస్వతంత్రుడు. వాళ్ళేం చెప్పారో – అదే మనకు వినిపించాడు. వీడు దూత. వధార్హుడు కాదు. వీడిని చంపితే మహాసముద్రం దాటి వచ్చేవారుండరు. ఈ కోతిని వదిలేస్తే – వెళ్ళి శత్రువులకి చెప్తాడు. వాళ్ళు మనపై యుద్ధానికి వస్తారు. పరాక్రమంలో, ఉత్సాహంలో, పౌరుషంలో దేవ దానవులకి దుర్జయుడవు. యుద్ధ ప్రియుడవు. రాబోయే యుద్ధానికి అవకాశం కల్పించు. అంతేకాని కోతిని చంపకు. ఆ పాడు పని చేయకు. శూరులు, హితులు, యుద్ధోత్సాహులు, శస్త్రధారుల్లో శ్రేష్ఠులు కోటాను కోట్లమంది ఉన్నారు. నీవు ఆజ్ఞాపించు. వాళ్ళు వెళ్తారు. మూఢులైన రాజపుత్రుల్ని బంధిస్తారు. అపుడు నీ పరాక్రమం శత్రువులకి తెలుస్తుంది.

విన్నాడు రాక్షసరాజు రావణుడు. తమ్ముడి సూచన మంచిదనుకున్నాడు. మనస్ఫూర్తిగా అంగీకరించాడు.

## తోకకు నిప్పు

విభీషణుని మాట విన్నాడు రావణుడు. అంటున్నాడు ‘‘నీవు బాగా చెప్పావు. దూతని వధించటం నింద్యమే. అయినా ఈ కోతిని శిక్షించాలి. మరో రకంగా దండిస్తాను. కోతులకు తోక ఇష్టం. వీడి తోకను కాల్చండి. కాలిన తోకతో వెళ్తాడు. అది అంగవైకల్యమే. చూస్తారు వీడి ఆప్తులు. ఇంకా బంధువులు చూస్తారు. దాయాదులు చూస్తారు. దుఃఖిస్తారు. సేవకులారా! వీడి తోకకు నిప్పంటించండి. నాలుగు వీధుల కూడళ్ళలో తిప్పండి. నగరమంతా తిప్పండి – అది రావణుని ఆజ్ఞ.

విన్నారు రాక్షసులు. ఆదేశం విన్నారో లేదో కోపోద్రిక్తులైనారు. చినిగిన గుడ్డపీలికలు తెచ్చారు. హనుమంతుని తోకకు చుట్టారు. నూనెలు పోశారు. గుడ్డని తడిపారు. నిప్పంటించారు.

చూశాడు హనుమ. రోషాపూరితుడైనాడు. బాల సూర్యునిలా

ఉంది ముఖం. తోక చేత్తో పట్టాడు. చుట్టూ తిప్పాడు. రాక్షసుల్ని తరిమాడు.

కోతికి నిప్పంటించారు. వార్త తెలిసింది. స్త్రీలు బాలురు వృద్ధులు వచ్చి చూశారు. కొందరు రాక్షసులు తాళ్ళు తెచ్చారు. గట్టిగా కట్టారు హనుమంతునికి. వాటిని తెంచుకునే శక్తి ఉందతనికి. అలాగే ఉన్నాడు. ఆలోచించాడు. వీళ్ళు బంధించారు. నన్నేమీ చేయలేరు. తాళ్ళు తెంచుతాను. పైకెగురుతాను. అందరినీ చంపేస్తాను. అయినా వీళ్ళు రాజాజ్ఞకు కట్టుబడ్డారు. వీళ్ళకెంతో కష్టం కల్గించాను. నష్టం కలిగించాను. నాపై పగబట్టారు. అది తీర్చుకుంటున్నారు. నేను కల్గించిన కష్టనష్టాలు ఎక్కువ. వీళ్ళు చేసేది తక్కువే. లంకాపురి అంతటా తిప్పుతారు నన్ను. అపుడు రాత్రి చూశాను. దుర్గనిర్మాణం, నగర రక్షణ, బలాలు, రక్షణ పద్ధతులు చూడలేదు. ఇది పగలు. ఇపుడు చూస్తాను. మన బలగాలు ఎలా పోరాడాలో తెల్సుకోవచ్చు. వీళ్ళు నన్ను కొట్టినా సరే, బాధపెట్టినా సరే – మనసు క్లేశపడదు అనుకున్నాడు.

క్రూరకర్ములు రాక్షసులు. శంఖాలు ఊదారు. భేరీలు మోగించారు. జబ్బలు చరిచారు. సింహ గర్జనలు చేశారు. లంకా నగరం తిప్పాలనుకున్నారు. తాళ్ళతో లాగసాగారు హనుమంతుణ్ణి. నడుస్తున్నాడు. వాయుపుత్రుని చూపులన్నీ నగరం మీదున్నాయి. అన్నీ పరిశీలిస్తున్నాడు.

రాజప్రాసాదాలు, గుప్త భూగృహాలు, వీధుల కూడళ్ళు నిశితంగా పరిశీలిస్తున్నాడు. ఇరుకుగా ఉన్న వీధులు, సందులు, కూడళ్ళు, విశాల మార్గాలు, రహస్య ద్వారాలు, చిన్న ఇళ్ళు, ఆకాశాన్నంటే భవనాలు చూస్తున్నాడు.

నాలుగు వీధుల కూడళ్ళ రాగానే ఆగుతున్నారు రాక్షసులు. నాలుగు స్తంభాల మంటపాల దగ్గర ఆగుతున్నారు. రాజమార్గాల్లో ఆగుతున్నారు. ''ఈ కోతిని చూడండి. గూఢచారి'' అని చాటింపు వేస్తున్నారు.

ప్రతి ఇంటిల్లిపాదీ బయటికి వస్తున్నారు. కుతూహలంగా చూస్తున్నారు హనుమంతుణ్ణి. తోక మండుతోంది. చూశారు రాక్షసాంగనలు. పరుగులు తీశారు. సీతాదేవిని చేరారు. చెబుతున్నారు.

సీతా! నీతో ఒకడు మాట్లాడాడు. వాడి తోకకు నిప్పంటించారు. నగరమంతా తిప్పుతున్నారు రాక్షసులు.

వినింది సీతమ్మ. ఆ మాటలు ములుకుల్లా చెవులకి గుచ్చుకున్నాయి. విలపించింది. హనుమ క్షేమం కోరింది. అగ్నిదేవుని ప్రార్థించింది.

**యద్యస్తి పతి శుశ్రూషా యద్యస్తి చరితం తపః ।**
**యది చాస్త్యేక పత్నీత్వం శీతోభవ హనుమతః ॥**

నేను భర్తకు శుశ్రూషలు చేసిన దాన్ని, అయితే నేను తపస్సు ఆచరించి ఉంటే, నేను పతివ్రతనయితే ఓ అగ్నిదేవా! హనుమకు చల్లబడు (దహింపకు).

**యది కించి దనుక్రోశః తస్యమయ్యస్తి ధీమతః ।**
**యది వా భాగ్యశేషో యే శీతోభవ హనుమతః ॥**

నాపై రామునికి ఏ మాత్రం దయ ఉంటే, నాకు ఏదైనా భాగ్యశేషం ఉంటే ఓ అగ్నిదేవా! హనుమకు చల్లబడు.

**యది మాం వృత్త సంపన్నాం తత్సమాగమ లాలసామ్ ।**
**సవిజానాతి ధర్మాత్మ శీతో భవ హనూమతః ॥**

నన్ను శీల సంపన్నురాలిగా రాముడు భావిస్తే తన కలయిక కోసం నేను ఆరాట పడుతున్నానని తెల్సుకుంటే ఓ అగ్నిదేవా! హనుమకు చల్లబడు.

**యది మాం తోయే దార్యః సుగ్రీవస్సత్య సంగరః ।**
**అస్మోద్దుఃఖాంబు సంరోధాత్ శీతోభవ హనూమతః ॥**

పూజ్యుడు, సత్యసంధుడు అయిన సుగ్రీవుడు నన్ను ఈ దుఃఖ సముద్రం నుంచి తరింపచేసేవాడైతే అగ్నిదేవా! హనుమకు చల్లబడు.

అది సీతమ్మ ప్రార్థన.

హనుమంతుని తోకకి ఉన్నాడు అగ్నిదేవుడు. తీవ్ర జ్వాలలతో ప్రజ్వరిల్లుతున్నాడు. సీతమ్మ ప్రార్థన విన్నాడు కాబోలు – శుభం కలిగేలా ప్రదక్షిణ జ్వాలతో – హనుమంతుని చుట్టూ తిరుగుతున్నాడు. తోకను ఏమాత్రం కాల్చలేదు. వేడీ తగలనీయలేదు. వాయుదేవుడు కూడా ప్రసన్నుడైనాడు. మారుతికి స్వస్థత కలిగేట్లు మంచుగాలిగా చల్లగా వీస్తున్నాడు.

గమనించాడు హనుమంతుడు. తోక కాలలేదు. మంటలు నా శరీరాన్ని కాల్చడం లేదు. మహాజ్వాలగా ఉంది కాని అగ్ని నన్నేం బాధించడం లేదు. కారణం – ఆలోచించాడు. ఇదంతా రామ ప్రభావం. రామానుగ్రహం. సముద్రం దాటుతూ ఉంటే మైనాకుడు వచ్చాడు. నాకు సాయపడతానన్నాడు. ఇపుడు అగ్నిదేవుడు సాయపడుతున్నాడు. సీతమ్మ దయ – రాముని తేజస్సు – నా తండ్రికి అగ్నితో స్నేహం– ఇవే కారణాలతో నన్ను దహించడం లేదు. నిర్ణయానికి వచ్చాడు మారుతి.

మరోక్షణం ఆలోచించాడు. సింహనాదం చేశాడు. ధైర్యవంతుడు, తేజోవంతుడు, తన శరీరాన్ని చిన్నది చేశాడు. కట్టిన తాళ్ళన్నీ కుప్పగా కూలాయి. వెంటనే పర్వతాకారుడైనాడు. నలువైపులా చూశాడు. బహిర్ద్వారం దగ్గరికి వెళ్ళాడు. అక్కడి ఇనుప గడియను చూశాడు. పెరికాడు. ఆ ఇనుప గుదియ చేత పట్టాడు. రాక్షసుల్ని కొట్టాడు. చంపాడు– రణచండ విక్రముడు హనుమంతుడు. మళ్ళీ లంకాపురిని చూశాడు. మండుతున్న లంకను చూశాడు.

హనుమ తోక కాలుతోంది. తన శరీరం కాలుతున్నట్లుగా తోచింది సీతమ్మకి. ఆమె ఓర్చుకోలేదు. అగ్నిదేవుని ప్రార్థించింది. హనుమకు స్వస్థత లభించిందన్నాడు వాల్మీకి. నిజంగా

అది సీతమ్మకి స్వస్థత అని చెప్పాలి. ఆమె పతివ్రత అని నిరూపింపబడింది. ఆమె అంటే రామునికి అపారమైన ప్రేమ అని నిరూపింపబడింది. సుగ్రీవుడు సత్యసంధుడని, తప్పక సీతమ్మ దుఃఖం పోగొట్టగలడని నిరూపింపబడింది.

కష్టాలు వస్తే భారమంతా భగవంతునిపై వుంచాలి. ఆ స్వామి రక్షకుడని విశ్వసించాలి. ఆ నమ్మకమే జీవుణ్ణి కాపాడుతుంది. నా భక్తుడు చెడిపోడు అన్నాడు కృష్ణపరమాత్మ గీతలో. హనుమ సహనమే – సీతమ్మ స్పందించటానికి కారణం. అగ్నిదేవుడిని శాంతింపచేసిందామె. వాయుదేవుడిని అనుగ్రహింప చేసిందామె.

## లంకా దహనం

లంకను చూశాడు హనుమంతుడు. ఉత్సాహం ఉరకలు వేసింది. మిగిలిన పనేమిటో ఆలోచించాడు. ఈ రాక్షసులకి ఇంకా సంతాపం కల్గించాలి. దానికేం చేయాలి? వనం పాడు చేశాను. రాక్షసులలో కొందరిని చంపాను. సైన్యంలో కొంతభాగం నాశనం చేశాను. ఇక మిగిలింది దుర్గధ్వంసం. నగర ధ్వంసం. అది చేస్తే – సముద్ర లంఘన కార్యం సఫలమవుతుందనుకున్నాడు. తన తోకని చూసుకున్నాడు. ఈ అగ్నిదేవుడు నన్ను చల్లగా చూశాడు. నాకు సాయపడ్డాడు. ప్రతిఫలంగా ఈ భవనాల్ని ఆహుతి చేస్తాను. అగ్నికి సంతర్పణం గావిస్తాను. అదే న్యాయం.

మెరుపు వేగంతో వెళ్ళాడు. భవనాలపై సంచరించాడు. ఉద్యానవనాలు, ప్రాసాదాలు తిరిగాడు. రాజగృహాల్లో తిరిగాడు. మొదట ప్రహస్తుని ఇంటికి నిప్పంటించాడు. దాంతో దహన కార్యం బోణీ అయ్యింది. తర్వాత మహాపార్శ్వుని ఇంటికి దూకాడు. దాన్ని కాల్చాడు. ఆ తర్వాత వరుసగా వజ్రదంష్ట్రుడు, శుకుడు, సారణుడు, ఇంద్రజిత్తు, జంబుమాలి, సుమాలి ఇళ్ళకి నిప్పంటించాడు. అలా అందరి భవనాలు దాటాడు. విభీషణుని భవనం విడిచాడు. రావణుని భవనం చేరాడు. అది నానారత్న విభూషితమయం. అగ్నిజ్వాలలతో ముంచాడు. ప్రళయకాల మేఘంలా గర్జించాడు. అగ్నికి వాయువు తోడైంది. అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లాయి.

బంగారు గవాక్షాలతో ముత్యాలమయమైన రత్నాల మయమైన భవనాలు దగ్ధమవుతున్నాయి. తమని తాము రక్షించుకునేవారు పరుగులు తీస్తున్నారు. సంపదలతో సర్వమూ కోల్పోయారు కొందరు. వాళ్ళు గగ్గోలు పెడుతున్నారు. అయ్యో అగ్నిదేవుడు కోతి రూపంలో వచ్చాడు అంటూ ఏడ్వసాగారు. లబోదిబో మంటున్నారు స్త్రీలు. పిల్లల్ని చంకనేసుకున్నారు కొందరు. ఇళ్ళలోంచి దూకుతున్నారు. హా తాతా! హా పుత్రా! కాంతా! మిత్రా – ఆక్రందనలు మిన్నుముట్టాయి.

వజ్రాలు పగడాలు వైఢూర్యాలు ముత్యాలు వెండి బంగారు వగైరాలతో నిర్మింపబడ్డాయి భవనాలు. అగ్నితప్తమై



కరిగిపోతున్నాయి. ఎన్ని కట్టెలు వేసినా అగ్ని తృప్తి పడదు. అలా ఎన్ని భవనాలు దగ్ధం చేసినా తృప్తి లేదు మారుతికి. చచ్చిన రాక్షసులతో భూమి కూడా తృప్తి పడలేదు.

లంకానగరం దహింపబడుతోంది. అగ్నిజ్వాలలు ఆకాశాన్నంటాయి. ఆ జ్వాలలు ఒకచోట మోదుగుపూవుల్లా ఉన్నాయి. ఒకచోట బూరుగుపూవుల్లా ఉన్నాయి. ఒకచోట కుంకుమరంగులో ఉన్నాయి. ఆనాడు త్రిపురాలను భస్మం చేశాడు రుద్రుడు. ఈనాడు లంకాపురిని దగ్ధం చేశాడు హనుమంతుడు. కోటి సూర్యకాంతులతో, పిడుగుల్లాంటి శబ్దాలతో లంకంతా వ్యాపించాయి. బ్రహ్మాండం బద్దలైందా అన్నట్లుగా ఉంది.

ఇంద్రుడో, మహేంద్రుడో, యముడో, అనిలుడో, రుద్రుడో, సూర్యుడో, కుబేరుడో అయి ఉంటాడు ఈ వానరుడు. మృత్యువే ఈ రూపంలో వచ్చిందేమో. పితామహుడు బ్రహ్మ సర్వ జగత్ సృష్టికర్త, రాక్షసుల్ని నశింప చేయాలనుకున్నాడేమో. ఉగ్ర వానర రూపం దాల్చాడేమో. వైష్ణవ తేజస్సు రాక్షస వినాశనానికై కపిరూపంలో వచ్చిందేమో. శాపగ్రస్తమైన దానిలా ఉంది లంకానగరం.

లంకాదహనం అయింది. తిన్నగా త్రికూట పర్వతంపై నిలిచాడు మారుతి. రామధ్యానంలో నిమగ్నుడైనాడు. చూశారు దేవతలు. దగ్ధమైపోతోంది లంక. చూశారు గంధర్వులు, సిద్ధులు, మహర్షులు. ఆశ్చర్యపోయారు. ప్రళయకాలాగ్ని రూపుడా అన్నట్లున్నాడు హనుమంతుడు. భయభ్రాంతులైనారు.

సమస్త దేవతలు, మునీశ్వరులు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు పరమానందం పొందారు. సకల ప్రాణులు మహదానందభరితమైనాయి.

మనలో మాట – అగ్ని, వాయువు, సూర్యుడు, సముద్రుడు,

పంచభూతాలు రావణునికి భయపడతాయట కదా. మరి అగ్నిదేవుడు లంకను ఎలా దహించాడు? రావణునికి భయపడలేదా? – ప్రశ్న. అది సీతమ్మ శోకాగ్ని. ఆమె సాక్షాత్ లక్ష్మీదేవి కదా. ఆమె అనుగ్రహం తోడైంది. ధైర్యం వహించాడు అగ్నిదేవుడు. దహించాడు లంకానగరాన్ని – ఇది ఒక సమాధానం. సీతమ్మ శోకాగ్ని ముందు అగ్నిదేవుడు, వాయుదేవుడు, ఆంజనేయుడు నిమిత్తమాత్రులు – ఇది రెండో సమాధానం.

## నాగ్ని రగ్నీ ప్రవర్తతే

మహాబలశాలి వాయుపుత్రుడు హనుమంతుడు. సంపూర్తిగా లంకను దగ్ధం చేశాడు. తోకను చూసుకున్నాడు. ఆ వాలాగ్నిని సముద్రంలో చల్లార్చుకున్నాడు. లంకకేసి మరోసారి చూశాడు. భయపడ్డాడు. తనని తాను నిందించుకున్నాడు. లంకంతా కాల్చాను. ఎంత పని చేశాను? నీటితో నిప్పును నిరోధిస్తారు. వచ్చిన కోపాన్ని బుద్ధిబలంతో నిగ్రహిస్తారు. వారే పురుష శ్రేష్ఠులు. ధన్యులు వారే. కోపిష్ఠి పాపం చేస్తాడు. గురువుల్ని చంపేస్తాడు. పెద్దల్ని ఆక్షేపిస్తాడు. ఈ మాట అనవచ్చు – ఈ మాట అనకూడదు – అనే విచక్షణ కోల్పోతాడు. కోపిష్ఠి చేయరాని పని వుండదు. పాము కుబుసాన్ని విడుస్తుంది. అలా ఓర్పుతో కోపాన్ని వదలాలి. వాడే పురుషుడు.

**దిగ్ధస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జాం పాపకృత్తమమ్ ।**
**అచింతయిత్వా తాం సీతామ్ అగ్నిదం స్వామి ఘాతుకమ్ ॥**

ఛీ. నేనెంత బుద్ధిహీనుణ్ణి. ఎంత సిగ్గుమాలినవాణ్ణి. ఎంత మహాపాపిని. ముందు వెనుకలు ఆలోచించలేదు. సీతమ్మని అగ్నిపాలు చేశాను. స్వామి ద్రోహం చేశాను. లంకంతా కాలిపోయింది. సీతమ్మ కూడా కాలిపోయి ఉంటుంది. లంకను తగులబెడుతుంటే సీతమ్మ గుర్తు రాలేదు. ఆమెను రక్షించాలని తోచలేదు. రామకార్యం సర్వనాశనమైంది. నా ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరైంది.

సీతను చూశాను. ఆ కార్యం నెరవేరింది. ఇక సీతా సందేశం వినిపించాలి రామునికి. అది మిగిలిందనుకున్నాను. క్రోధాంధుణ్ణి. మూల విచ్ఛేదానికి కారకుణ్ణి. అయ్యో లంకంతా దగ్ధమైంది. భస్మం కాని చోటు లేదు. సీతాదేవి తప్పక చనిపోయి ఉంటుంది. ఇదంతా నా తెలివితక్కువతనం. పని పాడైంది. ఇక నేనెందుకు? ఇక్కడే ప్రాణత్యాగం చేస్తాను. మంటల్లో దూకనా? సముద్రంలోని బడబాగ్నికి ఆహుతి కానా? సముద్రంలోని జల జంతువులకి ఆహారమైపోనా?

వెనక్కి వెళ్తాననుకో. సుగ్రీవునికి ఏం చెప్పాలి? రామలక్ష్మణులకు ముఖం ఎలా చూపను? కోతుల చపలత్వం స్పష్టం చేశాను. ఛీ. రాజసభావం ఎంత చెడ్డది? అది అదుపు లేనిది. చంచలమైంది. కార్యదక్షుణ్ణి. రజోగుణ ప్రభావంతో ఆగ్రహావేశానికి లోనయ్యాను. కార్యధ్వంసం చేశాను. సీతమ్మను రక్షించుకోలేకపోయాను. **(సశేషం)**

## మీ ప్రశ్న – మా సమాధానం

**నిర్వహణ:**
**డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. భక్తి, జ్ఞాన, వైరాగ్యం భిక్షాం దేహి బాబు! వెంకన్న బాబు అని అడగవచ్చునా?**

జవాబు – భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు జగత్పిత. మనం ఆయన సంతానం. వారిని కాక ఇంకెవరిని అడుగుతాం? అడిగేవారు 3 రకాలుగా ఉంటారు. అనగా ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు అని స్వయంగా కృష్ణ పరమాత్మే – (కృష్ణావతారంలో భగవంతుడు) భగవద్గీతలో చెప్పాడు. నిజానికి ఆయనను మనం ఏమీ అడగక్కర్లేదు. నిష్కామ భక్తితో శరణాగతి చేస్తూ మనం మనకోసం కాక "లోకా స్సమస్తాః సుఖినో భవంతు" అని ప్రార్థిస్తే, మనకేం కావాలో అది ఆయన మనకి సరైన సమయంలో, సరైనంత, సరైనవిధంగా ఇస్తాడు. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు అడగడం చాలా విశేషం. ఐహిక సుఖాల కన్నా ఇవే మనం అడగవల్సినవి. కాబట్టి అడిగేముందు వాటిని కోరుకునేముందు గాను మనం అర్హత సంపాదించుకోవాలి. అదీ ఓ సద్గురువు ద్వారా మనం పొంది, ఆపై భగవంతుణ్ణి త్రికరణశుద్ధిగా కోరుకోవచ్చు.

**2. 'శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే' ఇది గజేంద్ర మోక్షమని తెలుపగలమా?**

జవాబు – 'శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే' అని మనం ఆ ఏడు కొండలవాడిని శరణాగతి చేస్తాం. నీ పాదకమలసేవ ప్రసాదించు అని సభక్తికంగా ఆయనను వేడుకుంటాం. ఇది గజేంద్రునికే కాదు, పరమాత్మ దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంరక్షణలకై ధరించిన ప్రతి అవతార పరంగానూ, మనం దీనిని చెప్పవచ్చు. గజేంద్ర పరంగా అంటే మీ ఉద్దేశ్యం ఆయనకి మోక్షం ఇచ్చినట్లు అనా? నిజానికి ఆ ఘట్టంలో స్వయంగా శ్రీహరి చేత వధించబడి మోక్షం పొందినది మొసలే. గజేంద్రుడు దానినుండి రక్షింపబడ్డాడు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 375. భైష్మీ ప్రణయ భాషా వతే నమః

–విదర్భ దేశాధిపతి యగు భీష్మకుని కుమార్తె భైష్మి. ఆమె రుక్మిణి అను పేరు కలది. రుక్మిణి చేత పంపబడిన ప్రణయ ప్రతిజ్ఞ లేఖ కలవాడు కృష్ణుడు.

రుక్మిణి కృష్ణుని యొక్క అందచందములను, బల పరాక్రమములను, ఔదార్యాది సద్గుణములను విని కృష్ణుని యందు ప్రీతి కలదై కృష్ణుడే తనకు తగిన వరుడని నిశ్చయించుకొనెను. రుక్మిణి యొక్క బుద్ధి కౌశలము, శుభ లక్షణములు, రూప సౌభాగ్యము, ఉత్తమ గుణములను విని యుండి కృష్ణుడు రుక్మిణియే తనకు తగిన వధువు అని నిర్ణయించుకొనెను. ఇట్లు రుక్మిణీ కృష్ణులు ఇరువురు పరస్పర ప్రేమానురాగ బద్ధులైరి.

రుక్మిణి తల్లితండ్రులు రుక్మిణికి తగిన వరుడు కృష్ణుడే అని తలంచి యున్నారు. కాని రుక్మిణి అన్న యగు రుక్మి తన మిత్రుడైన శిశుపాలునికి రుక్మిణిని ఇచ్చి వివాహము చేయదలచినాడు. ఈ విషయము తెలిసి రుక్మిణి మిక్కిలి మనో వ్యధను పొందినది. పిమ్మట రుక్మిణి సమయ స్ఫూర్తితో తన హితమును తన మనో భావములను కృష్ణునికి తెలుపుటకై కృష్ణుని వద్దకు ఒక బ్రాహ్మణుని దూతగా పంపింది. ఆ బ్రాహ్మణునికి తన సందేశమును కృష్ణునికి విన్నవించమని చెప్పింది. ఆ బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుడు ద్వారకా నగరమునకు వెళ్ళి కృష్ణుని దర్శించి, ఏకాంతమున దేవా! నా పేరు అగ్నిద్యోతనుడు. విదర్భ రాజకుమారి అయిన రుక్మిణీదేవి పంపగా వచ్చిన దూతను అని రుక్మిణి సందేశమును కృష్ణునికి విన్నవించినాడు. ఆ సందేశము ఇట్లున్నది.

భువనసుందరా! నా మనవిని ఆలకింపుము. నీ దివ్యగుణములను, రూప సౌభాగ్యమును గూర్చి వినిన నా మనస్సు ఎట్టి సంకోచమును పొందక నీ యందే లగ్నమై యున్నది. పురుషోత్తమా! నేను నిన్ను పతిగా వరించి యున్నాను. దేవా! నా వివాహము ముందు రోజు నీవు ఇచటికి వచ్చి నన్ను భార్యగా స్వీకరింపుము. దేవా! సింహమునకు చెందిన వస్తువుకై గోమాయువు (నక్క) ఆశ పడునట్లుగా మహావీరుడవైన నీకు చెందవలసిన నన్ను మదాంధుడగు శిశుపాలుడు కోరుకొనుచున్నాడు. అతడు నా దరికి రాకముందే నీవు నన్ను కొనిపొమ్ము. వివాహమునకు ముందటి దినమున కులదేవతను పూజించుట మా వంశాచారము. అందువలన నేను నగరము వెలుపల ఉన్న గౌరీదేవి ఆలయమునకు నడచి వచ్చి గౌరీదేవిని పూజించెదను. ఆ సమయమున అదను చూచుకొని నీవు అచటికి వచ్చి నీ శౌర్యమును శుల్కముగా చెల్లించి రాక్షస వివాహ విధానమున వివాహమాడుటకై నన్ను తీసుకొని పొమ్ము. నేను నిన్ను వివాహమాడ లేకున్నచో కఠోరమగు వ్రత దీక్షను పూని శరీరమును శుష్కింప చేసి ప్రాణములను విడిచి పెట్టెదను. నేను నీ అనుగ్రహము తప్పక లభించుటకై పురాణ దంపతులు శివపార్వతులను ప్రార్థించు చుండెదను.

పోతన భాగవతములో రుక్మిణీ సందేశమును పూర్వభాగములో 1700–1708 పద్యములలో రస రామణీయకమైన శైలిలో రచించినాడు.

శ్రీయుత మూర్తి! యో పురుష సింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరు చందమున మత్తుడు చైద్యుడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడి దా గొని పోయెద నంచు నున్న వా
డా యధమాధముండెరుగ దద్భుతమైన భవత్ప్రతాపముల్

–సౌభాగ్యవంతుడా! పురుషసింహమా! సింహము యొక్క సొమ్మును నక్క కోరిన విధము గా మదించిన శిశుపాలుడు నీ పాదపద్మములను ధ్యానించుచున్న నన్ను కోరి తీసికొని పోయెదనంటున్నాడు. ఆ అధముడు అద్భుతమైన మీ బలపరాక్రమములు ఎరుగడు.

**అంకిలి సెప్ప లేదు చతురంగ బలంబుల తోడ నెల్లి యో**
**పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులున్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే**
**యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్.**

–కృష్ణా! నేను అడ్డము చెప్పలేదు. చతురంగ బలములతో రేపు వచ్చి నీవు శిశుపాల జరాసంధులను జయించి నా సమీపమునకు వచ్చి రాక్షస వివాహమున మీ శౌర్యమే శుల్కముగా చేసి (ఇచ్చి) పురుషోత్తముడా! నన్ను తీసికొని పొమ్ము మీ వెంట వచ్చెదను.

ఇట్లు రుక్మిణీ దేవి పంపిన సందేశమును బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుడు విన్నవించినాడు. పిమ్మట రుక్మిణి నీకు తగిన కన్య. ఆమెకు తగిన వరుడవు నీవు. ఉపాధ్యాయుల యాన మీకు పెండ్లి తప్పక యగును అని భవిష్యత్తు చెప్పినాడు. అంతట కృష్ణుడు అగ్నిద్యోతనుని చేతిని పట్టుకుని నవ్వుచు రుక్మిణిపై నాకును గాఢమైన తలంపు గలదు. నేను తప్పక వచ్చి రుక్మిణిని ఇక్కడకు తీసుకొని వచ్చెదను అని చెప్పి, రుక్మిణి యొక్క పెండ్లి నక్షత్రమును తెలుసుకున్నాడు.

వివాహమునకు ముందు దినము కాలి నడకన గౌరీదేవిని పూజించుటకు నగరము వెలుపలికి వచ్చి, పూజించి ఇంటికి మరలిపోవుచున్న అదనున రుక్మిణిని రథము నెక్కించుకొని ద్వారకకు తీసుకొని వచ్చి కడు వైభవముగా కృష్ణుడు రుక్మిణిని వివాహము చేసుకున్నాడు.

ఆనాటి నుండి గృహస్థులు తమ పుత్రికను గ్రామదేవత గౌరీదేవిని పూజించుటకు గ్రామము వెలుపలకి పంపక, తమ గృహములోనే పసుపు ముద్దతో గౌరీదేవిని చేసి పూజించుచున్నారు. రాక్షస వివాహము జరుగకుండా అడ్డుపడుచున్నారు.

కన్య మనసు నెరిగి వివాహ సమయమున కన్యను అపహరించుకొని వచ్చి చేసుకొనెడు వివాహము రాక్షసము అనబడుచున్నది. ఆర్యులు అంగీకరించిన అష్టవిధ వివాహములలో ఒకటి రాక్షసము. అష్టవిధ వివాహములు – బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము.


రుక్మిణీ దేవి ప్రణయ సందేశమును విని తన కర్తవ్యమును నెరవేర్చిన వాడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 376. లక్ష్మణోదార మానసాయ నమః

– లక్ష్మణకే లక్షణ అని నామాంతరం. అష్ట మహిషులలో లక్ష్మణ ఒకతె. ఎనిమిదవ మహిషి. ఈమె బృహత్సేనుడను మద్ర దేశపు రాజు కుమార్తె. కృష్ణుడు వీర శుల్కమైన మత్స్య యంత్రమును ఛేదించి లక్ష్మణను వివాహం చేసుకున్నాడు. కృష్ణుడు లక్ష్మణ యెడ ఉదారమైన మనస్సు చూపినవాడు. లక్ష్మణ వల్ల కృష్ణునికి పదిమంది పుత్రులు కల్గినారు.

లక్ష్మణ యొక్క ఉదార మనస్సు గలిగిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**






అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

# నవవిధ భక్తి మార్గాలు

– డా|| కూర్మాచలం
శంకరస్వామి

## శ్రవణభక్తి

శ్రవణం అనగా వినడం. దీనికి ఉపకరించే సాధనాలు చెవులు. ఇవి పంచ జ్ఞానేంద్రియాలలో ఒకటి. మనిషి శిశువు దశనుండే వినికిడి జ్ఞానము కలిగి ఉంటాడు. ఆ దశనుండే మంచి విషయములు విన్నట్లయితే మానవులు మంచివారు అవుతారు. అదే భక్తి కథలు విన్నట్లయితే భక్తాగ్రేసరులు అవుతారు. పరతత్త్వమైన శ్రీమన్నారాయణుడు స్వరూప లక్షణములందే గాక తన దివ్య లీలల యందు అత్యంత ఆకర్షణీయుడై ఉన్నాడు. పూర్ణుడైన అతడు తన నామము, యశస్సు, రూపము, లీలలు, పరివారాదుల యందు పూర్ణుడై యుండుటయే అందుకు కారణము. అటువంటి పూర్ణుడైన భగవానుడు తన నిర్హేతుక కరుణతో భౌతిక జగమునందు అవతరించి, జనులు తన పట్ల ఆకర్షితులై భగవద్ధామమునకు తిరిగి చేరుటకు యోగ్యులుగా మారే రీతిలో మానవ రూపమున తన దివ్యలీలా ప్రదర్శనమును గావించును. జనులు సాధారణముగా లౌకిక కర్మల నొనరించు పలువురు గొప్పవారి చరిత్రలను మరియు వర్ణనలను శ్రవణం చేయుట యందు ఆసక్తులై యుందురు. అటువంటి సాంగత్యముచే విలువైన కాలము వృథా యగుననియు మరియు దానివలన మనుజుడు త్రిగుణములచే మరింతగా ప్రభావితుడగుననియు తెలియకనే వారు అట్టి నైజమును కలిగి యుందురు. కాని ఆ విధముగా కాలమును వృథా చేయుటకు బదులు మానవుడు తన శ్రద్ధను భగవంతుని దివ్యలీలా శ్రవణము వైపునకు మళ్ళించినచో ఆధ్యాత్మిక జయమును పొందగలడు. అటువంటి భగవత్కథా శ్రవణము ద్వారా మానవుడు భగవానునితో ప్రత్యక్ష సంబంధము పొందగలడు. అంతేకాక పూర్వమే తెలుపబడినట్లు భగవానుని గూర్చిన శ్రవణము ద్వారా హృదయము నందు ప్రోగుబడిన పాపములన్నియు తొలగిపోవును. ఈ విధముగా సర్వపాపములన్నియు తొలగినంతనే శ్రోత క్రమముగా లౌకిక సాంగత్యము నుండి ముక్తుడై భగవంతుని రూపలక్షణముల యందు ఆకర్షితుడగును. నారదముని ఈ విషయమును తన ప్రత్యక్షానుభవము ద్వారా తెలియజేసి యున్నాడు. కేవలం భగవంతుని లీలలను శ్రవణం చేసినంత మాత్రాననే మానవుడు ఆయన సహచరులలో ఒకడు కాగలడు. ఆ రీతిగనే నారదముని నిత్య జీవనమును, అపరిమిత జ్ఞానమును, అనంతానందమును పొంది, భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులంతటను నిరంతరము సంచరించే సామర్థ్యమును పొందగలిగాడు. శ్రీ నారదుల వారు పూర్వజన్మమున భక్తి వేదాంతులైన శుద్ధ భక్తుల నుండి శ్రవణము



చేసిన రీతి, ప్రామాణికుల నుండి భగవానుని దివ్యలీలలను శ్రద్ధాసక్తులతో శ్రవణం చేయటం ద్వారా మానవుడు అత్యున్నత జీవన పూర్ణత్వమును సాధించగలడు. భక్తజన సాంగత్యము వలన శ్రవణము చేయుట యనెడి ఈ విధానము కలియుగము నందు ప్రత్యేకముగా నిర్దేశింపబడి యున్నదని భాగవతము వివరిస్తున్నది. ఈ శ్రవణ భక్తి ద్వారా విముక్తి పొందినవాడు పరీక్షిత్తు మహారాజు.

పరీక్షిత్తు ఒకనాడు ఘోరారణ్యంలో క్రూరమృగాలను వేటాడి, అలసి దప్పికతో అచ్చట గల శమీక మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ సమయంలో మహర్షి బాహ్యదృష్టి లేక అంతర్ముఖుడై యోగనిష్ఠలో ఉన్నాడు. రాజు తనకు దాహం దారుణంగా ఉందని ఎంతగా పిలిచినా పలకకుండా ఉండగా, రాజుకు కోపం వచ్చి సమీపాన చచ్చిపడి ఉన్న ఒక సర్పాన్ని అతని మెడకు చుట్టి వెళ్ళిపోయాడు. అప్పుడా ప్రక్కనే గల శమీక మహర్షి కుమారుడు శృంగి తండ్రికి జరిగిన అవమానానికి తట్టుకోలేక –

“ఒడక వింటి కోపున మృతోరగమున్ గొనివచ్చి మారు మా
టాడక యున్న మజ్జనకు నంసతల్పంబున బెట్టి దుర్మద

**క్రీడ జరించు రాజు హరకేశవులొడ్డి నాగాన జొచ్చు బో**
**యేడవనాడు తక్షక ఫణీంద్ర విషానలహేతి సంహతిన్"**

అని ముక్కోపియైన శృంగి శపించాడు. ఈ కలకలానికి శమీక మహర్షి బాహ్యదృష్టికి వచ్చి జరిగినదంతా తెలిసికొని ఎంతగానో విచారించాడు. కొడుకుపై కోపించి మూర్ఖుడా! కామాది అరిషడ్వర్గాలను అరికట్టలేని నీ తపస్సేల? వేట తాపంతో మహారాజు ఏదో పొరపాటు చేస్తే ధర్మమార్గాన ప్రజలను పాలించు ఆ రాజచంద్రుడు చనిపోవునట్లు శపిస్తావా? క్షమాగుణము లేని నీ తపస్సేల? కాల్చనా? జరిగిన విషయం ఆ మహారాజుకు వెంటనే తెలియజెయ్యి. నీవు కిరాతకుడవు అని మహర్షి శృంగిని ఎంతగానో తిట్టాడు.

ఈ విషయాన్ని తెలిసికొని పరీక్షిన్మహారాజు ఎంతగానో పరితపించాడు. తన వలన జరిగిన పొరపాటుకు ఎంతగానో చింతించాడు. ఇక తనకు మరణం తప్పదని సర్వభోగాలను విడిచి ఇక శ్రీహరి మాత్రము తనకు దిక్కని మహర్షులందరినీ శిష్య ప్రశిష్యులతో రావించాడు. వారినందరినీ పూజించి "మహాత్ములారా నేను చేసిన తప్పుకు తగిన శిక్ష భగవానుడు వేశాడు. ఈ ఏడు రోజులు శ్రీహరి నామాన్ని కీర్తించి నన్ను ధన్యుడిగా చేయండి" అని వారినందరినీ ఎంతగానో అర్థించాడు. తాను చేసిన పూర్వకర్మ వలన సంప్రాప్తించిన ఈ శాపాన్ని పోగొట్టుకోవాలని, రంగదుత్తుంగ తరంగాలు గల గంగానదిలో స్నానమాచరించి, నది ఒడ్డున దక్షిణంలో తూర్పుగా దర్భాసనము పెట్టి ఉత్తరాభిముఖంగా కూర్చుని హరికి గుండెల్లో గూడు కట్టి దానిలో శ్రీహరిని నింపుకున్నాడు. పరీక్షిన్మహారాజు. మహర్షులు హరినామ కీర్తనను గావిస్తున్నారు. దేవతలు అతనిపై పుష్పవర్షం కురిపిస్తున్నారు. అదే సమయానికి వ్యాసమహర్షి కుమారుడైన శుకమహర్షి ఆ మార్గం గుండా వెళుచున్నాడు. అప్పుడు అచ్చట గల మహర్షులందరూ అతనికి ఎదురేగి తోడ్కొని వచ్చి ఉచితాసనముపై కూర్చుండబెట్టి అర్ఘ్య పాద్యాలిచ్చి పూజించారు. అప్పుడు పరీక్షిత్తు అతనికి చేతులు జోడించి "మహాత్మా! ఆవుకు పాలు పిండినంతకాలం ఒకచోట ఉండని మీరు నా పూర్వజన్మ పుణ్యం వలన నాకు మీ దర్శన భాగ్యం కలిగింది అని జరిగిన విషయాన్ని తెలిపి "స్వామీ! నాకు ముక్తి మార్గాన్ని ప్రసాదించండి" అని శుకమహర్షిని వేడుకున్నాడు పరీక్షిత్తు.

అప్పుడు శుకమహర్షి అత్యంత దయార్ద్ర హృదయంతో ఇలా చెప్పనారంభించాడు. మహారాజా! అన్ని జన్మల్లో మానవ జన్మ ఉత్తమం. ఈ జన్మలోనే శ్రీహరి గానామృతాన్ని సేవించాలి. నా పితృదేవుడైన వేదవ్యాసమహర్షి నాపై గల పరమానుగ్రహంతో మహాభాగవతాన్ని నాకు వినిపించాడు. మహాభాగవత శ్రవణం అత్యంత పవిత్రమైనది. శ్రేయోదాయకమైనది. కావున నీకు వివరిస్తాను. "శ్రవణం" మానవుని సర్వబంధాలను త్రుంచివేస్తుంది. నీకు అట్టి శ్రీహరి కథలను వినిపిస్తాను. నీకు ఏడు దినాలు గడువు ఉంది. పూర్వం ఖట్వాంగుడనే మహారాజు దేవతల తరపున రాక్షసులందరినీ సంహరించాడు. అతని ధైర్య, వీర్య, విక్రమ సాహసాలకు మెచ్చుకున్న దేవతలు నీకేమి కావాలో కోరుకోమన్నారు. అప్పుడా మహారాజు ఓ దివ్యులారా! నాకు ఇంకా ఎంత వయస్సుంది? అని అడగగా రెండు ఘడియలే అన్నారు. అప్పుడా రాజు వెంటనే తన రాజధానికి వెళ్ళి సర్వసంపదలను, భార్యా బిడ్డలను త్యజించి శ్రీహరి కథలను శ్రవణం చేసి శ్రీహరి సంకీర్తనా పరుడై ముక్తి పొందాడు.

**"గోవింద నామ కీర్తన**
**గావించి భయంబుదక్కి ఖట్వాంగధరి**
**త్రీవిభుడు సూతగొనియెను**
**గైవల్యము దొల్లి రెండు గడియలలోనన్"**

కావున ఓ పరీక్షిన్మహారాజా! నీకు ఏడు ఘడియల సమయమున్నది. నీవు కూడా ఖట్వాంగుని వలె తరించవచ్చును. కనుక శ్రీహరి కథలను శ్రద్ధగా వినుము.

ఓ మహారాజా! ఈ విశ్వమంతయు శ్రీహరిమయమే. అతడు అంతటా వ్యాపించి యున్నాడు. శ్రీహరి లేని వస్తువు లేదు. జీవుడు కలలో అనేకమైన రూపాలలో ఇంద్రియముల ద్వారా ప్రవర్తించి అనుభవములను పొంది మళ్ళీ తన జాగ్రతావస్థలను పొంది పిదప కలలోని అనుభవాలకు కేవలం సాక్షిగా మిగిలిపోయినట్లు అఖిల జీవరాశుల అంతరాత్మలయిన పరమేశ్వరుడు ఆ జీవరాశుల యొక్క బుద్ధి వృత్తులకు సాక్షియై ఉండును.

కనుక ఓ వంశపావనా! నీవు కూడా సర్వబంధాలను త్రెంచుకుని ఆ శ్రీమన్నారాయణునిపై మనసు నిల్పిన మోక్షం వెంటనే సంప్రాప్తిస్తుంది. ధారతో కొందరు, దాని యోగమార్గంతో వెళ్ళి తప్పకుండా ముక్తులవుతారు. ముందుగా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను క్రమబద్ధం చేసి శ్రీహరి యందే బుద్ధిని నిలుపుకొని విరాట్స్వరూపుడాతడే యని నమ్మిన వారికి తొందరగా మోక్షం వస్తుంది.

ఓ రాజా! ఈ శరీరం ఎప్పుడూ ఉన్నదే. భూమి, వెలుగు, నీరు, గాలి, ఆకాశం, అహంకారం, మహత్తత్వం అనే సప్తావరణాలతో ఈ శరీరం నిండి ఉంటుంది. ఈ ఏడింటిని గెలిచిన బ్రహ్మాండం ఛేదించటం జరుగుతుంది. శ్రీహరి పాద పద్మాధీన మనస్సు గలవాడైన సాత్వికాహంకారంతో ప్రకృతిని బాసి ఆనందముతో వాసుదేవునే సర్వదా ధ్యానించాలి అన్న శుకమహర్షి మాటలు విని మహదానందముతో పరీక్షిత్తు –

**"సుతుల హితుల విడిచి, చుట్టాల విడిచి, యి**
**ల్లాలి విడిచి, బహుబలాళి విడిచి**
**రాజు హృదయ మిడియె రాజీవ నయనుపై**
**ధనము విడిచి జిడ్డు ధనము విడిచి"**

ఇలా పరీక్షిన్మహారాజు కేవలం ముక్తినే వాంఛింప సాగినాడు. మహారాజా!

**"హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుందు సంశయము పనిలేదా**
**హరిమయము గాని ధర్మద్రవ్యము**
**పరమాణువు లేదు వంశ పావన వింటే"**

శ్రీమన్నారాయణుడు సర్వాంతర్యామి. అందరిలో ఉన్నా భౌతిక మాయలు అతనికి అంటవు. బ్రహ్మను సృష్టించిన బ్రహ్మాండరాశీభూతము శ్రీహరియే. సుఖాలన్నిటినీ మరొకటినీ మానవుడు అజ్ఞానం వలన బ్రహ్మతత్వాన్ని తెలుసుకోలేకపోతున్నాడు. అంతేకాదు, అనేక ఇబ్బందులకు గురియై ఇవన్నీ నాకు దేవుడు కల్పించాడు అనుకుంటాడే గాని, నా అజ్ఞానం వల్ల ఇవన్నీ వచ్చాయని అనుకోడు.

మహారాజా! పవిత్రములైన రెండు చేతులను మనకు ఆ భగవంతుడు ఇచ్చాడు. మానవుడికి తినడానికి బంగారు కంచాలేల? కట్టుకోవడానికి చీనీ చీనాంబరాలేల? ఆకాశమంత పొడవు ఎదిగి గుబురులుగా మహావృక్షాలు మహారణ్యాలలో బ్రతకడం లేదా? రెండు కాళ్ళ పశువులాగా ప్రవర్తిల్లిన మానవుని జీవితమెందుకు? శ్రీనారాయణుని పూజించని నరుని జీవితం వృథాయే కదా? అధికార ధన మదాంధకారంతో మానవుడు ఎందుకున్నట్లు? అనేక రుచులతో ఫలవృక్షాలు ఎన్నో ఫలాలను మానవునికి సమర్పిస్తున్నాయి. క్షమాగుణం గల, పవిత్రత గల భూమి పడుకోవడానికి పనికిరాదా? హంసతూలికా తల్పాలేల? పవిత్రనదీ జలాలుండగా త్రాగడానికి ఇంకేమి కావాలి? పవిత్రులైన, శీలవతులైన భార్యలుండగా ఇతరులపై కోరికలేల? అనునిత్యం నరుడు భక్తితో పూజించిన నరుడే నారాయణుడౌతాడు. అతన్ని విడిచి శాశ్వతానందాన్ని పొందలేము. క్షణికమైన ఇంద్రియ సుఖాలకు మరిగి మానవుడు రెండింటికీ చెడ్డ రేవడి అవుతున్నాడు.

మహారాజా! జాగ్రత్తగా విను. రక్షకులు లేరని అఘోరించే నరుడు సర్వాన్ని రక్షించే నారాయణుడున్నాడని ఎందరు చెప్పినా వినడేల? ఆత్మను పరమాత్మగా తెలిసిన వారెవ్వరూ నారాయణుని వీడరు. వారికి ముక్తి కరతలామలకం. నీచమైన ప్రాపంచిక విషయాసక్తులై శ్రీమన్నారాయణుని శరణు వేడని వారు రౌరవాది నరక కూపాల్లో మునిగి తేలుతుంటారు. జ్ఞానులై, ప్రజ్ఞానులై నిరంతరం తమ హృదయాలలో శ్రీహరి ధ్యాన పరవశులైనవారు చల్లని చంద్రకిరణ స్పర్శచే శరీరాలు చల్లబడగా సర్వావస్థల్లో ఆ పరమాత్మ ఏది సమకూరిస్తే దానితో ఆనంద సామ్రాజ్యాభిషిక్తులౌతారు. అంతేకాని వేరే యోగులకు, భోగులకు, రోగులకు ఇలాంటి సువర్ణావకాశము లేదు. శ్రీహరి ధ్యానపరులు, వారి శరీరాన్ని ఏ సమయాన విడిచిపెట్టాలన్నా ప్రాణవాయువును మనస్సుతో బంధించి, జీవునిలో దానిని చేర్చి, ఆత్మలోనికి దానిని తీసుకువచ్చి, పరబ్రహ్మలో దానిని లీనం చేసి దేహాన్ని తక్షణం విడవగలుగుతారు. ఇక వీరిలో పంచభూత తత్త్వాలకు లొంగుట, ఇతర విషయాలపై మక్కువ చూపుట జరగదు. అటువంటివారే పరమానంద మయుడైన శ్రీహరిలో ఐక్యమవుతారు. ఈ సన్మార్గం పరమ భాగవతోత్తముల దివ్యమార్గం. ఇంద్రియాలకు వశం కాకుండా ఉన్నవారే చనిపోయిన తరువాత పై మార్గం ద్వారా ఈ వాసనలతో పరమేశ్వరుని లోకానికి భద్రముగా చేరుకుంటారు. ఇలా ఆ శ్రీహరి యొక్క దివ్య లీలలను శుకమహర్షి చెప్పగా అప్పుడా రాజు ఇలా ప్రార్థించాడు. మహర్షివర్యా! తమరి వేదవాక్యములు విని నాలో గల విషయములన్నీ తొలగిపోయాయి. శ్రీహరి యొక్క పరమ పావన చరిత్రనంతా వినాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. కృపతో ఇంకా చెప్పండి అనగా శుకమహర్షి ఇలా వినిపించసాగాడు.

**"ఏ విభు వందనార్చముల్ లేవిభుచింతయు, నామకీర్తనం**
**బే విభు లీలద్భుతము లెవ్వడు సంశ్రవణంబు సేయు దో**
**షావళి బాసి లోకాల శుభాయుత వృత్తి జలగి నంద్రు నే**
**నా విభు నాశ్రయించెద నక్షౌఘుని వర్తనమును, భద్రకీర్తనున్"**

అని పరీక్షిన్నరేంద్రుడు కోరగా శుకమహర్షి అత్యంత నిష్ఠతో ఏడు పగళ్ళు, ఏడు రాత్రులు భాగవత సప్తాహం చేసి శ్రీహరి యొక్క దివ్యలీలలను, దశావతార వైభవం తెలుపగా దానిని శ్రద్ధగా విన్న పరీక్షిత్తు ఏడవనాడు చివరి ఘడియలో తక్షకుని కాటుకు గురయి మరణించి ముక్తిని పొందాడు.

ఈ శ్రవణ భక్తి వలననే బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు నారాయణునికి దగ్గర అయినట్లు వారే స్వయంగా భాగవత రచనకు ముందు వ్యాసమహర్షి చెప్పిన సంఘటన ద్వారా తెలుస్తుంది. నారదుడు పూర్వజన్మలో దాసీ పుత్రుడు. ఆమె ఒక బ్రాహ్మణుల ఇంటిలో దాసిగా పని చేసేది. ఆ ఇంట్లో నిరంతరం శ్రీమన్నారాయణుని దివ్యకథలు, పాటలు పాడుకునేవారు. బాల్యం నుండే నారదుడు వాటిని వినడం వలన భక్తిభావం ఏర్పడి నారాయణుని పొందగలిగాడు.

కథలు వినడం మానవులకే కాదు, అవతారపురుషుడైన ఆ శ్రీమన్నారాయణునికి కూడా ఎంతో ఇష్టం. బాల రామునికి కౌసల్యాదేవి కథలంటే ఎంతో ఇష్టం. బాల కృష్ణునికి తల్లి యశోదాదేవి కథలు చెబితే కాని నిద్రపోయేవాడు కాదు. ఒకనాడు యశోదమ్మ రాముని కథ చెబుతూ రావణుడు సీతను అపహరించాడు అని చెప్పగానే బాలకృష్ణుడు దిగ్గున లేచి లక్ష్మణా ధనుస్సు అందుకో అని గట్టిగా అరిచాడు. అంతట యశోదమ్మ ఉలిక్కిపడిపోయింది. పూర్వజన్మల వాసనల వల్ల ఇలా జరిగింది. ఎందరో భక్తులు శ్రవణం ద్వారా ముక్తిని పొందారు. ★

# భ్రమరాంబికా మాహాత్మ్యము

– చిల్లర సీతారామారావు



శ్లో ॥ "శ్రీకంఠార్పిత పత్రగండ యుగళాం సింహాసనా ధ్యాసినీం
లోకానుగ్రహ కారిణీం గుణవతీం లోలేక్షణాం శాంకరీం
పాకారి ప్రముఖా మదార్చిత పదాం మత్తేభ కుంభస్తనీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనశ్శ్రీ శారదా సేవితామ్"

ఓ మనస్సా! శివదేవుడు అర్పించిన మకరాది పత్రములచే ప్రకాశించు చెక్కిళ్ళ జంట కలది, సింగపు గద్దెపై కూర్చుండునది, సర్వసుగుణ సంపద గలది, భక్తుల యెడ దయ చూపునది, చలించెడు చూపులు కలది, ఇంద్రాది దేవ ప్రముఖులచే నర్చించబడు పాదపద్మములు కలది, మదగజ కుంభముల వంటి పాలిండ్లు గలది, లక్ష్మీ సరస్వతులచే సేవింపబడునది యగు శ్రీశైల భ్రమరాంబికను సేవించుకుందాం.

దేవతలను రాక్షసులు పీడించినప్పుడల్లా దేవజాతిని సంరక్షించడానికి జగన్మాత దుర్గాదేవి భిన్న భిన్న రూపాలలో అవతరించింది. ఆ అవతారములలో విశేషమైన అవతారమే భ్రమరాంబికా అవతారము. భ్రమరాంబికా దేవికే భ్రామరీ దేవి యను పర్యాయ పదము.

పూర్వము అరుణాసురుడు అను దానవుడు ఉండేవాడు. అతనిది మిక్కిలి క్రూర స్వభావము. అతనికి దేవతలంటే అమితమైన ద్వేషం. వారిని ఎలాగైనా పరాజితులను గావించి అమరపురినుండి వెళ్ళగొట్టవలెనని అతని ఆలోచన. తన ఆలోచనలకు కార్యరూపము ఇవ్వగలిగిన వాడు బ్రహ్మ ఒక్కడే అని భావించి అతడిని గురించి తపము చేయడం మొదలుపెట్టాడు. అతని తపమునకు లోకములన్నీ తల్లడిల్లసాగాయి. దేవతలు అరుణుడి తపము వలన చెలరేగిన మంటలను చూచి భయభ్రాంతులకు లోనయ్యారు. తమను రక్షించమని బ్రహ్మను వేడుకున్నారు. దేవతల రక్షణార్థము బ్రహ్మ అరుణుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. వరమును కోరుకొమ్మని అడిగాడు. తనకు మరణము అనునది లేకుండా వరమును ప్రసాదించమని కోరుకున్నాడు అరుణుడు. అరుణుడి కోరికను విన్న బ్రహ్మ అతడితో –

శ్లో ॥ "బ్రహ్మ విష్ణు మహేశాద్యా మృత్యునాక వలీకృతాః
తదాన్యేషాం తుకావార్తా మరణే దానవోత్తమా
వరం యోగ్యం తతో బ్రహి దాతుం యశక్యతేమయా
నాత్రా గ్రహం ప్రకుర్వంతి బుద్ధిమంతో జనాః క్వచిత్"

దానవ శ్రేష్ఠా! ఎవరైనా వారి వారి కర్మలు, ఆయుర్దాయమును బట్టి మరణించవలసినవారే. అందువలన ప్రకృతికి విరుద్ధమైన వరమును ఇవ్వజాలను. యోగ్యమైన మరొక వరమును కోరుకొనుము అని పలికాడు. బ్రహ్మ పలుకులను ఆలకించిన అరుణుడు కొద్దిసేపు ఆలోచించి తుదకు – యుద్ధమునందు గాని, అస్త్ర శస్త్రాదుల వలన గాని, స్త్రీ వలన గాని, పురుషుడి వలన గాని, రెండు కాళ్ళు, నాలుగు కాళ్ళు గల ప్రాణుల వలన గాని, ఉభయాకారములు కలిగిన ప్రాణుల వలన గాని నాకు మరణం కలగకుండా వరమును ఇవ్వండి అని ప్రార్థించాడు. తథాస్తు అని పలికి అదృశ్యమయ్యాడు బ్రహ్మ.

బ్రహ్మదేవుడి ద్వారా వరమును పొందిన అరుణుడు పాతాళ లోకమునకు వచ్చాడు. పాతాళ లోక వాసులు అతడి వరమును విని అరుణుడిని ప్రశంసించారు. తమ రాజుగా అభిషేకించారు. రాజు కాగానే అరుణుడు ఇంద్రుడికి వర్తమానమును పంపించాడు. రాజ్యమును అప్పగించమని అరుణుడి వర్తమానము. దానిని వినిన ఇంద్రుడు భయపడి బ్రహ్మను తనను రక్షింపమని ప్రార్థించాడు. తాను అశక్తుడనని పలికిన బ్రహ్మ వారిని తీసుకొని శంకరుడి దగ్గరకు వెళ్ళాడు. అరుణుడి వరమును గురించి తెలుసుకొనిన శంకరుడు దేవతలను ఎలా కాపాడాలాయని ఆలోచిస్తున్న తరుణములో ఆకాశవాణి వినిపించింది.

శ్లో ॥ ఏతస్మిన్నమయే తత్రవాగభూద శరీరిణీ
భజద్వం భువనేశానీం సావ కార్యమ్ విధాస్యతీ
గాయత్రీ జప సంసక్తో దైత్యరాగం యది తాంత్యజేత్
మృత్యుయోగ్యస్తథా భూయాదిత్సు చ్చైస్తోషకారిణీ"

దేవతలారా! అరుణుడు గాయత్రీ మంత్ర జప ప్రభావము చేత

చెలరేగిపోతున్నాడు. అతని అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలంటే ఒకే ఒక మార్గమున్నది. అతని చేత గాయత్రీ జపమును మాన్పించాలి. అతడు గాయత్రీ జపమును మానిన వెంటనే అతని పతనము మొదలవుతుంది. మరణం కూడా సంభవిస్తుంది.

ఆకాశవాణి పలుకులను ఆలకించిన దేవతలు సుదీర్ఘముగా ఆలోచించారు. బృహస్పతి యొక్కడే అరుణుడి జపమును మాన్పింపగల సమర్థుడని భావించి ఆయనకు ఆ బాధ్యతను అప్పగించారు. దేవతల అభీష్టానుసారం బృహస్పతి పాతాళ లోకమునకు వెళ్ళాడు. అక్కడ దానవులంతా దేవీయజ్ఞ పరాయణులై గాయత్రీ మంత్రమును జపిస్తూ తపము చేసుకుంటూ కనిపించారు. బృహస్పతి దానవరాజు అరుణుడిని దర్శించుకున్నాడు. బృహస్పతిని చూచి అరుణుడు – మునిసత్తమా! మీరు నా దగ్గరకు ఎందుకు వచ్చారు? నేను మీ స్నేహితుడను గానే? అందునా మీరు నా శత్రువర్గమునకు చెందినవారు. నాతో ఏమి పని యుండి మీరు నా దగ్గరకు వచ్చారు? అన్నీ సవివరంగా తెలియజేయండి అని పలికాడు. బృహస్పతి సమాధానమిస్తూ – దానవరాజా! మా ఆరాధ్య దేవత గాయత్రిని నీవు కూడా ఆరాధిస్తున్నావు కదా! అందువలన నీవు మాకు మిత్రుడవు. మిత్రుడిని దర్శించుకోవటానికి కారణము అవసరము లేదు కదా. కనుక నేను శత్రుపక్షము వాడను కాను. మర్యాదపూర్వకముగానే నేను నిన్ను కలవడానికి వచ్చాను అని పలికాడు. అహంకారి అయిన అరుణుడు ముని మాటలలోని అంతరార్థమును గ్రహించలేదు. ఆయనతో ఇలా అన్నాడు. నన్ను మిత్రుడుగా భావించి నా దగ్గరకు రావడానికి కారణం గాయత్రీ మంత్ర ధ్యానమే కదా! నేటినుండి ఆ గాయత్రీ మంత్ర జపమును త్యజిస్తున్నాను. కనుక మీరు నా శత్రు పక్షమునకు చెందినవారు అవుతారు కనుక మీరు వెళ్ళవచ్చు. అరుణుడి ఆజ్ఞానుసారము బృహస్పతి తిరిగి అమరపురికి వచ్చి దేవతలకు జరిగిన విషయం తెలియజేశాడు.

దేవతలు తమ కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించసాగారు. జగన్మాత వారి ప్రార్థనలకు ప్రసన్నురాలై ప్రత్యక్షమైంది. దేవతలారా! మీ భక్తికి సంతోషించాను. ఏమి వరము కావలెనో కోరుకొమ్మని అడిగింది. దేవతలు తమ ఎదుట ప్రత్యక్షమైన జగన్మాతను గాంచి భక్తి ప్రపత్తులతో స్తుతించసాగారు.

శ్లో ॥ భ్రమర్వేష్టితా యస్మాద్ భ్రామరీ యాతతః స్మృతా
తస్యై దేవ్యై నమో నిత్యం నిత్యమేవ నమో నమః

నిత్యం భ్రమరాల చేత పరివేష్టితయై భ్రామరీదేవి, భ్రమరాంబికాదేవిగా పిలువబడుతున్న భగవతీ! నీకు అనేక నమస్కారములు. తల్లీ! అరుణుడు అను రాక్షసుడు బ్రహ్మ ద్వారా వరములు పొంది, ఆ గర్వ ప్రభావముతో మమ్ములను అనేక విధములుగా హింసిస్తున్నాడు. యజ్ఞ యాగాదులకు ఆటంకములు కల్పిస్తున్నాడు. తపములకు విఘ్నములు కలిగిస్తున్నాడు. అతని బారినుండి మమ్ములను కాపాడుము తల్లీ! అని వేడుకున్నాడు. దేవతల దీనగాథ విన్న జగన్మాత వారిని రక్షించాలని సంకల్పించుకున్నది.

జగన్మాత తన పిడికిట యందున్న భ్రమరాలను, తనను పరివేష్టించి యున్న భ్రమరాలను రాక్షస రాజ్యము వైపు పంపింది. అసంఖ్యాకములైన భ్రమరాలను సృష్టించి వాటిని కూడా రాక్షస రాజ్యము వైపు మరలించింది. భ్రమరములు ముల్లోకములందు వ్యాపించి అంతరిక్షమును కప్పివేశాయి. దానితో పృథ్వి గాఢాంధకారమయింది. పర్వత శిఖరాగ్రాలు, అడవులు, వృక్షములు సర్వత్రా భ్రమరములే దర్శనమివ్వసాగాయి. భ్రమరములను చూచిన ప్రజలు ఆశ్చర్యమునకు లోనయ్యారు. భ్రమరాలు ఒక్కసారిగా రాక్షసరాజ్యం మీద దాడి చేశాయి. రాక్షస వక్షస్థలములను చీల్చసాగాయి. భ్రమరాల దాడిని ఎదుర్కొనలేక దానవులు మరణించసాగారు. భ్రమరాలు రాక్షసులకు నోరు తెరవడానికి గాని, సహచరులకు సందేశము పంపించడానికి కాని అవకాశమును ఇవ్వకుండా వారిని చంపేశాయి. అరుణుడు ఒక తప్పు చేశాడు. బ్రహ్మను వరమును అడిగేటప్పుడు ఆరు పాదములు కలిగిన భ్రమరముల నుండి మరణము సంభవించకుండా ఉండాలని కోరుకుని ఉంటే భ్రమరములు అతడి జోలికి వచ్చేవి కావు. భ్రమరములు అరుణుడి మీద దాడి చేసి అతడిని వధించాయి. మహాబలవంతుడు, బ్రహ్మవరప్రసాది, అతి క్రూరుడు అయిన అరుణుడు మరణించడం, అతని దానవ సైన్యం సమస్తం సమసిపోవడం అంతా జగన్మాత వల్లనే జరిగిందని, దేవతలు ఆమెను భక్తి ప్రపత్తులతో స్తుతించారు. అరుణుడి మృత్యువుతో ఆనందలహరిలో మునకలు వేస్తున్న దేవతలు పలు రకములైన ఉపచారములచేత భ్రామరీదేవిని పూజించారు. భ్రామరీదేవి మీద పుష్పవర్షం కురిపించారు. జయ జయ ధ్వానాలు చేశారు. దేవతల భక్తికి ప్రసన్నురాలైన జగన్మాత వారికి వరములను ప్రసాదించి అంతర్ధానమయింది.

మనోభీష్టాలను నెరవేర్చు తల్లి, భ్రమరాంబికను స్మరించుకుంటూ పూజించుదాం. ఆ మాత దీవెనలతో శుభప్రదమైన, ఆనందమయమైన జీవితమును గడుపుదాం.

శ్లో ॥ "చంచత్కాంచన రత్నచారు కటకాం సర్వంసహా వల్లభాం
కాంచీ కాంచన ఘంటికా ఘణఘణాం కంజాత పత్రేక్షణాం
ఆర్తత్రాణ పరాయణాం పురహర ప్రాణేశ్వరీం శాంభవీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్"

అని భ్రమరాంబికను నిత్యం స్మరించుకుంటూ, ఆ దేవి అనుగ్రహం వల్ల సమస్త సుఖ సౌఖ్యాలను పొందుతూ జీవితమును సార్థకము గావించుకుందాం.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 36 వ శ్లోకం

**శ్రీనాథ నారాయణ వాసుదేవ**
**శ్రీకృష్ణ భక్తప్రియ చక్రపాణే**
**శ్రీపద్మనాభాచ్యుత కైటభారే**
**శ్రీరామ పద్మాక్ష హరే మురారే**

"శ్రీనాథ! నారాయణ! వాసుదేవ! శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణే! శ్రీపద్మనాభాచ్యుత! కైటభారే! శ్రీరామ! పద్మాక్ష! హరే! మురారే ॥". ఈ శ్లోకంలో, శ్రీ కృష్ణుని వివిధ పేర్లతో, ఆయన భక్తుల పట్ల గల ప్రేమను కొనియాడుతూ, ఆయన్ను స్తుతిస్తూ ఉంటుంది.

**శ్లోకంలో ఉపయోగించిన పేర్లు మరియు వాటి అర్థాలు:**

శ్రీనాథ = లక్ష్మీదేవికి భర్త, శ్రీమహావిష్ణువు; నారాయణ = నీటిలో నివసించేవాడు, శ్రీమహావిష్ణువు; వాసుదేవ = వసుదేవుని కుమారుడు, కృష్ణుడు; శ్రీకృష్ణ = నల్లని వాడు, కృష్ణుడు; భక్తప్రియ = భక్తులకు ఇష్టుడైన వాడు ; చక్రపాణే = చక్రమును ధరించిన వాడు, శ్రీమహావిష్ణువు ; శ్రీపద్మనాభ = పద్మము నుండి పుట్టిన నాభి కలవాడు, శ్రీమహావిష్ణువు; అచ్యుత = ఎన్నడూ క్షీణించని వాడు, శ్రీమహావిష్ణువు; కైటభారే = కైటభుడనే రాక్షసుని సంహరించిన వాడు, శ్రీమహావిష్ణువు; శ్రీరామ = శ్రీమహావిష్ణువు దశావతారాలలో ఒక అవతారం; పద్మాక్ష = పద్మముల వంటి కన్నులు కలవాడు, శ్రీమహావిష్ణువు; హరే = విష్ణువు యొక్క ఒక నామము; మురారే = ముర అనే రాక్షసుని సంహరించిన వాడు, కృష్ణుడు.

శ్రీనాథా ! నారాయణా ! వాసుదేవా ! శ్రీకృష్ణా ! భక్తప్రియా ! చేతియందు చక్రాయుధమును ధరించినవాడా! పద్మనాభా ! అచ్యుతా ! కైటభారీ ! శ్రీరామా ! పద్మనేత్రా ! హరీ ! మురారీ! అని పలుకగలిగిన మనుజుడు కూడా పలుకుట లేదు. అయ్యో! ఈ వ్యాసాన లంపటత్వమెంతటిది!

ఈ శ్లోకం ద్వారా, భక్తులు తమ ఇష్ట దైవమైన కృష్ణుని అనేక విధాలుగా స్తుతించి, ఆయన అనుగ్రహాన్ని పొందుతారు. అంత గొప్ప అనుగ్రహాన్ని పొందిన వారిలో ఒకరు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

**"తిరవై శ్రీ యలమేలుమంగ యురమందే నిల్చి దీపింపగా పరమైశ్వర్య ధురం ధరండగుచు నాపాలన్ కృపన్ నిల్చి సుందర దివ్యాకృతి నప్పటప్పటికి మోదం బొప్పగా జూపి, మ ద్వరదుండై తగు వేంకటాచలపతిన్ వర్ణింతు నశ్రాంతమున్"**

(శ్రీ వేంకటాచల మాహాత్మ్యం 1-15)

సహజంగా కవులు తమ కావ్యాదిలో ఇష్టదేవతలను స్తుతిస్తారు. వెంగమాంబ ఈ కావ్యంలో తన ఇష్ట దైవమైన శ్రీ వేంకటాచలపతిని వర్ణిస్తానని చెప్పడం విశిష్టం! - తిరుమలను ఏడుకొండలుగా, శ్రీ వేంకటేశ్వరుడు ఏడుకొండల స్వామిగా భక్తజనం కొనియాడుతూ ఉంది. వెంగమాంబ వేంకటాద్రిని పదునెనిమిది పేర్లతో సమ్మానించింది. ప్రతి పేరు ఎందుకు కలిగిందో అర్థవంతంగా, సమర్థవంతంగా వివరించింది. శేషాద్రి, క్రీడాద్రి, వేంకటాద్రి అనే పేర్లు ఈ గిరికి ఎందుకు కలిగాయో వివరించుమని శౌనకాది మునులు సూతుని అభ్యర్థించారు.

సూతుడు ఈ గిరికి ఉన్న 18 పేర్లు వివరిస్తాడు -

భక్తుల చింత తీర్చి వారి కోరిక లీడేర్చుతూ ఉండటం వల్ల "చింతామణి"గా, మానవాళికి మహిత జ్ఞానం వృద్ధి చేస్తున్నందువల్ల "జ్ఞానాద్రి"గా, తీర్థజనులకు ముక్తి దాయకాలైన సమర్థ తీర్థములుండటంవల్ల "తీర్థాచలం"గా, తపోధనుల అవసరాలకై పుష్కలంగా పుష్కరిణులు ఉండటం వల్ల "పుష్కర శైలం"గా, వృషభాసురుడు తపస్సు చేసినందువల్ల "వృషభాద్రి"గా, దేవతలకే స్వర్ణప్రభా భాసురమై కనిపిస్తూ ఉండటం వల్ల "కనకాచలం"గా, నారాయణుడనే విప్రుడు తపస్సు చేసిన చోటు కాబట్టి "నారాయణాద్రి"గా, వైకుంఠం నుంచి గరుడుడు తెచ్చి దించినందువల్ల "శ్రీ వైకుంఠాద్రి"గా,

నారసింహుడై ప్రహ్లాదుని కాపాడిన భద్రస్థలం కావున "నరసింహగిరి"గా, అంజనాదేవి తపముండి ఆంజనేయుని ప్రసవించిన పవిత్రస్థలము కాబట్టి "అంజనాద్రి"గా, వరాహస్వామి కొలువైనందువల్ల "వరాహగిరి"గా, నీలుడనే వానరవరుడు తపసు చేసి ముక్తి పొందినందువల్ల "నీలాద్రి"గా, శ్రీ మహాలక్ష్మికి నెలవు కావున "శ్రీగిరి"గా, శ్రీసతి మహావిష్ణువు వైభవాన్ని ఉల్లాసంగా ఆస్వాదించిన స్థలం కావున "శ్రీ సతిగిరి"గా, శ్రీ రమ తన సఖీమణులతో కలిసి క్రీడించిన వనం కాబట్టి "క్రీడాచలం"గా వైకుంఠమునందలి క్రీడాద్రిని గరుడుడు తెచ్చినందువల్ల "గరుడాద్రి"గా, శేషాకృతితో స్వామి విశేష వైభవాలకు నిలయ మైనందువల్ల "శేషాచలం"గా, 'వ'కారం అమృతబీజం; క,ట, శబ్దాలు సంపత్కరములు; ఈ మూడక్షరాలు కలిసి అక్షయమైన అమృత సంపదలు అందిస్తాయి కాబట్టి "వేంకటాచలం"గా (1.104-122) నామ వివరణ చేసింది వెంగమాంబ.

భక్తికి ప్రతిరూపంగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అంటరానితనం నిర్మూలన కర్తగా మెట్ట ప్రాంత ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న తరిగొండ వెంగమాంబ 18 వ శతాబ్దానికి చెందిన తెలుగు కవయిత్రి, తిరుమల వేంకటేశ్వర స్వామి భక్తురాలు. వేంకటాచల మాహాత్మ్యము, ద్విపద భాగవతము వంటి ఆధ్యాత్మిక కావ్యాలు రచించింది.

వెంగమాంబ చిత్తూరు జిల్లా, గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో వాసిష్ఠ గోత్రీకుడైన కానాల మంగమాంబ, కృష్ణయామాత్య అను నందవరీక బ్రాహ్మణ దంపతులకు 1730లో జన్మించింది. వెంగమాంబ బాల్యంలో తన తోటి పిల్లల్లాగా ఆటలాడుకోక ఏకాంతంగా కూర్చొని భక్తి పారవశ్యంలో మునిగి తేలేది. ఆ చిరు ప్రాయంలోనే అనేక భక్తి పాటలను కూర్చి మధురంగా గానం చేసేది. తండ్రి ఆమె భక్తిశ్రద్ధలను గమనించి ఆమె నైపుణ్యంను సానబెట్టుటకు సుబ్రహ్మణ్య దీక్షితులు అనే గురువు వద్దకు శిక్షణకు పంపాడు. దీక్షితులు ఆమె ప్రతిభను గుర్తించి తనకు తెలిసిన పరిజ్ఞానమంతా వెంగమాంబకు బోధించాడు. అనతి కాలంలోనే వెంగమాంబ ప్రశస్తి నలుమూలల పాకడంతో తండ్రి ఆమె విద్యాభ్యాసాన్ని మాన్పించి తగిన వరుని కోసం వెతకడం ప్రారంభించాడు.

ఇంటి పనులలో సహాయం చేయమని తల్లి చెప్పినపుడు తన సేవ భగవంతునికే అర్పణమని వెంగమాంబ తిరస్కరించింది. అనేక మంది వరులు ఆమెను చూచి చాలా అందంగా ఉన్నదని, చాలా తెలివైనదనే నెపాలతో పెళ్లి చేసుకొనుటకు సమ్మతించలేదు. చివరకు ఇంజేటి వెంకటాచలప్ప వెంగమాంబను చూసి ముగ్ధుడై ప్రేమలో పడి ఆమెను వివాహమాడుటకు అంగీకరించాడు. తండ్రి వివాహం జరిపించాడు. వివాహానంతరం వెంకటాచలప్ప ఆమె



భక్తి మౌఢ్యాన్ని వదిలించే ప్రయత్నం చేసాడు, కానీ వెంగమాంబ అతనిని దగ్గరికి రానివ్వలేదు.

ఈమె తిరుమలలో ఆలయానికి ఉత్తరాన 15 కి.మీ. దూరాన దట్టమైన అడవులలో తుంబురు కోన వద్ద యోగాభ్యాసం చేస్తూ గడపినట్లు తెలుస్తుంది. ఈమెకు వేంకటేశ్వరుడు కలలో కనిపిస్తూ ఉంటాడని అనేవారు. తిరుమలలో ఉత్తర వీధిలో, ఉత్తర దిశలో ఉన్న వనంలో (ప్రస్తుతం ఉన్న ఒక పాఠశాలలో) ఈమె సమాధి ఇప్పటికీ ఉంది. ఈమె ప్రతిరాత్రి ఊరేగింపుగా తన ఇంటి ముంగిటికి వచ్చే భోగ శ్రీనివాసమూర్తికి వెండి పళ్ళెంలో ముత్యాల హారతి ఇస్తూ ఉండేదట. ఇందుకోసం ఒక్కొక్కదినం నగిషీలు చెక్కబడిన వెండిపళ్ళెంలో ఒక్కొక్క దశావతార ఘట్టాన్ని సమర్పించేదట. ఈ విషయం సా.శ. 1890లో ఈస్ట్ ఇండియా కంపెనీవారు తయారు చేసిన కైంకర్య పట్టీ వలన తెలుస్తుంది. ఈమె తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆరాధించింది. చివరకు సా.శ.1817 ఈశ్వర సంవత్సరం శ్రావణ శుద్ధ నవమినాడు తరిగొండ వెంగమాంబ వేంకటేశ్వర స్వామిని స్మరిస్తూ సజీవ సమాధి చెందింది.

**వెంగమాంబ రచనలన్నీ వేదాంతం, భక్తి ప్రధానమైనవే. ఈమె రచనలలో ముఖ్యమైనవి పద్య కావ్యాలు:**

వేంకటాచల మాహాత్మ్యం, అష్టాంగ యోగసారం, ద్విపద కావ్యాలు, ద్విపద భాగవతం (ద్వాదశ స్కంధము), రమా పరిణయం, రాజయోగామృత సారం, వాశిష్ఠ రామాయణం, శతకాలు, శ్రీకృష్ణ మంజరి, తరిగొండ నృసింహ శతకం, యక్షగానాలు, నృసింహ విలాసం, శివలీలా విలాసం, బాలకృష్ణ నాటకం, విష్ణు పారిజాతం, రుక్మిణీ నాటకం, గోపీ నాటకం, చెంచు నాటకం, ముక్తి కాంతా విలాసం, జలక్రీడా విలాసం, తత్వ కీర్తనలు

**రచనా వైశిష్ట్యం:** సాహిత్యంలో మెలకువలు, రహస్యాలు తెలియకనే, అలంకార వ్యాకరణాది శాస్త్రాలు చదవకనే, కేవలం తన ఇష్టదైవం తరిగొండ నృసింహస్వామి దయవల్లనే తనకు కవిత్వం చెప్పడం వచ్చిందని, తన కృతి వేంకటాచలమాహాత్మ్యం అవతారికలో వెంగమాంబ ఇలా అంది.

నా చిననాట నోనామాలు నైన నా। చార్యుల చెంతనే జదువలేదు
పరుగు ఛందస్సులో బది బద్యములనైన। నిక్కంబుగా నేను నేరలేదు
చేరి తరికుండపురి నారసింహదేవు। డాన తిచ్చిన రీతిగ నే నిమిత్త
మాత్రమున బల్కుదును స్వసామర్థ్యమివ్వ।
దరయ నించుక యేని నా యందు లేదు.

కావ్యరచనలో పూర్వకవులు తొక్కని దారి లేదు. చెప్పని భావాలు లేవు కదా. నువ్వు కొత్తగా చెప్పేదేముందని ఇప్పుడు కావ్యం రచించావు? ప్రాచీనుల కన్న నీ గొప్పతనం ఏమిటి? అనే ప్రశ్నకు, తల్లితండ్రులకు, చిన్నపిల్లల జిలిబిలి పలుకులు ముద్దుగొల్పుతూ ఉంటాయని తరిగొండ వెంగమాంబ పండితులను, ప్రజలను ఇలా వేడుకుని, తన కావ్యాన్ని రుచి చూపింది.

పండితాగ్రగణ్యులార ప్రజలారా నా। బాలభాష కసూయపడక వినుడు
తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కుల। కానంద మొందెదునట్టు యిందు
భక్ష్యములు మెక్కి యావల బచ్చడియును।
నంజుకొనిన విధంబున నా ప్రబంధ
మాలకింతు రటంచు బేరాస చేత।
నేను రచియింతు దాని మన్నించి గనుడు.

పండితులను, ప్రజలను, తన కావ్యాలను స్థాలీపులాక న్యాయంగా స్వీకరించి తనని ఉద్ధరించమని వేడుకొనడంలో, వెంగమాంబ వినయశీలం స్పష్టమవుతూంది. రచన తర్వాత లక్షణం పుడుతుంది. కవి సమాజజీవి. శాస్త్రాలన్నీ సమాజజీవితం నుంచే పుడతాయి. శాస్త్రాన్ని అభ్యసించకపోయినా జీవితానుభవం ఉంటుంది కాబట్టి శాస్త్రవిషయాలు, అనుభవవిషయాలు సహజంగానే రచనలో చోటు చేసుకుంటాయి.

వెంగమాంబ గంభీరమైన యోగరహస్యాలను సరళసుందరమైన భావమధురమైన శైలిలో వివరించింది. లలితమైన శృంగార భావనలను కూడా రమణీయశైలిలో చెప్పింది. యోగతత్త్వ విషయాలను ఎంతో విజ్ఞానప్రదంగా చెప్పింది. ప్రణయకోపాలను, సవతి మాత్సర్యాలను, నర్మగర్భ సంభాషణలను, స్త్రీల ఎత్తిపొడుపు మాటలను, శ్రీకృష్ణుని శృంగారలీలలను, సహజంగా, రసవత్తరంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పింది. ఆమె ఆత్మవిశ్వాసంతో మధురభక్తి కాక, జ్ఞానాత్మకమైన యోగభక్తితో, పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ రచనలు చేసింది. ఈమె పాడుకోడానికి వీలైన సింగారపు పాటలు, నలుగు పాటలు, ఆరగింపు పాటలు, నిద్రపుచ్చే పాటలు, మంగళహారతి పాటలు వ్రాసి, తన రచనలను సంగీత సాహిత్య సమ్మేళనాలుగా రూపొందించింది.

తరిగొండ వెంగమాంబ రచించిన శ్రీకృష్ణమంజరి చాలా ప్రశస్తమైన స్తుతికావ్యం. దీనిని వావిలి కొలను సుబ్బారావు ("ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి) తమ భక్తిసంజీవని అనే పత్రికలో జనవరి 1929 సంచికలో ప్రచురిస్తూ, ఈమెను మహాయోగిని, భక్తురాలు, కవయిత్రిగా పేర్కొన్నాడు.

శ్రీ వెంకటేశ! నా చిత్తంబు నందు
నీ పాదయుగళంబు నిల్పవే కృష్ణ
నన్నేల తరిగొండ నరహరాకృతిని
బ్రత్యక్షమై నన్ను బాలింపు కృష్ణ!

అని ఈ స్తుతిమంజరి కావ్యం మొదలై చివరలో ఈమె తల్లిదండ్రులు కానాల మంగమాంబ, కృష్ణయామాత్యుడు అని చెప్పడం జరుగుతుంది.

సంస్కృత వరాహ, భవిష్యోత్తర, పద్మపురాణాలలోని వేంకటాచల మహాత్మ్యం ప్రశంసలు ఆధారంగా వేంకమాంబ, 'వేంకటాచల మాహాత్మ్యం' రచించింది. దీనిలో పద్మావతీ శ్రీనివాసుల వివాహ వృత్తాంతాన్ని ఎంతో రమణీయంగా రూపొందించింది. స్త్రీ హృదయాంతరాళాలలోని సున్నిత భావాలను, ఆత్మాభిమానాన్ని, ఆత్మగోపనాన్ని వెంగమాంబ అత్యంతమార్దవంగా, మార్మికతతో, చాకచక్యంతో, సరసంగా చిత్రించింది. శ్రీనివాసుని ద్వితీయ వివాహ సందర్భంలో లక్ష్మీదేవి అనుభవించిన బాధను ఆమె సమర్థంగా వర్ణించింది. ఇది వెంకటగిరి క్షేత్రమహాత్మ్యం వర్ణించే కావ్యం.

వెంగమాంబ తాను భాగవతం ద్వాదశస్కంధాలను ద్విపద కావ్యాలుగా రచించినట్లు, వేంకటాచల మాహాత్మ్యం లోని ఒక పదంలో చెప్పుకొంది.

ఈ ద్విపద భాగవతంలో, తత్వార్థాలను పామరులకు కూడా సరళసుబోధకం చేయడానికి, వెంగమాంబ తేటతెలుగు పదాలను ప్రయోగించి సంక్షిప్త సుందరం గావించినట్లు, ఈ ద్విపద పంక్తులను బట్టి తెలుస్తున్నది.

వేశ్యాంగన ముద్దుపళని వ్రాసిన రాధికా సాంత్వనము అనే శృంగారప్రబంధంలో వలె, మితిమీరిన శృంగార వర్ణనలు చేయక, కులాంగన అయిన వెంగమాంబ శృంగారం పేర అసభ్యవర్ణనలు చేయలేనని వేంకటేశ్వరమాహాత్మ్యంలో శ్రీకృష్ణునికి, అనగా కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామికి ఇలా విన్నవించుకోవడం సమంజసంగానే ఉంది.

శృంగారాకృతి తోడ పచ్చి పదముల్ శృంగారసారంబు తో
డం గూఢంబుగ జెప్ప నీవనగ నట్లే చెప్పలేనన్న నన్
ముంగోపంబున జూచి లేచి యటనే మ్రొక్కంగ మన్నించి
తచ్ఛృంగారోక్తులు తానె పల్కికొను నా శ్రీకృష్ణుని సేవించెదన్.

వెంగమాంబ తన కావ్యంలో పచ్చి శృంగారవర్ణనలు చేయలేదు సరి కదా, అక్కడక్కడ సందర్భోచితంగా వెలువడిన శృంగార పద్యాలు కూడా కృతిపతి శ్రీకృష్ణుని చమత్కారాలే అని లోకానికి చెప్పినట్లు తెలిస్తున్నది. ఎరుకసాని పాత్రను వేంకటాచలమాహాత్మ్యం కావ్యంలో ప్రవేశపెట్టి పాత్రోచితభాషగా సోదిభాషను ప్రయోగించి, నాటకీయతను, రమణీయతను కలిగించింది వెంగమాంబ.

తరిగొండ వెంగమాంబ శైలి, వేదాంత విషయ వివరణ సందర్భంలో కూడా మధురమై, వ్యావహారికానికి సన్నిహితమై ఉండటం విశేషం. ఆమె రచనలు ఆత్మజ్ఞానానికి, ఔచిత్యానికి ఆటపట్టు. ఈమె నిర్గుణోపాసన నుంచి, సగుణోపాసనలోకి దిగి మధురభక్తి సంప్రదాయాన్ని గురించి ప్రబోధాత్మకమైన, భక్తిదాయకమైన, రసోప్లావితమైన, అధ్యాత్మిక చింతనాభరితమైన కమనీయ కావ్యాలను రమణీయంగా రచించి, ఆంధ్రపాఠకలోకానికి అందించింది.

శ్రీమహావిష్ణువు వరాహావతారంలో హిరణ్యాక్షుని సంహరించి పాతాళాంతర్గతమైన భూమిని ఉద్ధరించిన తరువాత తన అవతారం గురించి భార్య లక్ష్మీదేవి ఏమి అడుగుతుందో, ఎలా గేలి చేస్తుందో అని తన సందేహాలను విష్ణువు గరుత్మంతునితో హాస్యంగా సంభాషించిన ఘట్టాలను ఆమె వర్ణించిన తీరు అత్యద్భుతమని విమర్శకులు శ్లాఘించారు.

వెంగమాంబ రచించిన తొమ్మిది యక్షగానాల్లో నృసింహ విలాసము, బాలకృష్ణనాటకము, రుక్మిణీనాటకము, విష్ణుపారిజాతము, జలక్రీడా విలాసము అనే అయిదింటికి బమ్మెర పోతన భాగవతము కల్పతరువు ప్రత్యక్షంగా కథావస్తువును ప్రసాదించింది. దశమస్కందంలోని రాసక్రీడాంశం ఆధారంగా వెంగమాంబ లేఖిని నుండి వెల్వడిన బాలకృష్ణ నాటకంలో పోతన గారి ఒరవడికి చక్కని ఉదాహరణ. వెంగమాంబ రచించిన తాత్త్విక కావ్యాల్లో విశిష్టమైనది రాజయోగామృతసారం మిక్కిలి ప్రశస్తమైనది. భాగవత తృతీయస్కంధంలోని కర్దమ ప్రజాపతి వృత్తాంతమే ఇందలి ఇతివృత్తం. ఈ కథలోని కపిల దేవహూతి సంవాదం ఆధారంగా వెంగమ్మ ఈ ద్విపదికృతిలో స్వానుభవపూర్వకమైన రాజయోగ విజ్ఞానాన్ని ముచ్చటగా మూడుప్రకరణాల్లో వివరించింది వెంగమాంబ. వెంగమాంబ రచనలన్నింటిలో పరిమితిలోను, కవితా పరిణతిలోను ప్రథమ గణ్యమైన గ్రంథం శ్రీభాగవతము. ఇది ద్విపదకావ్యము. భగవంతుని ప్రేరణయే కారణంగా తాను ఈగ్రంథాన్ని రచించినట్లు వెంగమాంబ అవతారికలో తెలిపింది. ఒకనాటి మధ్యాహ్న సమయంలో భగవానుడు భూసుర శ్రేష్ఠుని రూపంలో వచ్చి,భాగవతంలోతత్త్వార్థాలు పామరులకు సైతం బోధపడేటట్లు సంగ్రహంగాను, శ్రీహరి మహిమలను విస్తారంగాను రచించవలసినదిగా వెంగమాంబను ఆదేశించాడు. ఆయనే మరికొంత సేపటికి బాలకృష్ణుని రూపంలో ఆమె చెంతకు వచ్చి, భగవ ద్గ్రంథాన్ని చేతికిచ్చి దీనిని ద్విపదగా రచించమని సూచించి వెళ్ళినాడు.

వెంగమాంబకు పూర్వం తెలుగులో ద్విపద భాగవతాలు కొన్ని వెలసి ఉన్నప్పటికీ, వెంగమాంబ కృతి యొక్కటే పోతనగారి రచనను ఆమూలాగ్రం సమర్థవంతంగా అనుసరించిన ప్రఖ్యాతికి, ఆభక్తి గౌరవాలను నోచుకున్నది. ఇందువల్ల ఆనాటి (18వ శతాబ్దం) వెంగమాంబకు అందుబాటులో ఉన్న పోతన భాగవత ప్రతిలోని పాఠాలను గుర్తించగల సదవకాశం ఈనాడు మనకు ఆమె ద్విపదికృతి వల్ల సిద్ధిస్తూ ఉంటుంది. వెంగమాంబ పోతన రచనను యథాతథంగా ద్విపదీకరించినప్పటికీ, ఆమె అచ్చటముచ్చట కథలో కొన్ని చిన్న మార్పులు చేర్పులు చేసింది.

**విశేషాలు** : పలు ప్రక్రియలలో ఇన్ని గ్రంథాలు వ్రాసిన కవయిత్రులు ఆ కాలంలో లేరు. ఇటీవలే వెంగమాంబకు సంబంధించిన జీవిత విశేషాలను, రచనల వివరాలను తెలుపుతూ ఒక జాతీయ సదస్సును తిరుమల తిరుపతి దేవస్థానములు ఉద్యోగుల శిక్షణా సంస్థ డైరెక్టర్ భూమన్ ప్రారంభించాడు. ఆమె కీర్తనలకు ప్రాచుర్యం కలిగించే లక్ష్యంతో "జీవనగానం" అనే సి.డి.ని 2007లో విడుదల చేశారు.

తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వెంగమాంబ ప్రతిమ తరతరాలుగా పూజలు అందుకొంటున్నది. జనవరి 1న, ఇతర పర్వదినాలలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ఉత్తరమాడ వీధిలో నివసించే తరిగొండ వెంగమాంబ హారతి తీసుకోనిదే బ్రహ్మోత్సవాల సమయంలో ఆమె ఇంటి ముందు నుండి కదలని రథానికి గుర్తుగా ప్రతీరోజూ రాత్రి ఏకాంతసేవ అనంతరం వెంగమాంబని పాట పాడి హారతి ఇమ్మని భక్తులూ, అర్చకులూ అడిగేవారట. కాలక్రమంలో అది ఒక సేవగా స్థిరపడిపోయింది. ఈ సేవనే తరిగొండ ముత్యాల హారతి అనేవారు. వెంగమాంబ తరువాత ఆమె దత్తపుత్రిక వారసురాలయ్యింది. అదే పరంపర నేటికీ కొనసాగుతుంది.

తాను ఓనమాలు కూడా చదువుకోలేదనీ, తనది బాలభాష అనీ నమ్రంగా వెల్లడించిన తరిగొండ వెంగమాంబ కవిత్వంలో చేయి తిరిగిన విదుషీమణిగా కనిపిస్తుంది.

తరిగొండలో జన్మించి, తిరుకొండలో తరించిన వెంగమాంబ తనశ్రీ వేంకటాచల మాహాత్మ్యంలో చిత్రించిన శ్రీవేంకటేశ్వర వైభవం ఆమె స్వయంగా జీవితాంతం వరకు ప్రతినిత్యం అనుభవించి ఆస్వాదించిన అనుభూతి సంపద. తన కవిత్వ నీరాజనాలతో వేంకటేశ్వర వైభవాన్ని అర్చించిన తరిగొండ వెంగమాంబకు హృదయపూర్వక నీరాజనాలు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# దుర్గా నవరాత్రి ఉత్సవం

- డాక్టర్ దేవులపల్లి పద్మజ

దుర్గా దుర్గార్తి శమనీ దుర్గాపద్వి నివారిణీ
దుర్గమచ్ఛేదినీ దుర్గా సాధనీ దుర్గనాశినీ ॥

లోకకల్యాణార్థం, మన కుటుంబసౌఖ్యం కోసం, సంకల్ప సిద్ధి కొరకు కానీ మనకున్న అవకాశాలతో ఉత్సాహంగా జగజ్జనని ఆరాధనలు చేస్తూ నియమానుసారం విశేష సేవల ద్వారా అనుగ్రహం పొందే సంప్రదాయం మనది. ఆ దుర్గాదేవి మన నిత్య జీవితంలో దుఃఖం లేకుండా సుఖసంతోషాలతో కుటుంబం అభివృద్ధి దశలో ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకుంటూ ఆలయాల్లో దేశం సుభిక్షంగా, పాడిపంటలతో ధనధాన్యాలతో సాగిపోవాలనే సంకల్పంతో నవరాత్రులలో నవ అవతారాలలో మనకి దర్శింప చేస్తారు.

"ప్రథమా శైలపుత్రీచ, ద్వితీయ బ్రహ్మచారిణి, తృతీయ చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమా స్కంద మాతేతి, షష్ఠా కాత్యాయనేతిచ, సప్తమా కాళరాత్రీచ, అష్టమాచాతి భైరవీ, నవమా సర్వసిద్ధిశ్చాత్ నవదుర్గా ప్రకీర్తితా".

శ్రీమాతను ఆరాధించే విధానమును శ్రీమార్కండేయ మహర్షికి బ్రహ్మ చెప్పినట్లు మనకు పురాణాలద్వారా తెలుస్తోంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రులుగా మనం జరుపుకునే దసరా ఉత్సవాలు శక్తి రూపిణి అయిన దుర్గామాతను వివిధ రూపాలలో ప్రత్యేక పూజలతో పూజిస్తాము.

శక్తి ఆరాధన చేయదలచినవారు ప్రథమంగా గణపతిని పసుపుతో ప్రతిష్ఠించి నిర్విఘ్నంగా నవరాత్రుల దుర్గాపూజలు పూర్తిగావించి అఖండ ఫలితాలను ఆ తల్లి అనుగ్రహంతో పొందాలని సంకల్పం చెప్పుకోవాలి. నవరాత్రి కలశను ప్రతిష్ఠించి, నవధాన్యాలను కూడా ఒక పాత్రలో ప్రక్కనే పెట్టుకోవాలి. నవరాత్రులు శక్తికి ప్రతిరూపం కాబట్టి సక్రమంగా జరిపే పూజలు అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తుంది. అదే విధంగా ఆచార విరుద్ధంగా సాగించే పూజలతో చెడు ఫలితాలు కూడా చవిచూడవలసి వస్తుంది. కలశం స్థాపన వీలుకాక పోతే మామూలుగా కూడా తల్లిని పూజింపవచ్చును. నైవేద్యం విషయంలో కూడా శక్తి కలిగిన విధంగా చేయవచ్చును. ఈ నవరాత్రి వ్రతము చేయువారు ఏకభుక్తము చేయాలి. ప్రతిదినము ఉదయము మరియు సాయంత్రము అమ్మవారి పూజ విధివిధానాలతో చేయాలి.

**1. స్వర్ణ కవచాలంకారము:** ప్రథమంగా పాడ్యమి నాడు స్వర్ణకవచ అలంకారంతో దుర్గాదేవిగా విధివిధానాలతో, షోడశోపచార పూజలతో పూజిస్తారు. ఆ రోజు చేమంతి



పూవులను వినియోగిస్తారు. దుర్గా అష్టోత్తర నామములతో పూజ సల్పి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. దుర్గా కవచ పారాయణ విశేష ఫలితాన్నిస్తుంది.

**2. బాలాత్రిపుర సుందరి:** శరన్నవరాత్రులలో విదియ నాటి అవతారము బాలాత్రిపురసుందరి. పరమేశ్వరుడే తనకు పతి కావాలని కోరుకుంది. త్రిపురుని అర్థాంగి కావటం వలన, అన్ని లోకాలలో ఈ తల్లి సౌందర్యవతి గావున బాలాత్రిపుర సుందరిగా ఈ తల్లిని పిలుస్తారు. బాలా త్రిశతి స్తోత్రం అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి అర్చిస్తే అభీష్ట సిద్ధి కలుగుతుంది. అమ్మవారిని ఆకుపచ్చ రంగు వస్త్రముతో అలంకరించి, గులాబీలతో అర్చిస్తే శుభప్రదము. శ్రీశైలం దేవస్థానములో అమ్మవారిని బ్రహ్మచారిణి రూపంలో అలంకరిస్తారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరిస్తారు. ప్రథమంగా పాడ్యమి నాడు స్వర్ణకవచ అలంకారంతో దుర్గాదేవిగా విధివిధానాలతో, షోడశోపచార పూజలతో పూజిస్తారు. ఆ రోజు చేమంతి పూవులను వినియోగిస్తారు. దుర్గా అష్టోత్తర నామములతో పూజ సల్పి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. దుర్గా కవచ పారాయణ విశేష ఫలితాన్నిస్తుంది.

**3. గాయత్రీదేవి:** దుర్గానవరాత్రులలో మూడవ రోజైన తదియనాడు అమ్మవారిని గాయత్రి అవతారంలో అర్చిస్తాము. సకల మంత్రాలకు మూలశక్తి అయిన గాయత్రీదేవి ముక్త, విద్రు మ, హేమ, నీల, ధవళ వర్ణాలతో కూడిన అయిదు ముఖాలతో శంఖము. చక్రము, గద మరియు అంకుశం ధరించి దర్శనమిస్తుంది. గాయత్రిదేవిని త్రిశక్తి స్వరూపంగా భావిస్తారు. విజయవాడలో కొలువైయున్న కనకదుర్గ ఈరోజు గాయత్రిమాత అలంకారంలో దర్శనమిస్తుంది. శ్రీశైలంలోని భ్రమరాంబ ఈ రోజు చంద్రఘంట అవతారంలో దర్శనమిస్తుంది. అర్థాకృతిలోని చంద్రరేఖను శిరస్సుపై ధరించే రూపం చంద్రఘంట. ఈ అమ్మవారికి రోజు అమ్మవారికి ఎరుపు రంగు వస్త్రము, కనకాంబరాలతో అలంకరించాలి. ఈమెకు పాయసం, అల్లపు గారెలు నివేదన చేయాలి.

**4. అన్నపూర్ణ:** దసరా నవరాత్రులలో నాల్గవరోజైన చవితినాడు అమ్మవారిని అన్నపూర్ణమాతగా ఆరాధిస్తారు. ఈమె ఒక చేతిలో అక్షయ పాత్రతో మరియొక చేతిలో గరిటెతో దర్శనమిస్తుంది కావున ఈమెను అన్నపూర్ణగా పూజిస్తారు. సాక్షాత్తు పరమేశ్వరునికే భిక్షనొసంగిన అన్నపూర్ణ అక్షయములైన శుభాలకు అన్నపూర్ణాష్టక పారాయణ శుభదాయకము. ఈమెకు పులిహోర, పెసరపప్పు పాయసం నివేదన చేయాలి. విజయవాడ కనకదుర్గమ్మ అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. శ్రీశైలంలోని భ్రమరాంబ కూష్మాండ రూపంలో దర్శనమిస్తారు. కూరగాయలతో చేసిన కదంబం నివేదన చేయాలి.

**5. లలితా త్రిపురసుందరి:** దసరా నవరాత్రులలో అయిదవ రోజైన పంచమి తిథినాడు అమ్మవారు లలితాత్రిపురసుందరిగా ఆరాధిస్తారు. శ్రీచక్రముపై ఎడమ పాదమును మోపి, చెరకు విల్లు, పుష్ప బాణములు ధరించి బంగారు సింహాసనముపై ఆశీనురాలైవుంటుంది. లలితా కవచపారాయణ, లలితా సహస్రనామ పారాయణ అత్యంత ఫలదాయకము. లలితాదేవికి గులాబీరంగు వస్త్రము ధరింపచేసి, నీలంరంగు పువ్వులతో పూజచేసి పాయసం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈరోజు లలితా త్రిపురసుందరీగా దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు స్కందమాతగా దర్శనమిస్తుంది. గోధుమ రవ్వతో చేసిన కేసరి, మిరియాల పొంగలి నివేదన చేయాలి. నీలం రంగు వస్త్రములతో అలంకరిస్తారు.

**6. మహాలక్ష్మి:** దుర్గానవరాత్రులలో ఆరవరోజైన షష్టి తిథినాడు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అర్చిస్తారు. సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు, సంతానానికి ప్రతీక. జగత్తు స్థితి కారకుడైన శ్రీమహావిష్ణువునకు తోడుగా మహాలక్ష్మి ఉద్భవించినదని దేవీభాగవతంలో చెప్పబడినది. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు భక్తులకు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తారు. ఈ తల్లిని శ్రీసూక్త పారాయణతో, మహాలక్ష్మి సహస్రనామములతో, మహాలక్ష్మాష్ట స్తోత్రముతో స్తుతించాలి. ఈ తల్లికి తెలుపురంగు చీరను సమర్పించి, కలువపూవులతో, తామరపూవులతో అర్చించాలి. నైవేద్యంగా పూర్ణం బూరెలు సమర్పించాలి. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈమెను పసుపు రంగు వస్త్రాలతో అలంకరించిఈ మాతకు బెల్లం అన్నం, ముద్ద పప్పు నైవేద్యంగా సమర్పించాలి.

**7. సరస్వతీమాత:** దుర్గానవరాత్రులలో ఏడవ రోజైన సప్తమి తిథినాడు అమ్మవారిని సరస్వతి అవతారంలో ఆరాధిస్తారు. దేవతామూర్తులలో చదువుల తల్లిగా సరస్వతీ దేవి కొలువబడుతుంది. త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ పట్టపురాణి. సృష్టి కార్యం నిర్వహించటానికి బ్రహ్మకు తోడుగా ఈమెను మహాశక్తి సృజించినట్లుగా దేవీభాగవతం తెలియచేస్తోంది. తెల్లని పద్మముపై ఆసీనురాలై వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి అభయముద్రతో దర్శనమిస్తూ భక్తులకు జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తుంది. ఈ రోజు మూలా నక్షత్రము గావటం వలన సరస్వతీ అవతారంలో దర్శనమిస్తుంది. విద్యార్థులచేత అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఈ మాతకు తెల్లని లేదా పసుపు రంగు వస్త్రాలు సమర్పించి, బెల్లం అన్నం, ముద్దపప్పు నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు సరస్వతీ అవతారంలో దర్శనమిస్తారు. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ తల్లికి ఆకుపచ్చ వర్ణం వస్త్రాలతో అలంకరించి దద్దోజనం, చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించాలి.

**8. మహాదుర్గ:** దుర్గానవరాత్రులలో ఎనిమిదవ రోజైన అష్టమినాడు అమ్మను మహాదుర్గగా ఆరాధిస్తారు. పంచ ప్రకృతి రూపాలలో మొదటిది దుర్గా రూపము. సింహవాహనముపై అధిరోహించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తుంది. దుర్గముడనే రాక్షసుని సంహరించి, దుర్గతులను నాశనమొనరించి నందువలన ఈమెను దుర్గాదేవి అని కూడా పిలుస్తారు. రోజు దుర్గాసప్తశతి, చండీ పారాయణ, దుర్గా స్తోత్రము విశేష ఫలదాయకము. ఎరుపు రంగు వస్త్రము, ఎరుపు రంగు పూవులు అమ్మవారికి సమర్పించాలి. అమ్మవారికి పొంగలి, పులిహోర, పులగం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడలో కనకదుర్గమ్మ ఈరోజు మహాదుర్గగా భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు మహాగౌరిగా భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ తల్లికి గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**9. మహిషాసుర మర్ధిని:** తొమ్మిదవ రోజైన నవమిని మహర్నవమి అని కూడా వ్యవహరిస్తారు. మహిషాసుర మర్ధిని స్తోత్రమును భక్తి శ్రద్ధలతో దుర్గానవరాత్రులలో నవమి రోజన

మహిషాసుర మర్ధిని రూపంలో యున్న అమ్మ అనుగ్రహం కోసం భక్తులు పఠిస్తారు. మహిషుడు గర్వమునకు, మదమునకు అంధకారమునకు ప్రతీక. ఈ రోజు దుర్గాసప్తశతి పారాయణ, ఖడ్గమాలా స్తోత్ర పారాయణ అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పానకం, వడపప్పు, గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి. ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు మహిషాసుర మర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబను ఈ రోజు సిద్ధిధాత్రి అవతారంలో అలంకరిస్తారు. ఈ రోజు చండీ సప్తశతి, ఖడ్గమాల పారాయణ చేయాలి. ఈ తల్లికి కొబ్బరి అన్నం, నిమ్మకాయ పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**10. రాజరాజేశ్వరీ దేవి:** దుర్గానవరాత్రులలో ఆఖరి అవతారము శ్రీరాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకముపై ప్రకాశముతో వెలుగొందుతూ, పరమేశ్వరుని వామాంకములో ఆసీనురాలై భక్తులకు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిని ప్రసాదించే అవతారము శ్రీరాజరాజేశ్వరి. ఈరోజు ఈ తల్లిని లలితా సహస్రనామ పారాయణ చేసి ఆరాధించాలి. చేమంతులతో పూజ చేయాలి. భక్ష్య, భోజ్యములతో మహానివేదన చేయాలి. బంగారు కవచధారణ చేస్తారు లేదా బంగారు వర్ణముగల వస్త్రముతో అలంకరిస్తారు. ఈ రోజున విజయదశమిగా పూజిస్తాము. ఈ రోజు అశ్వపూజ, ఆయుధపూజ, ఉచ్ఛ్త్రైశ్రవ పూజ, వాహన పూజ నిర్వహిస్తారు. శ్రీరాముడు విజయదశమి రోజున రావణుని సంహరించి విజయం పొందాడు. దశమి రోజు సాయంత్రము నక్షత్ర దర్శన సమయంలో శమీవృక్షము వద్ద అపరాజితాదేవిని స్మరిస్తారు. "శమీ శమయతే పాపం, శమీ శత్రువినాశిని ` అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియ దర్శినీ" అనే ఈ మంత్రముతో తమ తమ గోత్రనామాలు చెప్పుకుని జమ్మి వృక్షాన్ని పూజ చేసి మూడు ప్రదక్షిణలు చేస్తారు.

దేవీ ఉపాసకులు అంతవరకు తాము చేసిన జప సంఖ్యననుసరించి తగువిదముగా హోమాలు చేస్తారు. నవరాత్రి వ్రత సమాప్తి గావించిన వారికి సర్వ సిద్ధులు, సర్వాభీష్ట సిద్ధి కలుగుతుంది. దసరా నవరాత్రులలో వైభవోపేతమైన దుర్గాదేవి పందిళ్ళు మనకి వాడవాడలా శోభాయమానంగా ఆహ్వానం పలుకుతాయి. శ్రీ మాతాదేవ్యైనమః.

**శుభం భూయాత్.**

# భగవద్గీత

## - పూర్ణిమ పసుమర్తి

ఈ అపారమైన జ్ఞానసముద్రంలో, ప్రతి శ్లోకమూ మన మనస్సును ప్రబోధించే ప్రకాశబింబంలాంటిది. అటువంటి గీతాలో, రెండవ అధ్యాయంలోని మూడవ శ్లోకం — "క్లైభ్యం మాస్మ గమః పార్థ" — అతి విశేషమైన సందేశాన్ని కలిగి ఉంది. ఇది ఒక సాధారణమైన ఉద్దేశమో మాములు గా ఇచ్చే ఒక సలహానో కాదు. ఇది ఓ ధర్మ బద్ధంగా నడిచే ఒక ముముక్షువుకి ఒక ఆధ్యాత్మిక వీరునికి ఇచ్చిన ఆధ్యాత్మిక ధైర్యపూరిత పిలుపు.

కురుక్షేత్రరంగంలో, అర్జునుడు తన బంధువులను, గురువులను చూసి దుఖించి.. రాజ్యం కోసం వీరిని సంహారించటం

"ధర్మమా లేదా పాపమా అనే సంఘర్షణతో ధర్మాన్ని నిర్ణయించుకోలేక పోయాడు..శ్రీకృష్ణుడు వెంటనే పలికాడు:

క్లైభ్యం మాస్మ గమః పార్థ।
నైతత్త్వయ్యుపపద్యతే ॥

"ఈ బలహీనత నీకు తగదు అర్జునా! నీలో పుట్టిన ఈ హృదయదౌర్బల్యాన్ని త్యజించు."

ఇక్కడ "క్లైభ్యం" అనగా బలహీనత..దౌర్భల్యం" అనగా మనస్సు యొక్క అస్థిరత, భయం. శ్రీకృష్ణుడు దీనిని క్షుద్రం, అంటే తక్కువ స్థాయిలో ఉందని ఎత్తి చూపుతున్నాడు.

ఈ శ్లోకాన్ని కేవలం యుద్ధరంగానికి పరిమితం చేయకూడదు. ప్రతి మనిషి జీవితంలో ఎన్నో "కురుక్షేత్రాలు" ఉంటాయి..ధైర్యం కోల్పోయే క్షణాలు, సంభ్రమంతో వెనకడుగు వేసే సమయాలు, సత్యం ధర్మం వైపు నిలబడడానికి భయం వేసేసందర్భాలు అటువంటప్పుడు మన కోసం ఈ శ్లోకం గుర్తుచేసుకోవాలి.

హృదయదౌర్భల్యాన్ని వదిలెయ్యి!"నీ కర్తవ్యం గుర్తు చేసుకో!"లేచి నిలబడు!మానసిక బలమే నిజమైన శక్తి...శరీరబలం, బాహుబలం కాకుండా, గీతా సారమంతా బుద్ధి బలం, ఆత్మ బలం మీదే ఆధారపడి ఉంది.మనస్సు స్థిరంగా ఉంటేనే మనం ధర్మాన్ని నిలబెట్టగలం. అన్యాయంపై ఎదురు తిరగగలము.బాధలను భరించగలము.

"క్లైభ్యం మాస్మ గమః పార్థ" అన్నది కేవలం అర్జునునికి మాత్రమే కాక, ప్రతి మనిషికి సమర్పించబడిన ఒక ఆత్మవిశ్వాస గీతం. ఈ శ్లోకాన్ని మన గుండెల్లో స్థిరపరచుకుంటే – ఏ అంధకారాన్ని అయినా మనం దాటి పోవచ్చు.

జీవన సమరంలో వెనుకడుగు వేసే ప్రతి సందర్భంలోనూ మన అడుగులు ముందుకు వేస్తూంటే గమ్యం చేరువ అవుతూ ఉంటుంది. చివరికి లక్ష్యాన్ని చేరుతాం! అదేవిధంగా ధ్యానయోగసాధనలో కలిగే విఘ్నాలను కూడా ప్రతి ధ్యానయోగ సాధకుడు ధైర్యంగా ఎదుర్కొని నిలవాలి.నిరాశా, నిస్పృహలకు లోను కారాదు.

అంతఃశత్రువులైన అరిషడ్వర్గాలతో అంతర్యుద్ధం చెయ్యాలి.తమ అంతిమలక్ష్యమైన ఆత్మానుభూతినీ, జన్మరాహిత్యాన్నీ సాధించాలి. అర్జునుడు అనుభవిస్తున్న మనోభావం, నైతిక బాధ్యతా కాదు మరియు నిజమైన కారుణ్యమూ కాదు, నిజానికి అది శోకము, చిత్తభ్రాంతి మాత్రమే, అని శ్రీ కృష్ణుడు ఇక విశదీకరిస్తాడు. దీని మూలకారణం మానసిక బలహీనతలో ఉంది. నిజమైన ధర్మం మరియు జ్ఞానంపై, అతని ప్రవర్తన ఆధార పడివుంటే, తనకి అయోమయము, శోకం కలిగి ఉండేవి కావు.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

### బృహస్పతి చేసిన స్కంద స్తుతి

దేవతల దుఃఖాన్ని పోగొట్టే ఓ కుమారస్వామీ! బంగారు కాంతి కలవాడా! శంకరపుత్రా! శుభంకరా! నిన్ను శరణు వేడుచున్నాను.

"త్వం విష్ణుస్త్వం విధాతా చ త్వం రుద్రః కాలరూప ధృక్ ।
శిఖివాహన! షడ్వక్త్ర! కుమారస్తార కాన్తక! ॥
సుబ్రహ్మణ్యః శిఖీస్కన్దః కుమారః షోడశాబ్దకః ।
శరజన్మా శక్తి హస్తొ గాంగేయోగ్ని సముద్భవః ॥
ఏకవక్త్రో ద్విబాహుశ్చ కుమారః పురుషోత్తమః ।
మాతృప్రీత్యా చ షడ్వక్త్రః పార్వతీప్రీతి వర్ధనః ॥"

**- వామనపురాణం, అధ్యాయం 21, శ్లోకాలు 91,92,93**

నీవు విష్ణుస్వరూపుడవు, బ్రహ్మదేవుడవు, రుద్రుడవు కూడ నీవే. నీవు కాలస్వరూపుడవు. ఓ నెమలి వాహనా! షణ్ముఖా! తారకాంతకా! నీవు కుమారునిగా ఉన్నావు? (కౌమారావస్థలో ఉన్నావు) నీవు సుబ్రహ్మణ్యుడవు, మయూర వాహనం కలవాడవు (శిఖ కలవాడవు). స్కందుడవు. పదహారేళ్ళ వయస్సు గల కుమారుడవు. రెల్లుపొదలలో జన్మించినవాడవు. చేతిలో 'శక్తి' అనే ఆయుధాన్ని ధరించినవాడవు, గంగాదేవి పుత్రుడవు, అగ్ని సంభవుడవు. ఒకే ముఖం కలవాడవు. రెండు భుజములు కలవాడవు. పురుషోత్తముడవు. తల్లుల ప్రీతిచేత ఆరు ముఖములను ధరించినవాడవు, పార్వతీదేవికి ఆనందాన్ని పెంపొందించేవాడవు.

ఓ మహావీరా! శంకరనందనా! షణ్ముఖా! నీవు పన్నెండు నేత్రాలతో (ఆరుజతలు) విరాజిల్లుతున్నావు. దిక్పాలురందరికి సేనానాయకుడైన ఓ కుమారస్వామీ! శక్తిధరా! ప్రభూ! మాకు సుఖాన్ని కలిగించు. పన్నెండు చేతులలో ప్రకాశించే ఆయుధాలను ధరించిన ఓ స్వామీ! దేవతలను బాధించే రాక్షసులను సంహరించే వాడా! పన్నెండుకోట్ల సూర్యుల కాంతితో సమానమైన తేజస్సు గలవాడా! శక్తిధరుడవైన కుమారా! మాకు సుఖాన్ని ప్రసాదించు. బాలసూర్యుని లేత కిరణముల కాంతిచే వికసించి ప్రకాశించే పద్మములవంటి కాంతిగల నీ పాదపద్మములకు శిరస్సు వంచి నమస్కరించని వారికి ఈ జన్మలో పుత్రసంతానం కలుగదు.

స్ఫురన్తం చలన్తం తడిత్కోటి కాన్తి ।
మయూరాధిరూఢం మనోహారి వేషమ్ ॥
పులిన్ద్రాపతిం త్వాం ప్రపద్యే కుమారం ।
కుమారం చ మే దేహి మృత్యుంజయ! త్వమ్ ॥ (మృత్యుజయత్వమ్)

**- వామనపురాణం, అధ్యాయం 21, శ్లోకం 97.**

నీవు ప్రకాశించేవాడవు, కోటి మెరపుల కాంతి గలవాడవు. నెమలి వాహనాన్ని అధిష్ఠించినవాడవు, మనోహరమైన రూపం కలవాడవు, బలాఢ్యులకు నాయకుడవు (శబర నాయకుడవు)

అయిన ఓ కుమారస్వామీ! నిన్ను శరణు వేడుచున్నాను. నాకు పుత్రుని ప్రసాదించు. ఓ మృత్యుంజయా! నీవు నాకు అమృతత్వాన్ని ప్రసాదించు అని బృహస్పతి ఈ విధంగా స్తుతించగా భూతేశుడైన పరమశివుని కుమారుడు, మహానుభావుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు ప్రసన్నుడై బృహస్పతికి ఈ విధంగా వరప్రసాదం చేశాడు.

"ఓ దేవగురువైన బృహస్పతీ! నీకభీష్టమైన వరముల నిస్తున్నాను. నీవు పుత్రులను పొందుతావు. మృత్యువును జయిస్తావు. నీకు యౌవనాన్ని ప్రసాదిస్తున్నాను. (నీవు యువకుడివిగానే ఉంటావు) భూలోకంలో నీవు చేసిన ఈ స్తోత్రంతో నిత్యం త్రిసంధ్యలలో నన్ను ఆనందింపజేసే మానవోత్తముడు పుత్రులను, ధనధాన్యములను, సంపదలను తప్పక పొందుతాడు. అపమృత్యువును జయిస్తాడు. సౌభాగ్యాన్ని, రాజమర్యాదలను పొందుతాడు" – అని బృహస్పతికి వరములిచ్చి, దేవతలందరిని పంపించి వేసి కుమారస్వామి మయూర వాహనాన్నధిరోహించి వేంకటాచలానికి వెళ్ళాడు.

అక్కడ ఒక సుందరము, పవిత్రములైన ప్రదేశంలో ఒకమంచి సరస్సును చూశాడు. ఆ గొప్ప తటాకం స్నానానికి, అనుకూలంగా ఉంది. దేవతాపూజకు కావలసిన పద్మాలతోను, కలువలతోను చక్కగా శోభిల్లుతున్నది. కుమారస్వామి ఆ సరస్సులో స్నానం చేసి దాని ఒడ్డునే తపస్సు చేస్తున్న వాయుదేవుని చూచి తాను కూడ ఆ సమీపంలోనే కూర్చున్నాడు.

త్రిసంధ్యలలోను దేవదేవుడు, పరాత్పరుడు అయిన నారాయణుని స్మరిస్తూ, సమాధినిష్ఠుడై, ధ్యానయోగాన్నవలంబించి శంఖచక్రధారియైన, పరమపురుషుడైన శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ ఘోరతపస్సు చేశాడు. తన రెండు పాదాలను భూమిపై నిలిపి, బంగారు కాంతితో సమానమైన తేజస్సుతో ప్రకాశిస్తూ పరాత్పరుడు, మహత్తుకంటె కూడ మహత్తరమైన వాడు అయిన పరబ్రహ్మమును ధ్యానిస్తూ కుమారస్వామి ఉగ్రతపస్సు చేశాడని నారద మహర్షి వాల్మీకికి తెలియజేశాడు.

అంతట మహర్షులు నారదమునీంద్రా! కుమారస్వామి తపస్సు చేయడానికి వృషాద్రికి వెళ్ళిన తరువాత పుత్రవాత్సల్యం గల పార్వతీదేవి శంకరునితో పాటు ఏమి చేసింది? మాకు తెలియజేయమని అడుగగా నారదమహర్షి మరల ఇలా చెప్పనారంభించాడు – ఓ బ్రాహ్మణులారా! బంగారు వంటి తేజస్సుగల కుమారస్వామి దేవసేనలతో పాటు ధనుస్సును, శక్తి ఆయుధాన్ని ధరించి తపస్సుకై బయలుదేరగా పుత్రవాత్సల్యంతో పార్వతీ దేవి తన భర్తయైన చంద్రశేఖరుని, హరుని, పరమశివుని భక్తితో, వినమ్రురాలై ఈ విధంగా ప్రశ్నించింది – 'నాథా! త్రిలోచనా! బాలుడైన మన కుమారుడు అక్కడ ఏమి తపస్సు చేస్తాడు? బ్రహ్మదేవునికి కూడా చింతింప నలవికాని ఆ దేవదేవుని ఎలా దర్శిస్తాడు?' అని అడుగగా పరమేశ్వరుడు నవ్వుతూ ఇలా అన్నాడు.

దేవీ! భవిష్యత్తులో జరుగబోయే పరమ రహస్యాన్ని చెబుతాను. విను. ఆ పరమాత్మ దర్శనానికై అనేకమంది మహర్షులు ఆ పర్వతానికి వచ్చి అక్కడ ఉత్కృష్టమైన తపస్సు చేస్తారు. దేవతలు, మనుష్యులు, పితృదేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, గరుడులు, నాగులు, ఋషులు ఆ మహాపర్వతములో సనాతన పరబ్రహ్మను సాక్షాత్కరింపకోరి తపస్సు నాచరిస్తారు. వారిలో కొందరు నన్ను పూజిస్తారు. మరికొందరు బ్రహ్మదేవుని, ఇంకొందరు మహాత్ముడైన స్కందుని, కొందరు ఇంద్రుని ఆరాధిస్తారు. అలాగే కొందరు రాక్షసులు దేవతలతో యుద్ధం చేయగోరి మమ్మల్ని సంతోషపెడుతూ ఉగ్ర తపస్సు చేస్తారు.

దేవీ! చాలాకాలం తరువాత మనమిరువురం పరబ్రహ్మ, పరతత్త్వము, పరాత్పరుడు అయిన ఆ నారాయణుని దర్శించడానికి అక్కడకు వెళతాము. అక్కడకు వెళ్ళి శ్రీవేంకటాచలంలో, ఆ పవిత్రక్షేత్రంలో భగవంతుడవతరించుటకై మనం గొప్ప తపస్సు చేస్తాం. కాలచక్రం నా కొరకు గొప్ప తపస్సు చేస్తున్నది. ఓ హైమవతీ! దేవతలు, ఋషులు మనమిరువురం కూడా అక్కడకు వెళ్ళాలి. ఆ చక్రము నా వియోగంతో దుఃఖిస్తూ విష్ణువు అనుమతితో చక్రతీర్థంలో నివసిస్తున్నది. అని పరమశివుడు చెప్పగా విని పార్వతీదేవి 'ఈశ్వరా! మీరు విష్ణుచక్రాన్ని గురించి చాలా ఆశ్చర్యకరమైన విషయాన్ని చెప్పారు. ఆ పవిత్రమైన సుదర్శన చక్రం ఎల్లప్పుడు శ్రీమహావిష్ణువు చేతిలో ఉంటుంది కదా! ప్రభూ! శంకరా! అది మీకోసం ఎందుకు తపస్సు చేస్తున్నది? దానికి మీతో ఎలా స్నేహసంబంధమేర్పడింది?

మహాశ్చర్యకరమైన ఈ విషయాన్ని నాకు తెలియజేయండి అని అడుగగా లోకాలకు శుభాలను కలిగించే శంకరుడు అంబికతో యిలా అన్నాడు –

ఆద్యంతములు లేనిది, దివ్యమైనది, ఊహింపనలవి కాని పరాక్రమం కలది. వేయి అంచులతో కూడినది. కోటి సూర్యులతో సమానమైన కాంతిగల ఆ సుదర్శన చక్రాన్ని ధరించటానికి పురుషోత్తముడైన ఆ శ్రీమహావిష్ణువుకు తప్ప మరొకరికి సాధ్యముకాదు. పార్వతీ! నా దివ్యరాజధానియైన వారణాశి పట్టణం పూర్వం భూతబాధ కారణంగా దివ్యమైన సుదర్శన చక్రంచేత దహించబడింది. కొంతకాలం తరువాత జనార్దనునికి నాయందు ప్రీతి కలిగి నాకు వరమివ్వాలని 'నీకేం కావాల' ని నన్ను అడిగాడు.

నేనప్పుడు 'శ్రీహరీ! ఏ సుదర్శన చక్రం ఆ కాశీపట్టణాన్ని దహించిందో ఆ చక్రం నా వశంలో ఉండి నాకు భృత్యుడుగా ఉండేటట్లు చేయి మాధవా! నేను మరొక వరం అడుగను' అని నేను ఉత్తమమైన వరాన్ని కోరగా మధుసూదనుడు నవ్వి తన

చేతితో నా చేయిని పట్టుకొని యిలా అన్నాడు.

'శంకరా! సూర్యుని విడిచి కాంతి యితరులననుసరిస్తుందా? అదేవిధంగా లక్ష్మీదేవి, కౌస్తుభమణి, సుదర్శన చక్రం, శారఙ్గమనే ధనుస్సు, గరుత్మంతుడు మొదలైనవన్నీ ఎల్లప్పుడూ నా వద్దనే ఉంటారు. వీటికి పుట్టుక కాని, నాశం కాని, యితరులను ఆశ్రయించి ఉండడం కాని, సంభవించదు. 'ఓ ప్రమథనాథా! నీవు సాధ్యం కాని వరాన్ని కోరావు. నేనెప్పుడు అసత్యం మాట్లాడను. కాబట్టి నీవు కోరినట్లే అగు గాక!

'ఈ దివ్యమైన సుదర్శన చక్రం ఏదో ఒక కారణాంతరం వలన బ్రహ్మచే సృష్టించబడి అల్పాంశతో అవతరిస్తుంది. ఆ విధంగా అవతరించిన ఆ చక్రం వేయి దివ్య సంవత్సరాలు నీ వద్దనే, నీ అధీనంలోనే ఉంటుంది. నీవు మరల నాకు సమర్పించినపుడు అది తిరిగి తన సహజరూపాన్ని పొందుతుంది.

ఈ విధంగా విష్ణువు అనుగ్రహంతో నాకు వరం లభించింది. దేవీ! సహస్ర సూర్యుల ప్రకాశంతో వెలుగొందే విష్ణుచక్రాన్ని త్రిపురాసుర సంహార సమయంలో మంత్రాన్నుపదేశించిన శ్రీమహావిష్ణువుకు దక్షిణగా తిరిగి సమర్పించాను. పూర్వం బ్రహ్మచే నిర్మించబడిన ఆ కాలమనే చక్రం చాలకాలం నా వద్దనే ఉన్నది. రాక్షసులను సంహరించి దేవతలను కాపాడటానికి నేనా కాలచక్రాన్ని చాలకాలం ధరించాను. ఇప్పుడా చక్రం నా ఎడబాటును సహించలేక నా కోసం తపస్సు చేస్తున్నది అని శంకరుడు చెప్పగా విని సంతోషించిన పార్వతీదేవి మరల పరమశివుని "నాథా! శంకరా! మీరు చెప్పిన ఆ చక్రతీర్థమెక్కడున్నది? శంభూ! ఆ పవిత్రమైన ఉత్తమ తీర్థాన్ని గురించి నాకు వివరంగా చెప్పండి'' అని అడుగగా పరమశివుడు పార్వతీదేవికి మరల ఇలా చెప్పసాగాడు.

వృషాద్రికి దక్షిణం ప్రక్కన అనేక సెలయేరులున్నాయి. వాటి తీరంలో చక్రాది మహాత్ముల ఆశ్రమాలు పదిహేడున్నాయి. ఆ తీర్థాలన్నీ పరమపవిత్ర మైనవి. వాటిలో మొదటిది చక్రతీర్థం. అది వజ్రతీర్థానికి క్రింది భాగాన ఉన్నది. కాలచక్రం ఆ తీర్థంలో తపస్సు చేసింది. అక్కడే కపిలతీర్థముంది. అక్కడ స్నానం చేసే మానవుల సర్వపాపాలు నశిస్తాయి. అది విష్ణువు యొక్క మహాపుణ్యప్రదమైన క్షేత్రం! అని శివుడు చెప్పగా పార్వతీదేవి తన భర్తయైన శివునితో భక్తితో మరల 'నాథా' మీరు వజ్రతీర్థమని చెప్పారు. అది చక్రతీర్థంపై ఎందుకు విరాజిల్లుతున్నది?' అని అడుగగా పరమశివుడు మరల యిలా చెప్పసాగాడు –

పూర్వం ఇంద్రుడు మహాతేజశ్శాలియైన గౌతముని భార్య అయిన అహల్యను పొంది ఆ మహర్షిచేత సహస్రయోనివి కమ్మని శపించబడ్డాడు. అలా శపించబడి ఇంద్రుడు బాధతో బ్రహ్మసరస్సుకు వెళ్ళి అక్కడ తామరతూడులో దాక్కొన్నాడు. అంతట దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, మహేంద్రుని కోసం ఎంత వెతికినా స్వర్గలోకంలో ఆయన కనబడలేదు. ఇంద్రుడు లేని కారణాన సురసైన్యం దేవతలంతా దైన్యం పొందారు. దేవతలంతా అమరావతికి వెళ్ళారు. వారిలో బృహస్పతి ప్రముఖులు ఇంద్రపత్నియైన మహారాణి శచీదేవిని సమీపించి ఆమెకు నమస్కరించి 'తల్లీ! నీ భర్త ఎక్కడికి వెళ్ళాడు? శత్రువులు మమ్మల్ని భయపెడుతున్నారు. మాకెవరూ రక్షకుడు లేక బాధపడుతున్నాము' అని ప్రార్థించగా శచీదేవి ఆ దేవతలతో 'ఓ సురోత్తములారా! నేను రాత్రి నా భర్తతో పాటు శయ్యపై నిద్రించాను. ఆ మాయావి దేవరాజు ఎక్కడికి వెళ్ళాడో నాకు తెలియదు. మనందరికీ గురువైన బృహస్పతులవారికే తెలియాలి' అని చెప్పింది.

శచీదేవి ఈ విధంగా చెప్పగా దేవతలంతా తమ గురువైన బృహస్పతికి శాశ్వత బ్రహ్మకు నమస్కరించినట్లు భక్తితో నమస్కరించి 'మహాత్మా! మా మహారాజైన దేవేంద్రుడు ఎక్కడకు వెళ్ళాడో మాకు తెలియజేయండి?' అని ప్రార్థించగా బృహస్పతి తన యోగదృష్టితో ఇంద్రుని జాడను తె లుసుకొని చిరునవ్వుతో దేవతలతో యిలా అన్నాడు –

శచీపతి అకృత్యం చేసి దాని ఫలితాన్ననుభవిస్తున్నాడు. సిగ్గుతో మేరు పర్వతంపై నున్న బ్రహ్మసరస్సులోని పద్మనాళంలో దాక్కున్నాడు. మనందరం ఆ సరస్సు దగ్గరికి వెళ్ళి సురేశ్వరుని దర్శిద్దాం' అనగా వారంతా దేవగురువుతో పాటు ఆ సరస్సు దగ్గరికి వెళ్ళారు. అప్పుడు దేవతలందరినీ స్తోత్రం చేయమని గురువు ఆదేశించాడు. గంధర్వులు గానం చేశారు. అప్సరోగణాలు నాట్యం చేశారు. దేవతలు, ఋషులు కలిసి యిలా ప్రార్థించారు – 'నాథా! త్రివిష్టపమైన స్వర్గానికి సురవైరులైన రాక్షసుల నుండి ప్రమాదం ఏర్పడింది. ప్రభూ! దేవేంద్రా! నీవు బయటికి వచ్చి ఈ జగత్తును రక్షించు. మమ్మల్ని కాపాడు. ఈ పద్మంలో దాక్కున్నావేమిటీ? ఎందుకిలా చేశావు.

వారి ప్రార్థన విని దేవతలందరూ వచ్చారని తెలుసుకొని పద్మనాళం నుండి బయటకు వచ్చి తలదించుకొని నేల చూపులు చూస్తూ గురువుగారి పాదాలపై బడ్డాడు. దైన్యంతో దేవేంద్రుడు బృహస్పతితో 'గురుదేవా! నేను ఆదిత్యులకు మేలు చేద్దామని మహాత్ముడైన గౌతమ మహర్షి తపస్సును భంగం చేయడానికి వెళ్ళి యిలా శాపాన్ని పొందాను' అని విన్నవించుకోగా బృహస్పతి నవ్వి 'దేవేంద్రా! నీవు కామంతో యీ పని చేశావు. నాకు తెలుసు'. అనగా ఇంద్రుడు తాను చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా తపస్సు చేయాలనుకున్నాడు. దేవగురువు అనుమతి తీసుకొని విష్వక్సేన సరస్సుకు వెళ్ళాడు. దాని క్రింది భాగంలో వజ్రంతో భూమిని త్రవ్వాడు. స్నానానికి, దేవపూజకు పాతాళం నుండి నీటిని తెచ్చాడు. అందువల్ల దానికి 'వజ్రతీర్థ' మని పేరొచ్చింది.

దేవేంద్రుడు పాలనే ఆహారంగా తీసుకుంటూ, క్రోధాన్ని

జయించి, కామాన్ని నిగ్రహించి, జితేంద్రియుడై, భూమిని తన కాలి బొటన వ్రేలితో నొక్కిపెట్టి, వేదమాతయైన గాయత్రీదేవిని నియమంగా జపిస్తూ వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. అతని తపస్సుకు శ్రీహరి సంతుష్టుడయ్యాడు. వరాహస్వామి భూదేవితో కూడ ప్రత్యక్షమై 'ఇంద్రా! సురేశా! నేను నీకు వరమివ్వడానికి వచ్చాను. నీ అభీష్టాన్ని కోరుకో. ప్రసాదిస్తాను' అని అనుగ్రహించగా దేవేంద్రుడూ భూవరాహస్వామికి నమస్కరించి 'ఓ దేవ దేవా! నీవు నాయందు సంప్రీతుడవయ్యావు. దయానిధీ! నాకు వరాన్ని ప్రసాదించు. నా పాపం పరిహారమయ్యేటట్లు అనుగ్రహించు. ఇదే నేను కోరే వరం. అని ప్రార్థించగా వరాహస్వామి 'తథాస్తు' అలాగే అగుగాక! అని ఇంద్రునికి కోరిన వరాన్ని ప్రసాదించి ఆ వృషభాద్రిలో అంతర్ధానమయ్యాడు. వెంటనే సహస్ర అయోనియైన ఇంద్రుడు భగవదనుగ్రహంతో సహస్రాక్షుడయ్యాడు. అద్భుతమైన రూపంతో విశాలాక్షియైన శచీదేవితో కూడా దివ్యమంగళవాద్యాలతో దేవతలందరూ ఆనందిస్తుండగా అమరావతిలో ప్రవేశించాడు. ఈ విధంగా దేవేంద్రుడు వరాన్ని పొంది వృషాద్రి శిఖరంపై అశ్వాలు పూన్చిన బంగారు రథాన్ని అధిరోహించి గంధర్వులు గానం చేస్తుండగా తన పట్టణానికి వెళ్ళాడు.

## విష్వక్సేనుని జననం

విచిత్రమైన కథను విన్న పార్వతీదేవి సంతోషంతో మరల పరమశివుని 'తత్త్వదర్శనా! విష్వక్సేనుని గురించి మీరు ప్రస్తావించారు. ఈ విష్వక్సేనుడెవరు? ఎక్కడివాడు? అతను ఎందుకొరకు తపస్సు చేశాడు? ఏమి వరాన్ని పొందాడు? ఈ విషయాలన్నీ నాకు చెప్పండి' అని అడుగగా విని మహేశ్వరుడు ప్రీతితో ఇలా చెప్పసాగాడు –

దేవీ! పార్వతీ! పూర్వం కృతయుగంలో 'కుంతల' అనే అప్సరస ఇంద్రునిచే ప్రేరేపించబడి సుందరమైన దుర్వాసుని ఆశ్రమానికి వెళ్ళి ఆత్మధ్యానంలో ఉన్న ఆ మహర్షి ఎదురుగా నాట్యం చేసింది. అంతట ఆయన కోపంతో ఎదురుగా ఉన్న ఆ సుందరిని చూచి 'ఓ దుర్బుద్ధీ! నీలిముంగురులు గల కుంతలా! నీవు కిరాతివి కమ్మని శపించాడు. అప్పుడామె శాపానికి భయపడి ఆయనకు చేతులు జోడించి నమస్కరించి 'మహాత్మా! నేను పరాధీనురాలను. కాబట్టి నా తప్పును క్షమించు' మని అంజలి ఘటించి వేడుకోగా దుర్వాసమహర్షి 'బాలా! నా మాట వ్యర్థం కాదు. నీకు శాపవిముక్తిని చెబుతాను. నీవు పుత్రుని ముఖం చూచి (పుత్రుడు కలిగిన తరువాత) మరల స్వర్గానికి వెళ్ళతావు' అని ఆమెకు శాపవిమోచనాన్ని చెప్పాడు.

దుర్వాసమహర్షి ఇలా చెప్పగా ఆమె వినయంతో మరల ఆయనను ప్రార్థించింది. 'మహర్షీ! మీ అనుగ్రహం వలన నేను విష్ణువు వంటి పరాక్రమం కలవాడు, దీర్ఘాయుష్మంతుడు, తపోనిధి అయిన పుత్రుని ప్రసవించునట్లు ఆశీర్వదించండ' ని వినయంగా ప్రార్థించగా మహర్షి 'తథాస్తు' అని దీవించాడు. ఆ కుంతల అనే అప్సరసే వీరబాహువనే కిరాతుని భార్యకు కుమార్తెగా జన్మించింది. చిరకాలం సంతానం లేని ఆ దంపతులు ఆమెకు 'సువర్చల' అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచారు. ఆమె వారికానందాన్ని కలిగిస్తూ పెరిగి పెద్దదయింది. ఆమె రూపలావణ్య, గుణాలలో మిన్నయై కన్యారత్నంగా విరాజిల్లింది. తండ్రి ఆమెను ధర్ముని పుత్రుడైన భద్రుని కిచ్చి వివాహం చేశాడు.

సువర్చల శ్యామల వర్ణంతో, ఉన్నతమైన వక్షస్థలంతో, సన్నని నడుముతో నవయౌవనవతియై శోభిస్తున్నది. ఒకానొకప్పుడు ఫాల్గుణ మాసం శుక్లపక్షంలో ఒక శుభదినాన ఋతుస్నాతయై నర్మదానదిలో స్నానం చేసి అక్కడికి సమీపంలోని కొండచరియపై నిలబడింది. ఆమెను చూసి వరుణుడు ఆమె యందనురక్తుడై ఆమెతో సంగమించాడు. ఆ తరువాత ఆమెతో 'ఓ సుందరీ! నేను సంతోషించాను. నీ కిష్టమైన వరం కోరుకో' అన్నాడు. అప్పుడు సువర్చల 'దేవా! మీరు సంతోషించినట్లైతే నాకు ఉత్తమ పుత్రుణ్ణి ప్రసాదించండి' అని వరం కోరింది. అంతట వరుణుడు 'కల్యాణీ! నీవు సత్పుత్రునికి తల్లివవుతావు' అని ఆమెకు వరం ప్రసాదించి ఆ జలాధిపతి వెళ్ళిపోయాడు. సువర్చల ఆయన పలుకులు విని చాల సంతోషించింది.

కొన్నాళ్ళకు సువర్చల మేలిమి బంగారు ఛాయతో, పూర్ణచంద్రుని వంటి ముఖము, పద్మాల వంటి కళ్ళు, శంఖం, ఖడ్గం, బాణం వంటి రేఖలతో కూడిన ఎర్రని చేతులు, పాదాలు గల పుత్రుని ప్రసవించింది. అప్పుడు దేవ దుందుభులు మ్రోగినై. ఆకాశం నుండి పుష్పవర్షం కురిసింది. అతడు పుట్టిన ఆ సమయంలో వాయువు సుఖంగా, చల్లగా వీచింది. అతడు పుష్యమీ నక్షత్రంలో కర్కాటక లగ్నంలో పుట్టాడు. ఆ సువర్చలాసుతుడు బలవంతుడై, వీర్యవంతుడై శుక్లపక్షచంద్రుని వలె వృద్ధి చెందాడు.

అతనికి పదవ సంవత్సరం రాగానే తల్లి సువర్చల చనిపోయింది. తండ్రి వదలివెళ్ళి పోయాడు. అందుచేత ఆ పిల్లవాడు కశ్యపమహర్షి ఆశ్రమానికి చేరాడు. వస్తూనే అతనిని చూసి కశ్యపమహర్షి ఆ పిల్లవాడు వరుణుని పుత్రుడని, రాజకుమారుడని, మహాత్ముడని తెలుసుకున్నాడు. సౌందర్య సౌకుమార్యాలుగల అతనిని ప్రీతితో తన శిష్యునిగా స్వీకరించి, అతనికి ఉపనయనం చేసి, గాయత్రీ మంత్రాన్నుపదేశించాడు. ఆ మహర్షి వలన మంత్రోపదేశం పొంది, షడంగాలతో వేదాలను అధ్యయనం చేసి, ఆయన అనుమతి పొంది, తపస్సు చేయడానికి వృషభాద్రికి వెళ్ళాడు.

ఆయనక్కడ అనేక నియమములు పాటిస్తూ చాలకాలం తపస్సు చేశాడు. ఆ విధంగా పన్నెండు సంవత్సరాలు

పూర్తయినాయి. ఆశ్వయుజ మాసంలో, శుభప్రదమైన పూర్వాషాఢ నక్షత్రంలో జనార్దనుడు ప్రత్యక్షమై ఆయనకు వరాన్ని ప్రసాదించాడు. ఆయన విష్ణుమూర్తి సారూప్యాన్ని, సైన్యాధిపత్యాన్ని పొందాడు. శంఖచక్రగదాపాణియై విష్ణువు ఆజ్ఞను పరిపాలిస్తూ పంచాయుధాల ఆశ్రమాలకు క్రింది భాగంలో ఉన్న తన ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ నుండి నారాయణాద్రికి వెళ్ళాడు. గంధర్వులు, పద్నాలుగు లోకపాలకులు, మహాబలవంతులు, పెద్ద ధ్వనిచేస్తున్న భూతగణాలు మెరుస్తున్న మొనలు గల ధగధగాయమానమైన ఆయుధాలు ధరించి ఆయనను అనుసరించారు. వారందరితో పాటు ఆయన ఆ పర్వతం నైఋతి మూల ఉన్నాడు.

పార్వతీ! నేను నీకు విష్వక్సేనుని జన్మవృత్తాంతాన్ని చెప్పాను. ఆశ్రమాల గురించి చెబుతూ మధ్యలో విష్వక్సేనుని ప్రస్తావన వచ్చింది. విష్ణువు ఆజ్ఞను పురస్కరించుకొని, విష్ణువుతో సమానమైన పరాక్రమం కలవాడై విష్వక్సేనుడు అవతరించాడు.,

## చక్రాది సప్తథ తీర్థ మాహాత్మ్యం

దేవీ! విష్వక్సేనుని ఆశ్రమంపైన ఐదు దివ్యసరస్సులున్నాయి. భగవంతుని పంచాయుధాలు నిత్యం ఆ ఐదు సరస్సులను ఆశ్రయించి ఉంటాయి. ఆ పర్వతంలో ఇప్పటికీ ఆ ఐదు సరస్సులు ఆ ఆయుధాల ఆకారాలతో కనబడుతుంటాయి. వాటికి పైన ఉన్న సరోవరంలో అగ్నిదేవుడు తపస్సు చేశాడు. ఆ సరస్సు వద్దకు కొండ ఎక్కి వెళ్ళడం చాల కష్టసాధ్యమైన పని. ఆ సరస్సు చాల లోతుగా ఉంటుంది. అది అగ్నితీర్థంగా, ఆగ్నేయ సరస్సుగా ప్రసిద్ధి చెందింది. అది తీర్థాలలో ఉత్తమోత్తమమైనది. పాపాలను నశింపజేస్తుంది. దానికి పైభాగంలో బ్రహ్మసరస్సు ఉంది. అది ఎంతో పవిత్రమైంది.

బ్రహ్మసరస్సుకు పైభాగంలో సప్తర్షుల ఆశ్రమాలు,సరోవరాలు ఉన్నాయి. ఈ పదిహేడు తీర్థాలలో ఒక్కొక్కటి పాపాన్ని పోగొడుతుంది. పార్వతీ! ఈ తీర్థాలను దర్శించినా, కీర్తించినా, (స్తుతించినా), వాటిల్లో స్నానం చేసినా, ఆ తీర్థం పానం చేసినా (ఆ తీర్థజలాన్ని త్రాగినా) అవి పాపాలను నశింపజేస్తాయి.

శంకరుడు ఈ విధంగా చెప్పగా విన్న పార్వతీదేవి భక్తవత్సలుడైన తన భర్త శంకరుని మరల యిలా అడిగింది. 'శంకరా! ఈ తీర్థముల మాహాత్మ్యాన్ని మొదటి నుండి చెప్పండి. ఈ తీర్థాలు పరమ పవిత్రమైనవి. పుణ్యాన్ని వృద్ధిజేసేవి. సర్వలోకాల హితం కోసం మీరు వాటి వైభవాన్ని వివరించండి! అని అడుగగా పరమశివుడు యిలా చెప్పసాగాడు.

'ఓ పద్మాక్షీ! పార్వతీ! పూర్వం దుర్వాసమహర్షి బ్రహ్మదేవుని అడుగగా ఆయన వీటి మాహాత్మ్యాన్ని వివరించాడు. దానిని నీకు చెబుతాను. విను.

**(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 86 వ కళ్యాణం

తేది 31-08-2025 ఆదివారం ఉదయం 10.30 నుండి జనప్రియ బంగ్లాస్, మచ్చబొల్లారం, అల్వాల్, సికింద్రాబాద్ నందు జరిగింది. దీనిని శ్రీమాన్ చింతల శ్రీనివాస్ రెడ్డి దంపతులు మరియు పోతుల సమయ్ రెడ్డి నిర్వహించారు.

## 87 వ కళ్యాణం

తేది 13-09-2025 శనివారం ఉదయం 10.35 నుండి హోటల్ ఎం.గ్రాండ్, వనస్థలిపురం, హైదరాబాద్ లో జరిగింది. దీనిని రియల్ బిజినెస్ మాట్రిక్స్ వారు శ్రీమాన్ ఎన్.శివప్రసాద్, శ్రీమతి ప్రొద్దుటూరి సాయిలీల, శ్రీమాన్ కొరిపార వంశీ, శ్రీమతి ఎ.సునీత నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది.

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



**గత సంచిక తరువాయి**

## బాలుని రూపంలో శ్రీవేంకటేశ్వరుడు

ఇలా పట్టుదలతో, ఇతరుల సాయం కోరకుండా, అంకిత భావంతో సేవ చేస్తున్న ఆ దంపతుల శ్రమను చూడలేని శ్రీనివాసుడు పదమూడేండ్ల పసివాని రూపంలో వచ్చి ''అయ్యా! మీరు త్రవ్వి పోసిన మట్టిని నేను మోసుకొని వెళ్తాను. నన్ను అనుమతించండి'' అని వేడుకున్నాడు. ఆ కుర్రవాడి సాయాన్ని తిరస్కరించిన అనంతాళ్వార్, తమ గురువాజ్ఞ ప్రకారం తామిర్వురూ ఆ కైంకర్యం నిర్వహిస్తున్నామనీ, భగవత్సేవలో తామెవరి సాయం తీసుకోబోమని, తమని విసిగించకుండా తక్షణం అక్కడినుంచి వెళ్ళిపొమ్మని ఆ బాలుణ్ణి కసురుకుంటాడు. అయితే కరుణామయుడైన శ్రీనివాసుడు ఎలాగైనా ఆ దంపతులకు సాయం చేయాలని గట్టిగా నిశ్చయించుకుంటాడు. ఇటు అనంతాళ్వార్ ధ్యాసంతా – త్వరగా చెరువు త్రవ్వి, పూదోటను పెంచి, ఎప్పుడెప్పుడు శ్రీవారికి పుష్పాలను అలంకరిద్దామా! – అని ఉండేది. భర్తే దైవంగా భావించిన భార్య కూడా, తన బాధనంతా ఓర్చుకుని, తనకూ, భర్తకూ కలిగిన శ్రీవారి సేవా భాగ్యానికి మురిసిపోతూ దైవకార్యంలో నిమగ్నమై ఉండేది. ఒకరోజు స్వామివారికి మనసాగక, బాలుని రూపంలో అనంతాళ్వార్ వెనుక ఉండి, ఆయన మట్టిని తట్టలో వేయగానే, పరుగుతో వెళ్ళి తట్టను ఖాళీ చేసి, ఖాళీ తట్టను అక్కడ పెట్టసాగాడు.

## శ్రీవారికి గాయం

అనుమానంతో వెనక్కి తిరిగి చూసిన అనంతాళ్వార్ కు ఆ పిల్లవాడు కనిపించాడు. వద్దన్నా పదే పదే తమ జోలికి వస్తున్న ఆ పిల్లవాణ్ణి తన చేతిలో ఉన్న గునపంతో కొట్టబోయాడు. ఆ పిల్లవాడు భయంతో, చేతిలో ఉన్న మట్టితట్టను అక్కడే వదిలేసి పరుగు లంకించుకున్నాడు. అయినా అనంతాళ్వార్ ఆ పిల్లవాడి వెంట పడ్డాడు. ఆ పరుగులో పిల్లవాడు చేతికి అందినట్టే అంది జారిపోతున్నాడు. శ్రీహరి అంత సులభంగా చిక్కుతాడా?

దాంతో కోపం ఆపుకోలేని అనంతాళ్వార్ విసిరిన గునపం ఆ పిల్లవాడి గడ్డానికి తగిలింది. బొటబొటా కారుతున్న రక్తంతోటే ఆ బాలుడు పరిగెత్తుకుంటూ ఆనందనిలయంలోకి జొరబడి కనబడకుండా దాక్కుంటాడు. వెదకి వేసారిన అనంతాళ్వార్ వెనుదిరుగుతాడు.

అనంతాళ్వార్, ఆ రోజు సాయం సమయంలో పుష్పమాలలతో ఆనందనిలయంలోకి వెళ్ళేటప్పటికి, వేంకటేశ్వరస్వామికి గడ్డం వాచి, రక్తం పెచ్చుకట్టి ఉంది. అది చూసిన అర్చకులు హడలిపోతారు. స్వామివారి గాయాన్ని చూసిన అనంతాళ్వార్ కు తాను చేసిన ఘోర తప్పిదం తృటిలో అర్థమై, స్వామిని క్షమించమని ప్రాధేయపడ్డాడు.

## పచ్చకర్పూరం బొట్టు

అప్పట్లో తన భక్తులతో నేరుగా మాట్లాడే శ్రీనివాసుడు, వ్యాకులతతో ఉన్న అనంతాళ్వార్ ను సమాధాన పరుస్తున్నట్లుగా అర్చకులతో, ''నా భక్తుడు గునపంతో కొట్టగా ఏర్పడిన గాయం మీద పచ్చకర్పూరపు బొట్టు పెట్టండి. రాబోయే తరాలలో నా భక్తులు నా గడ్డం మీద పచ్చకర్పూరపు బొట్టును చూసి, అది అనంతాళ్వార్ అనే భక్తుడు కొట్టిన దెబ్బ అని చెప్పుకుంటుంటే,

అది విని నేను మురిసిపోతాను'' అని చెప్పి తన భక్తప్రియత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా స్వామివారు, అనంతాళ్వార్ యొక్క నిరుపమాన భక్తిని ఆవిధంగా లోకానికి చాటి చెప్పారు. స్వామివారి ఆజ్ఞానుసారం ఆ సంఘటనకి గుర్తుగా, నేటికీ ప్రతిరోజూ, శ్రీవారి గడ్డం మీద పచ్చకర్పూరంతో అలంకరిస్తారు. శ్రీవారి దివ్య మంగళ విగ్రహాన్ని మదిలోనే ఊహించుకొని, వారి గడ్డంపై నిత్యం ఉండే తెల్లటి మచ్చను తలచుకోండి. దాని వెనుక ఉన్న మర్మం ఇదే.

## అనంతాళ్వార్ గడ్డపార

శంఖనిధి – పద్మనిధి దాటుకుని ఆలయంలోకి వెళుతూ ఉంటే, మహాద్వారపు ఉత్తర గుమ్మం మీద నేటికీ అనంతాళ్వార్ విసిరిన గునపాన్ని మనం చూడవచ్చు.

స్వామివారి గడ్డానికి తగిలిన దెబ్బకు గుర్తుగా, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో, ధ్వజారోహణ జరిగిన మరునాడు, స్వామివారికి ''భాగ్ సవారీ'' అనే ఉత్సవం జరుగుతుంది. నాడు అనంతాళ్వార్ తరుముకు వస్తుంటే స్వామి ఎలా పరుగుపెట్టారో, ఆ ఉత్సవం రోజు స్వామి పల్లకీ అలా పరుగు పెడుతుంది.

ఆ ఉత్సవం పూర్తి విశేషాలను ''సంవత్సరోత్సవాల్లో'' విశదీకరించబడినది.

అన్నమాచార్యుడు కొండల్లో నెలకొన్న అనే కీర్తనలో

**"అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి**
**ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు"**

అంటూ అనంతాళ్వార్ గాథను ప్రస్తుతించారు. అనంతాళ్వార్ గునపం దెబ్బకు శ్రీవారు గాయపడ్డ ఉదంతం తరువాత, వేంకటేశుని సంపూర్ణ అనుగ్రహానికి పాత్రుడైన అనంతాళ్వార్, చెరువును త్రవ్వడం అత్యంత శీఘ్రంగా పూర్తి చేయగలిగాడు.




తన గురువుగారైన భగవద్రామానుజుల వారిని స్మరింపచేసే విధంగా, ఆ ఉద్యానవనానికి శ్రీరామానుజోద్యానవనం అని పేరు పెట్టాడు. కాలక్రమంలో ఆ తోట శ్రీవారికి కావలసిన సమస్త పుష్ప రాశులనూ సమకూర్చగలగడమే కాకుండా, అత్యంత అరుదైన పుష్పజాతులతో తిరుమల క్షేత్రానికే ప్రధానాకర్షణగా నిలిచింది.

అనంతాచార్యుని ఆలోచనలన్నీ ఆనందనిలయం మీదే ఉండేవి. శ్రీనివాసుణ్ణీ, శ్రీమహాలక్ష్మినీ రంగు రంగుల పుష్పాలతో పలు విధాలుగా అలంకరించినట్లు, పాదపద్మాలకు పూలు సమర్పించినట్లు, పరంధాముణ్ణీ, పద్మావతీ అమ్మవారినీ పూలపల్లకిలో ఊరేగించినట్లు పరిపరి విధాల ఆలోచనల్లో మునిగి ఉండేవాడు. చిగురించే చెట్టును చూసినా, పూచే పుష్పాన్ని చూసినా శ్రీవారిని పుష్పగుచ్ఛాలతో ముంచెత్తినట్లు అనుభూతి చెందేవాడు.

ఇలా అనంతాళ్వార్ మనసా, వాచా, కర్మణః, శ్రీవారి పుష్పకైంకర్య సేవలో తలమునకలై ఉన్న తరుణంలో, సపరిచర్యలతో సంతృప్తి చెందిన శ్రీవారి ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. 'ఈ దండలే ఇంత మనోహరంగా ఉంటే, ఈ పూవులు పూచే తోట ఇంకెంత ఆహ్లాదకరంగా ఉంటుందో? ఏమైనా సరే, తన భక్తుడు అత్యంత భక్తిభావంతో పెంచుతున్న పూదోటను ప్రత్యక్షంగా చూసి తీరాల్సిందే! అని సంకల్పించారు.

ఒకనాటి రాత్రి ఏకాంతసేవా కార్యక్రమం ముగిసిన తరువాత, స్వామివారు అలమేల్ మంగా సమేతంగా, విహార నిమిత్తం అనంతాళ్వార్ తోటకు ఏతెంచారు. కన్నుల పండువగా ఉన్న పుష్పవనాన్ని చూసి పరవశించిపోయిన శ్రీవారు, కనిపించిన పువ్వునల్లా కోసి అమ్మవారి తలలో తురిమాడు. కొన్నింటిని తాను స్వయంగా ధరించి, మరికొన్నింటిని ఆఘ్రాణించాడు. అమ్మవారు కూడా, అయ్యవారికి ఏమాత్రం తీసిపోకుండా, ప్రతి మొక్క వద్దకూ వెళ్ళి, పువ్వులు పరిమళాల్ని ఆస్వాదించి, వాటిని కోసి స్వామివారికిచ్చింది. ఇలా పూదోట సోయగంలో మైమరచి, చెట్టాపట్టాలేసుకుని తిరిగి, ఆ జంట సుప్రభాత సమయానికి ఆనంద నిలయం తిరిగి చేరారు.

తెల్లవారిన తరువాత, తోటలో ప్రవేశించిన అనంతాళ్వార్ కి మతిపోయినట్లైంది. ఎక్కడ చూసినా, నలిపి పడేసిన పూలు, విరిగిన కొమ్మలు, రాలిన మొగ్గలు, తెగిపడిన ఆకులతో తోటంతా భీభత్సంగా ఉంది. ఉగ్రుడైన అనంతాళ్వార్, తోట ఆ పరిస్థితిలో ఉండటానికి కారణమైనవారిని శాపనార్థాలు పెడుతూ, దోషులను ఎలాగైనా పట్టుకోవాలనే కృత నిశ్చయంతో, తన శిష్యులను తోటకు కాపలా ఉంచాడు. కాని ఎంతకూ దొంగలు దొరకలేదు. పుష్పచౌర్యం యథావిధిగా కొనసాగుతూనే ఉంది. ఇక లాభం లేదనుకుని, కంటి మీద కునుకు లేకుండా, తనే కాపలా కాసేవాడు. ఎన్నాళ్ళకూ దొంగ దొరకక పోవడంతో తల్లడిల్లిపోయిన అనంతాళ్వార్, తన పుష్పకైంకర్యానికి ఎలాంటి విఘాతం రానివ్వవద్దని కన్నీళ్ళతో స్వామిని వేడుకున్నాడు. భక్తుడి కన్నీటికి కరిగిపోయిన శ్రీనివాసుడు, అనంతాళ్వార్ భక్తిని లోకానికి తెలియచెప్పాలనుకొన్నాడు.

అదలా ఉండగా, తోటలో పహరా కాస్తున్న అనంతాళ్వార్

కు, ఓ నడిరాత్రి సమయంలో, తోటలో సంచరిస్తున్న రెండు మానవాకారాలు కనిపించాయి. సుందర, సుకుమార శరీరాలతో, రాచఠీవి ఉట్టిపడే ముఖవర్చస్సుతో ఉన్న ఈ జంట రాజదంపతులేమో? అయినా, 'ఎవరైతే నాకేంటి? స్వామివారికి అర్పించాల్సిన పుష్పాలను చిందర వందర చేస్తున్న వీళ్ళను ఏమాత్రం ఉపేక్షించకూడదు' ఆ విధంగా మనసులో తలపోస్తూ, స్వామిని చేజిక్కించుకోబోయాడు. ఇంద్రాది దేవతలకు, సనకాది మహర్షులకు చిక్కని చిద్విలాసుడు, ఈ బడుగు బాపడికి బందీ అవుతాడా? సంధించిన బాణంలా సాగిపోయాడు. పారిపోతున్న పెనిమిటిని చూసి అచ్చెరువొందిన జగజ్జనని అనంతాళ్వార్ చేతికి చిక్కింది. ఉక్రోషం ముంచుకొచ్చిన అనంతాళ్వార్, చేజిక్కిన సిరుల తల్లిపై ప్రశ్నల వర్షం కురిపించాడు. ''మీరు యక్ష, కిన్నెర, గంధర్వులా? యతీంద్రులా? ఒకవేళ మానవులయితే, గొప్పింటి బిడ్డల్లా ఉన్నారు. మీకిదేం బుద్ధి? శ్రీవారి కైంకర్యానికి ఉపయోగించే ఈ సుకుమార కుసుమాల్ని ఛిద్రం చేయటానికి మీకు చేతులెలా వచ్చాయి? మీ సరస, సల్లాపాలకు నా తోటే కావలసి వచ్చిందా? ఎక్కడుంటారు మీరు? నీ మగని పేరేమిటి? భార్య కోసం రాని భర్త ఉంటాడా? అందులోనూ నీలాంటి ముగ్ధమనోహరి కోసం రాకుండా ఎక్కడికి పోతాడు?'' ఇలా తన ఆక్రోశాన్నంతా వెళ్ళగ్రక్కుతూ, తన ఉత్తరీయంతో అమ్మవారిని తోటలోనే ఉన్న ఓ సంపంగి మానుకు కట్టేశాడు.

కలవరపాటుకు గురైన అమ్మవారు, వాత్సల్యం ఉట్టిపడే మృదువైన స్వరంతో ''నాయనా! నీ బిడ్డలాంటి నన్ను విడిచిపెట్టు. నేను వారిస్తున్నా వినకుండా నా మగడే నన్నీ తోటకు తోడ్కొని వచ్చాడు. నా మగని పేరు నేనెట్లా ఉచ్చరింపగలను? ఏ స్త్రీ అయినా తన పతిదేవుని పేరును పెదాలతో పలుకగలదా? ఓ పట్టాన ఆయన ఎవరికీ దొరకడు. అందుగల డిందు లేడనలేని వాడు ఎక్కడుంటాడని చెప్పగలను? ఎంతమంది ఎన్ని రకాలుగా పిలిచినా పలికే సర్వాంతర్యామి ఆయనే'' అంటుంది.

**''ఇందు కలడందు లేడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూసిన**
**అందందే గలడు''**

అమ్మవారి మాటలకు ఆగ్రహం హద్దులు దాటిన అనంతాళ్వార్ ''చాలా గడుసుగా మాట్లాడుతున్నావమ్మా! ఎలా రాకుండా ఉంటాడో నేనూ చూస్తాను'' అంటూ తోట వెలుపలికి వెళ్ళి పరికించాడు. తోట బయట తచ్చాడుతున్న ఆ ఆకతాయి వెంట బడతాడు. ఆ పురుషుడు తోటనుంచి ఆనందనిలయానికి దక్షిణపు వీధిలో ప్రవేశించి ఆలయానికి అప్రదక్షిణంగా పారిపోతుండగా, అనంతాళ్వార్ అతన్ని తరుముతూ వెంటబడ్డాడు. శ్రీవారి ఆలయం ముందు, పుష్కరిణి దగ్గర, ఉత్తర – పశ్చిమ మాడ వీధుల్లో, అడ్డదిడ్డంగా పరిగెత్తిన ఆ దొంగ మళ్ళా అనంతాళ్వార్ తోటను సమీపించి అదృశ్యమయ్యాడు. విసిగి వేసారిని అనంతాళ్వార్ ''తెల్లవారిన తర్వాత దొంగ సంగతి చూద్దాం'' అనుకుంటూ, అమ్మవారి పాదాల చెంత కునుకు తీశాడు. ఏ తల్లి కరుణా కటాక్షం కోసం సమస్త జగత్తూ అనుక్షణం పరితపిస్తూ ఉంటుందో, అటువంటి అమ్మను బందీ చేసి ఆమె పాదాల చెంత రాత్రల్లా పడుకున్నాడు అనంతాళ్వార్!

ఇంతలో భళ్ళున తెల్లవారడంతో బంగారు వాకిళ్ళను తెరిచిన అర్చకస్వాములు, వక్షఃస్థల లక్ష్మి కనపడకపోవడంతో వణికిపోయారు. స్వామివారు సౌమ్యంగా ''అర్చక శిఖామణులారా! ఆందోళన చెందకండి. అనంతాళ్వార్ రాత్రంతా అమ్మవారిని కట్టేశాడు. ఆయన్ను వేడుకొని, అమ్మవారిని తోడ్కొని రండి'' అని సెలవిచ్చారు. అర్చకులు వేదమంత్రాల తోటి, మంగళవాయిద్యాల తోటి అమ్మవారి కోసం తరలి వెళ్ళారు. చెట్టుకు కట్టివేయబడి, బేలగా, మగని రాక కోసం వీక్షిస్తున్న లక్ష్మీదేవిని చూసి అచ్చెరువొందిన అర్చకులు అనంతాళ్వారుతో ''ఎవరిని కట్టేశావో తెలుసా? సమస్త జగత్తునూ శాసించగలవాడి భార్య ఆవిడ. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు యొక్క శక్తి స్వరూపాన్ని నువ్వు కట్టేశావు. శ్రీవారు ఆమెని తోడ్కొని రమ్మన్నారు'' అని స్వామి ఆదేశం వినిపించారు. తన తప్పు తెలుసుకున్న అనంతాళ్వార్ ''అయ్యో ఎంత అపరాధం చేశాను? అనుక్షణం కొలిచే ఈ చేతులతోనే నిన్ను కట్టిపడేశాను'' అని సాష్టాంగ నమస్కారం చేశాడు. జరిగిన తొందరపాటుకు పశ్చాత్తాపం ఒకవంక, అమ్మవారి సాక్షాత్కారానికి నోచుకున్న భాగ్యానికి అంతులేని ఆనందం వేరొక వంక! ఇలా పలు భావనలు ముప్పిరిగొనగా, అశ్రునయనాలతో అమ్మవారికి మనసారా నమస్కరించి, జరిగిన తప్పిదానికి క్షమార్పణ కోరి, ఆడపిల్లను అల్లుని చెంతకు చేర్చే విధంగా, ఓ బుట్టలో తోటలోని పువ్వులను అమర్చి, అమ్మవారిని వాటిపై ఆసీనురాలిని చేసి, బుట్టను శిరస్సునుంచుకుని, వగర్చుతూ వగర్చుతూ, అమ్మవారిని శ్రీవారి పాదాల చెంతకు చేర్చి, తెలియక చేసిన తప్పును మన్నించమని వేడుకుంటూ శ్రీవారి పాదాక్రాంతుడయ్యాడు.

అప్పటివరకూ వినోదం చూస్తున్న శ్రీనివాసుడు ''మామగారూ రండి'' అని అనంతాళ్వార్ ను ఆప్యాయంగా ఆహ్వానించి, ''నా భార్యను నీ ఇంట్లో ప్రేమతో కట్టేసుకున్నావు. పూలబుట్టలో కూర్చోబెట్టి స్వంత కూతురిలా నా చెంతకు చేర్చావు. చందన తాంబూలాలు స్వీకరించు. పిల్లనిచ్చిన మామగారివి కదా!'' అంటూ అనంతాళ్వార్ కు గంధం రాసి, పుష్పమాలలు వేసి, పట్టుబట్టలు పెట్టాడు. అనుకోని కొత్త చుట్టరికంతో అనంతాళ్వార్ ఆనందానికి ఎల్లలు లేవు. భక్తి పారవశ్యంతో శ్రీవారిని వేనోళ్ళ కీర్తిస్తూనే ఉన్నాడు.

అలా స్వామివారి చేత మామా అని పిలిపించుకొన్న ధన్యజీవి ఆ అనంతాళ్వార్.

ఆ పూలగంపలోని అమ్మవారు యథాప్రకారంగా బంగారు ప్రతిమయై శ్రీవారి వక్షఃస్థలాన్ని తిరిగి అలంకరించారు. అలా అనంతాళ్వార్ పుణ్యమా అని, ఒక్కరాత్రిలోనే మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారికి శ్రీవారితో వియోగము, పునఃసంగమము కలిగాయి.

అనంతాళ్వార్ త్రవ్విన చెరువు ప్రక్కన ఉన్న వసతి గృహాల్ని ''అనంతాళ్వార్ టాంక్ కాటేజెస్ (ఎ.టి.సి)'' గా వ్యవహరిస్తారు. ఆనాడు ఆ పుణ్యమూర్తి ఒంటరిగా తవ్విన ఆ చెరువు ఈనాడూ లక్షలాది యాత్రికుల దాహార్తిని తీర్చుతూ ఉంది.

84 సంవత్సరాల సుదీర్ఘకాలం జీవించి శ్రీవారి సేవకే అంకితమైన ఆ అనంతాచార్యులు స్వామివారి సన్నిధిలోనే పరమపదం చేరుకున్నారు. ఆయన నడయాడిన స్వగృహాన్ని మహాప్రదక్షిణ మార్గంలో నైఋతి మూలలో చూడవచ్చు. ఆయన ఇంటి ప్రాకారం మీదా, తోటలో ఉన్న మండపంలోనూ, అనంతాళ్వార్, ఆయన భార్యా బిడ్డలు, సేవకుల చిత్తరువులు దర్శించుకోవచ్చు. ఆయన ఇంటికి వెనుకగా, నేటికీ ఉన్న ఓ దిగుడు బావి నీటినే అనంతాళ్వార్ తన అనుష్ఠానానికీ, ఆరాధనకూ ఉపయోగించేవారు.

అనంతాళ్వార్ ఇంటి వెనుకగా ఉన్న తోటలో ఆయన సమాధిని (బృందావనం) మనం దర్శించవచ్చు. ఈ బృందావనం నుంచి ఉద్భవించిన పొగడమాను ఎండిపోయి, దాని పాదులో ఓ వటవృక్షం వృద్ధి చెందుతూ ఉంది.

బ్రహ్మోత్సవాల వంటి ప్రత్యేక సమయాల్లో, ఆలయ మహాప్రదక్షిణ మార్గంలో ఊరేగుతున్నప్పుడు, అనంతాళ్వార్ ఇంటివద్ద కర్పూరహారతి అందుకున్న తరువాతనే ఆనందనిలయుడు ముందుకు సాగుతాడు.

భక్తునికీ, భగవంతునికీ ఉన్న ఈ విడదీయరాని బంధం – ఎన్నెన్నో జన్మల అనుబంధం!

అనంతాళ్వార్ జ్ఞాపకాలన్నింటినీ పదిలపరుస్తూ, భావితరాల కోసం భద్రపరుస్తున్న తి.తి.దే వారి కృషి శ్లాఘనీయం.

## ఆది వరాహ స్వామి ఆలయం

ఒకప్పుడు బ్రహ్మదేవుడు సృష్టి కార్యక్రమంలో క్షణం తీరిక లేకుండా, ఒక పగలంతా (బ్రహ్మ దేవునికి ఒక పగలంటే వేయి మహాయుగాలు కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్ని కలిపి సమిష్టిగా ఒక మహాయుగం అంటారు) శ్రమించిన తరువాత అలసటతో ఓ కునుకు తీస్తాడు. దాంతో ఆయన సృష్టించిన జగత్తంతా అల్లకల్లోలమై, సూర్యచంద్రులు గతులు తప్పి, కుంభవృష్టితో జలప్రళయం సంభవించింది.

అదే అదనుగా తీసుకుని, హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూమండలాన్ని పాతాళానికి తీసుకువెళ్ళి భయోత్పాతం సృష్టిస్తాడు. ఇంద్రాది దేవతల కోరిక మేరకు, శ్రీమహావిష్ణువు శ్వేతవరాహ రూపునిగా అవతరించి, భీకరంగా జరిపిన యుద్ధంలో హిరణ్యాక్షుణ్ణి సంహరించి, తన కోరలతో భూమిని తిరిగి పైకెత్తి సృష్టినంతటినీ యథాస్థితికి తెస్తాడు.

అనంతరం ఆదివరాహస్వామి, తన చెంతనే భక్తితో నిలబడి ఉన్న, తన వాహనమైన గరుత్మంతుణ్ణి, ''పక్షిరాజా! భూదేవిని ఉద్ధరించడం వల్ల ఆమె నన్ను పతిగా వరించింది. యుగ ధర్మానుసారం నేనందుకు అంగీకరించాను. ఇక్కడే కొంతకాలం ఉండి, భూలోకాన్ని పరిరక్షించవలసిన బాధ్యత నాపై నున్నది. అందువలన నీవు వైకుంఠానికి వెళ్ళి నా క్రీడాచలాన్ని సత్వరమే తోడ్కొని రా'' అని ఆజ్ఞాపించాడు.

అంత ఆ పక్షీంద్రుడు వైకుంఠానికి వెళ్ళి లక్ష్మీదేవికి వైకుంఠనాథుని ఆదేశాన్ని విపులంగా విన్నవించాడు. శ్రీమహాలక్ష్మి తాను కూడా స్వామి చెంతకు చేరాలని సంకల్పించుకుని, తన మూల స్వరూపాన్ని వైకుంఠంలోనే ఉంచి, మరొక అంశతో భూలోకానికి బయల్దేరింది. జగన్మాతతో కూడిన క్రీడాచల పర్వతాన్ని తీసుకుని భూలోకానికి చేరుకున్న పక్షీంద్రుడు, స్వామివారి ఆనతి ననుసరించి, క్రీడాచలాన్ని సువర్ణముఖీ నది ఉత్తర భాగంలో ప్రతిష్ఠించాడు. ఈ నది ఒడ్డునే నేడు శ్రీకాళహస్తీశ్వరుడు కొలువై ఉన్నాడు.

శ్వేతవరాహుడు భూదేవీ సమేతంగా క్రీడాపర్వతాన్ని అధిరోహించి, దైత్య సంహార నిమిత్తం తాను ధరించిన శత్రుభయంకర రూపంలోనే పుష్కరిణికి పడమటి గట్టున కొలువు తీరాడు. కాలాంతరాన ఆ క్రీడాచలమే తిరుమల క్షేత్రంగా భాసిల్లుతోంది.

బ్రహ్మాది దేవతలు ఆదివరాహుణ్ణి స్తుతించి, ''స్వామీ! తమరీ భీకరమైన రూపాన్ని త్యజించి, సౌమ్యరూపం దాల్చి, ఈ పర్వత శ్రేణులపైనే స్థిరనివాసమేర్పరచుకొని, ప్రజలకు దర్శనభాగ్యం కల్పించండి. భక్త జనులకు ధ్యాన–కర్మ యోగాలను బోధిస్తూ, దివ్య మహిమలతో కూడిన మీ లీలలను చాటుతూ ఉండండి'' అని వేడుకున్నారు.

దేవతల మొర నాలకించిన ఆదివరాహుడు, భూదేవీ సమేతంగా దివ్యకాంతుల ప్రకాశంతో ఉన్న ఓ విమాన గోపురం కలిగిన భవనం లోకి ప్రవేశిస్తాడు. అంతలోనే ఆ విమాన గోపురం అంతర్థానమై, ఆ భవనమే నేడు శ్రీవారి పుష్కరిణి ఒడ్డున, పడమర మాడవీధిలో, ''ఆదివరాహస్వామి ఆలయం''గా ప్రసిద్ధి చెందింది. అలాగే తిరుమల, ఆదివరాహ క్షేత్రమని, తిరుమలలో మొట్టమొదటి దైవం ఆదివరాహుడు లేదా శ్రీవరాహస్వామి అని, తిరుమల క్షేత్రాధిపతి వరాహస్వామి అని భావిస్తూ ఉంటారు.

ఆ తర్వాత కొంతకాలానికి వైకుంఠం నుండి భూలోకానికి వచ్చి, తిరుమలలోని ఓ పుట్టలో నివాసముంటూ, గొల్లవాని గొడ్డలి దెబ్బతో బయటికి వచ్చిన శ్రీనివాసుడు, అప్పటికే శేషాచలానికి అధిపతియైన వరాహస్వామిని, తన శాశ్వతనివాసం నిమిత్తం కొంత స్థలాన్ని దానంగా అడుగుతాడు.

ఆదివరాహుడు విధించిన – ప్రథమ దర్శనం, ప్రథమ పూజ, ప్రథమ నైవేద్యం — అనే షరతులకు అంగీకరించి, ఆ నియమాలతో కూడిన ఓ దానపత్రాన్ని రాసిచ్చి శ్రీనివాసుడు వంద గజాల స్థలాన్ని దానంగా పొందుతాడు. బ్రాహ్మీలిపిని బోలిన లిపిలో లిఖించబడిన ఈ దానపత్రాన్ని (ఆంగ్లభాషలో గిఫ్ట్ డీడ్), వరాహస్వామి ఆలయంలో నిక్షిప్తమై యున్న ఒక చతురస్రాకార ''రాగిపలక యంత్ర'' రూపంలో నేటికీ చూడవచ్చని చెపుతుంటారు.

తరువాతి కాలంలో, ''ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి'' అన్న చందంగా శ్రీనివాసుడు, తన ప్రాబల్యాన్ని అపరిమితంగా పెంచుకున్నాడు. అయితే ఆనాడు శ్రీనివాసుడు అంగీకరించిన షరతులకు లోబడి, ఇప్పటికీ తిరుమల క్షేత్రంలో ప్రథమపూజ, ప్రథమ నైవేద్యం వరాహస్వామికే చేయబడతాయి. క్షేత్ర సాంప్రదాయాన్ననుసరించి, వరాహస్వామి దర్శనానంతరం మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి. అప్పుడే తిరుమలయాత్ర సంపూర్ణంగా ఫలప్రదమవుతుంది. ముందుగా వరాహస్వామిని దర్శించకపోతే, సాక్షాత్తూ శ్రీనివాసుడు అంగీకరించిన షరతును ఉల్లంఘించటమే అవుతుందని భక్తుల విశ్వాసం.

**''వరాహ దర్శనాత్పూర్వం శ్రీనివాసం సమేన్నచ**
**దర్శనా త్స్వ గ్వరా హస్య శ్రీనివాసో న తృష్యతి''**

వరాహస్వామి ఆలయం — ముఖమండపం, అర్ధమండపం, అంతరాళం, గర్భాలయం — అని నాలుగు భాగాలుగా, మూడు ప్రాకారాలతో నిర్మింపబడింది. గర్భాలయం మధ్యలో ఒక అడుగు ఎత్తైన శిలావేదికపై, రెండడుగుల భూవరాహస్వామి విగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఈ స్వామి పై రెండు చేతులలో శంఖు చక్రాలతో, ఎడమ తొడపై భూదేవిని కూర్చుండబెట్టుకుని చెవిలో తత్త్వబోధ చేస్తూ, ఊర్ధ్వపుండ్రంతో విరాజిల్లుతుంటారు. ఆలయంలో ధ్వజస్తంభం లేనందున, వరాహస్వామికి ప్రత్యేకంగా ఉత్సవాలు జరిపించే సంప్రదాయం లేదు. శ్రీవారు మరియు వరాహస్వామి అభిన్నులవటం చేతనూ, ఇద్దరిదీ శ్రవణా నక్షత్రం అవటం వల్లనూ, ఆనందనిలయవాసునికి జరిగే సమస్త ఉత్సవ కైంకర్యాలు వరాహునికి జరిగినట్లే అని అనూచానంగా వస్తున్న నమ్మిక.

ఈ ఆదివరాహస్వామి ఆలయ చరిత్ర, శ్రీవేంకటేశ్వర కళ్యాణంతో ముడిపడి ఉంది. మానవరూపం దాల్చి ఉన్న శ్రీనివాసుడు, పద్మావతితో పరిణయం జరిగే నాటికి, కళ్యాణ ఖర్చులకు సైతం పైకం లేని నిరుపేద. ఆకాజరాజు కూతురితో వివాహం అంటే ఆడంబరంగా జరగాలి మరి! చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏం చేయాలో తోచక మథనపడుతూ ఉంటే, స్నేహితుడైన శివుని సిఫారసు మేరకు, కావలసిన పైకాన్ని ఋణంగా ఇవ్వడానికి కుబేరుడు సంసిద్ధుడవుతాడు.

అక్షరాలా పదునాలుగు లక్షల రామచంద్ర ముద్రలు కలిగిన బంగారు కాసులు అప్పుగా ఇచ్చేట్లు ఒప్పందం ఖరారైంది. ప్రతి నూరు కాసులకీ ఒక కాసు వడ్డీ చెల్లించటానికి, ఋణమొత్తాన్నీ యుగాంతంలో తీర్చివేయడానికి స్వామివారు అంగీకరించారు. ఈ చర్చోపచర్చలూ, రాతకోతలూ అన్నీ ఆదివరాహ క్షేత్రంలోని అశ్వత్థ వృక్ష నీడలో, హేవిళంబి నామ సంవత్సర, చైత్రశుద్ధ దశమినాడు జరిగాయి.

పై షరతులన్నీ అంగీకరిస్తూ, స్వామివారు కుబేరునికి రాసి ఇచ్చినట్లుగా చెప్పబడుతున్న ఆ కాలపు ప్రామిసరీ నోటు, ఈమధ్య కాలం వరకూ వరాహస్వామి ఆలయకుడ్యంపై వ్రేలాడుతూ ఉండేది. ఇటీవలే దాన్ని తిరుమలలోని వస్తు ప్రదర్శనశాలకు తరలించారు.

కుబేరుని షరతులు అంతటితో అయిపోలేదు. సాక్షి సంతకం కావాలన్నాడు. మొదట బ్రహ్మదేవుడితో సంతకం పెట్టించగా, ''కుమారుడి సంతకమేం చెల్లుతుంది?'' అంటూ పెదవి విరిచాడు. శివుడి సంతకం ప్రతిపాదిస్తే, ''ముచ్చటగా మూడో సంతకం కూడా కావాల''న్నాడు. తదుపరి ''సత్యనిష్ఠకు మారుపేరైన అశ్వత్థ వృక్షాన్ని సాక్ష్యంగా అంగీకరిస్తా''నన్నాడు. చివరికి ముగ్గురి చేతా సాక్షి సంతకాలు పెట్టించిన తరువాతే, ఋణమొత్తం శ్రీనివాసుని చేతికిచ్చాడు. అప్పుకోసం సాక్షాత్తూ ఆ లక్ష్మీ వల్లభుడికే ముప్పుతిప్పలు తప్పలేదు. కలి మహిమ కాకుంటే మరేంటి?

నాటికీ, నేటికీ అప్పిచ్చేవాడికి, అప్పు తీసుకునేవాడంటే లోకువే మరి. సవాలక్ష షరతులకు తల వంచాల్సిందే. అయితే, సత్యసంధుడైన శ్రీనివాసుడు ఆ షరతులన్నింటినీ తరతరాలుగా నెరవేరుస్తూనే ఉన్నాడు. నేటితరం మానవుల వలె ఎగవేయడానికి ఎత్తులు వేయడం లేదు.

శ్రీవరాహస్వామికి ఆగమ శాస్త్రానుసారం, ప్రతిరోజూ మూడుపూటలా అర్చనలు, నివేదనలు జరుపబడతాయి. అన్నప్రసాదాలన్నీ శ్రీవారికంటే ముందుగా, వరాహస్వామికి నివేదింపబడతాయి. అలాగే ప్రతి శుక్రవారం తెల్లవారు ఝూమున అభిషేకం జరుపబడుతుంది.

ప్రతి బ్రహ్మోత్సవం చివరి రోజున ''చక్రస్నానం'' సందర్భంగా, ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామి, చక్రత్తాళ్వార్ (స్వామివారి బంటుగా భావింపబడే సుదర్శనచక్రం) తో

సహా వరాహస్వామి ఆలయంలోకి వేంచేస్తారు. పంచామృత స్నపన తిరుమంజనం తరువాత పుష్కరిణిలో చక్రస్నానం జరుపబడుతుంది. అయితే రథసప్తమి, ముక్కోటి ద్వాదశినాడు శ్రీ చక్రత్తాళ్వార్ మాత్రమే మందిరంలోకి వేంచేసి పుష్కరిణిలో స్నానం చేస్తారు.

వేర్వేరు శాసనాల్లో వరాహస్వామి "వరాహ నాయనార్" గానూ, "జ్ఞానప్పిరాన్" గానూ పేర్కొనబడ్డారు. 1982 సంవత్సరంలో, ఆలయానికి జరిగిన మహా సంప్రోక్షణ కార్యక్రమ సందర్భంగా, శ్రీవరాహస్వామి వారి ఆలయం చుట్టూ మకరతోరణ నిర్మాణం, ఆలయంపై పెద్ద విమాన నిర్మాణం మరియు బంగారు కలశ స్థాపన జరిగింది.

ఆ దేవదేవుడు ఒప్పుకున్న షరతుల్ని పాటించాల్సిన బాధ్యత, వారి భక్తులుగా మనందరి మీదా ఉంది.

శ్రీవారి నిత్యోత్సవాలు మరియు వారోత్సవాల గురించి మనం ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇవే కాకుండా స్వామివారికి పక్ష, మాస, సంవత్సరోత్సవాలు కూడా లెక్కకు మిక్కిలిగా జరుగుతూనే ఉంటాయి. వాటిలో పక్షోత్సవాలు, మాసోత్సవాల గురించి ఇప్పుడు కొద్దిగా తెలుసుకుందాం. **(సశేషం)**

---

# రక రకాల దీపాలు

**– కౌతా నిర్మల**

దీపాన్ని లక్ష్మీదేవి అంశ అంటారు. ఆగమశాస్త్రాలు ఈ విషయాన్ని తెలిపాయి. దీపాన్ని వెలిగించగానే 'దీపలక్ష్మీ నమోస్తుతే' అని చెప్తూ దీపానికి నమస్కరించాలని ఆగమ శాస్త్రాలు తెలియజేశాయి. దీపాలలో కూడా అనేక పేర్లతో వెలిగింపబడే దీపాలు ఉన్నాయి.

1. చిత్రదీపం – రంగు రంగుల పొడులతో రంగవల్లులను తీర్చిదిద్ది, ఆ ముగ్గుల మీద పెట్టే దీపమిది.
2. మాలాదీపం – అంతస్తులుగా ఉండే దీపపు పళ్ళాలలో వెలిగించే దీపం.
3. ఆకాశదీపం – గృహానికి బయటవైపు ఎత్తుగా కానీ, మేడమీద ఎత్తుగా కానీ వెలిగించే దీపాలను ఆకాశదీపం అంటారు. ఆకాశ దీపాలను వెలిగిస్తే భయాలు తొలగిపోతాయి.
4. జలదీపం – దీపాలను వెలిగించి నదులలో వదలటం జలదీపం.
5. పడవ దీపం – నదీతీరాలలో, అరటి దొప్పలలో దీపాలను వెలిగించి నీటిలో వదులుతారు. పడవలా ముందుకు సాగే ఈ దీపాన్ని పడవ దీపం లేదా నౌకా దీపం అంటారు.
6. సర్వదీపం – గృహంలో కానీ, గడప బయట కానీ వరుసగా వెలిగించే దీపాలను సర్వదీపం అంటారు. దీపావళికి ప్రతి ఇంటిముందు సర్వదీపాలు వెలుగుతాయి.
7. మోక్షదీపం – ఆలయం గోపురం మీద ఈ దీపాన్ని వెలిగిస్తారు. పితృదేవతలు సద్గతిని పొందాలని కోరుతూ వెలిగించే దీపం ఇది.
8. సర్వాలయ దీపం – కార్తీకమాసంలో పౌర్ణమి రోజున, సాయంత్రం సమయంలో శివాలయాల ముందు వెలిగించే దీపాలివి.
9. చొక్కపనై దీపం – కార్తీకమాసం పౌర్ణమి పూజ చేసి, దీపారాధన చేసిన తర్వాత కర్పూరజ్యోతిని వెలిగించటాన్ని చొక్కపనై దీపం అంటారు.
10. అఖండ దీపం – కొండ శిఖరాన పెద్ద దీపంగా వెలిగించేది అఖండదీపం. తిరుక్కళు కుంద్రమ్, తిరువణ్ణామలై, తిరుప్పర కుంద్రమ్, పళని ఆలయాలలో అఖండ దీపాన్ని వెలిగిస్తారు. దసరా సందర్భంగా కొన్ని ఆలయాలలో తైలంతో ఆ తొమ్మిది రోజులు రాత్రి పగలు వెలిగేటట్లుగా వెలిగిస్తారి అఖండ దీపాన్ని.
11. లక్షదీపం – లక్ష దీపాలను ఆలయమంతటా వెలిగించి ఉంచడాన్ని లక్షదీపం అంటారు. మైలాపూర్, తిరువణ్ణామలై, తిరుక్కళు కుంద్రమ్ (12 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే) ఆలయాలలో లక్ష దీపాలు వెలిగింపబడతాయి.
12. పిండి దీపాలు – అమ్మవారి ఆలయాలలో, తాము మొక్కుకున్న ప్రకారంగా పిండి దీపాలను వెలిగిస్తారు. కార్తీకమాసంలో సాధారణంగా ఈ పిండి దీపాలను వెలిగిస్తారు. కంచిలోని కచ్ఛపేశ్వర కోవెలలో ఈ దీపాలను వెలిగిస్తారు.
13. వృక్షదీపం – కేరళ సాంప్రదాయాన్ననుసరించి, కేరళ దేవాలయాలలో ఈ దీపాలను వెలిగిస్తారు. ఒక వృక్షంలా ఉండేవిధంగా అంతస్తులు ఉండే కొమ్మల వలె ఉండే ఆలయస్తంభాలలో ఈ వృక్ష దీపాలను వెలిగిస్తారు. తమిళనాడు లోని చిదంబరం, తిరువణ్ణామలై ఆలయాల్లో కూడా వృక్ష దీపాలను వెలిగించడం ఆనవాయితీ.





# ఆనందాల కేళి దీపావళి

- చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ||"శ్రీంకారీం వరదాభయప్రద కరాం పుల్లాబ్జ హస్తాం శుభాం
కళ్యాణీం కమలామనంత ధనదాం సర్వార్థ ధాత్రీం ప్రభామ్
బ్రహ్మేశాది సురార్చితాం భగవతీం శ్రీవిష్ణు పత్నీం రమాం
శ్రీలక్ష్మీం ప్రణమామి సర్వజననీం భక్తార్తి విధ్వంసినీమ్"**

అశ్వినీ నక్షత్రంతో కూడిన పున్నమి గల మాసం ఆశ్వయుజ మాసం. భక్తికి నిలయమైన మాసం శిష్ట పర్వాలలో దీపావళి ఉత్సవాలకు ఉన్నంత ప్రాధాన్యత మాటలలో వర్ణించనలవి కానటువంటి పవిత్రమైనవి.

దీప+ఆవళి – దీపావళి. 'ఆవళి' అనగా సముదాయము. దీపముల సముదాయమే దీపావళి. దీపం పరబ్రహ్మ స్వరూపం. దైవపూజలోని షోడశోపచారాలలో దీపారాధన ప్రధానం. దీపారాధన సర్వశ్రేయోదాయక ఫలితాన్నిస్తుంది. సంధ్యా సమయాలలో దీపం వెలుగుతున్న ఇంట్లో దైవీ శక్తులుంటాయి. ఆ ఇంట సకల శుభాలు కలుగుతాయి.

**"తం జ్యోతిః శ్రీరవీంద్ర గవిద్యతే వర్ణతారకం
సర్వేషాం జ్యోతిషాం జ్యోతిః దీపజ్యోతి స్థితే నమః"**

దీపం జ్ఞానానికి ప్రతీక. ఆ దీపాన్ని ఆరాధించే విశేషమాసం కార్తీకం. దీపం నిత్య ఆరాధనా విశేషం. చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే ఆయుధమే దీపం. వైదిక సంస్కృతిలో దీపావళి మహాపర్వం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంటాం.

పండుగలు మానవులకు నూతనోత్సాహాన్ని కలుగచేస్తాయి. పండుగనాడు బాధలను మరచిపోయి శాంతంగా, ప్రశాంతంగా ఉంటారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు వృద్ధి చెందుతాయి. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు, బాలుర నుండి వృద్ధుల వరకు భాష, వర్ణ విభేదాలు లేకుండా ఆనందోత్సాహాలతో అందరూ సమైక్యంగా జరుపుకునే పండుగ దీపావళి. వీధులు, గృహముల యందు వరుసగా అమర్చబడిన దీపములు కనుల పండువగా కన్పిస్తాయి. చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే ఆయుధమే దీపం. కటిక చీకటి మయమైన అమావాస్య రోజున దీపపు వరుసలో దేదీప్యమానంగా, మహోజ్జ్వల కాంతులు విరజిమ్మే బాణసంచా వెలుగులతో పున్నమి కాంతులు విరజిమ్మే రోజుగా పరివర్తింపచేసే మహత్తరమైన పండుగ దీపావళి. దీపావళిని కొన్ని ప్రాంతాలలో దివ్వెల పండుగ అని, మరి కొన్ని ప్రాంతాలలో దివిటీల పండుగ అని పిలుస్తారు. చారిత్రక కాలం నుండి దీపావళిని ఉత్సాహంగా పిల్లా, పెద్ద అందరూ నిర్వహించుకుంటున్నారు. దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి ఆనందంగా జరుపుకునే జాతీయ పండుగలలో దీపావళికి ప్రత్యేక స్థానం ఉంది. ఆ రోజు లక్ష్మీదేవి ఇంటిలోనికి ప్రవేశించి, సంపదలను ప్రసాదిస్తుందనే నమ్మకంతో ఆనందోత్సాహాలతో దీపావళిని జరుపుకుంటారు. ఇది రెండు రోజుల పండుగ. మొదటి రోజు 'నరకచతుర్దశి' అని అంటారు. ఆ రోజు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి నువ్వుల నూనెతో తలంటు స్నానం చేస్తారు. ఈ రోజున నూనెలో లక్ష్మి, నీటిలో గంగ వసించి ఉంటారు. అందువలననే నువ్వులనూనెతో తలంటు స్నానం చేస్తారు.

**"ఆశ్వయుజ కృష్ణపక్షస్య చతుర్దశ్యాం విధూదయే
తిలతైలేన కర్తవ్యం స్నానం నరక భీరుణా"**

ఆశ్వయుజ కృష్ణచతుర్దశి రోజు చంద్రోదయ కాలంలో నువ్వులనూనెతోతలంటుకునిఅభ్యంగనస్నానంచేయాలి.నరకం

అంటే భయపడేవారు, ఆ నరకం నుండి తప్పించుకోవాలంటే నువ్వులనూనెతో అభ్యంగన స్నానం చేయాలి.

**"తైలే లక్ష్మీర్జలే గంగా దీపస్యాశ్చతుర్దశీమ్"**

నువ్వులనూనె లక్ష్మీకరం. నీరు గంగాజలంతో సమానం. నరక చతుర్దశి రోజు లోకాన్ని పాలించే లక్ష్మీదేవి తైలంలోను, గంగ నీటిలోనూ ఆవేశించి ఉంటాయని పద్మపురాణం చెబుతోంది. కాబట్టి నువ్వులనూనెను శరీరానికి పట్టించుకొని, తలస్నానం చేయడం శుభప్రదం. ఈరోజు స్వాతి నక్షత్రపు కాంతి నీటిపై తన ప్రభావం చూపుతుంది. ఇలాంటి సమయంలో చేసే స్నానం ఆరోగ్యంతో పాటు, లక్ష్మీదేవి అనుగ్రహం కూడా కలిగిస్తుంది.

'నరక' అనే శబ్దానికి 'దుర్గతి' అనే అర్థం కూడా ఉంది. అనగా జీవులు చేసే పాపాలకు తగిన శిక్ష పొందే చోటు అని అర్థం. స్నానపు నీటిని ఉత్తరేణి కొమ్మతో కలియతిప్పాలి. స్నానపు సమయంలో తలచుట్టూ ఉత్తరేణి కొమ్మను తిప్పుకోవడం, తలచుట్టూ దీపాన్ని తిప్పడం ఆచారంగా వస్తోంది. అభ్యంగన స్నానమాచరించిన వారికి నరకలోక ప్రాప్తి నుండి విముక్తి కలుగుతుంది.



నరక చతుర్దశి మరుసటి రోజును దీపావళి అంటారు. మర్రి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు వేసిన నీటితో స్నానం చేసి ఇష్ట దేవతలను పూజించాలి. సాయంకాలం నువ్వులనూనెతో కాని, ఆవునేతితో కాని ఇంటిద్వారం, ధాన్యపుకొట్టు, బావి, వంట ఇల్లు, రావిచెట్టు వద్ద దీపాలను వెలిగించాలి. మగవారు దక్షిణం వైపు నిల్చుని దివిటీలు వెలిగించి పట్టుకోవాలి. దీపావళి నాడు సాయం సమయంలో తప్పనిసరిగా మహాలక్ష్మి పూజ చేస్తారు. ఈ విశిష్టమైన పర్వదినం నాడు శ్రీమహాలక్ష్మిని శిష్టాచారం ప్రకారం పూజించాలి. పూజ చేయడానికి ముందు పూజ జరిగే ప్రదేశమునందు గోమయంతో అలికి రంగుల రంగవల్లులను తీర్చదిద్ది, మంటపమును పసుపు కుంకుమలతో అలంకరించి నూతన వస్త్రమును పరిచి, ఆ వస్త్రముపై బియ్యము పోసి, మధ్యలో కలశమును ఏర్పాటు చేసుకుని, కొత్త రవికగుడ్డను కొబ్బరికాయకు చుట్టి, కాయ చుట్టూ లోన మామిడాకులను వేయాలి. పసుపు ముద్దతో చేసిన గణేశ ప్రతిమను శాస్త్రోక్తంగా పూజించాలి. దీపాన్ని వెలిగించి –

**"దీపలక్ష్మీ నమస్తుభ్యం సర్వమంగళ రూపిణి**
**ఆయురారోగ్య ఐశ్వర్యం యావజ్జీవ మరోగతాం**
**శ్రీదీపలక్ష్మీ దేవ్యై నమః"**

అని నమస్కరించాలి. పిదప కలశానికి ముందు భాగంలో పసుపు ముద్దతో గాని, బంగారంతో గానీ తయారు చేసిన లక్ష్మీదేవి రూపును ఉంచాలి. కలశానికి వెనుక వైపున లక్ష్మీదేవి పటాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఆవునేతితో జ్యోతులు వెలిగించి కుంకుమ పెట్టాలి.

**"సర్వజ్ఞే సర్వవరదే సర్వ దుష్ట భయంకరి**
**సర్వ దుఃఖ హరే దేవి మహాలక్ష్మీ నమోస్తుతే**
**సిద్ధి బుద్ధి ప్రదే దేవీ భక్తి ముక్తి ప్రదాయినీ**
**మంత్రమూర్తే సదా దేవి మహాలక్ష్మీ నమోస్తుతే"**

అంటూ స్తుతిస్తూ పూజించాలి.

లక్ష్మి అనగా కాంతి, శోభాన్కళ, ఐశ్వర్యం అనే అర్థాలున్నాయి. వాటి సమాహారమైన లక్ష్మీదేవిని ఆరాధించే పర్వదినంగా దీపావళి ప్రసిద్ధి చెందింది. అందుకే 'లోకైక దీపాంకురాం' అంటారు. అంటే లోకాలకు వెలుగు, శోభల్ని ప్రసాదించే దీపపు మొలక అని అర్థం. అందుకే ఆ మాతను జ్యోతి స్వరూపంగా ఆవిష్కరిస్తారు.

శ్రీ అంటే సంపద, లక్ష్మి ఏడేడు లోకాలకు సిరి సంపదలను ప్రసాదించే దేవత. సకల లోకాలకు భుక్తిని, ముక్తిని, సంపదను, ఐశ్వర్యాన్ని ప్రసాదించే కమలాలయ కటాక్షాన్ని పొందగలిగే శుభతరుణం దీపావళీ అమావాస్య. ఆ తల్లిని నిష్కల్మషమైన హృదయంతో స్మరించుకున్నా, పూజించుకున్నా మనలో నిద్రాణమై ఉన్న యోగశక్తి జాగృతము అవుతుంది. అఖండమైన తేజో సంపత్తి మనలను ఆవహిస్తుంది. సకల శ్రేయోదాయకమైన అమ్మ అనుగ్రహం అనంతమైన శుభాలను ప్రసాదిస్తుంది.

రాక్షసరాజైన బలి చక్రవర్తిని వామనుడు పాతాళానికి పంపిన ఆ రోజే అతని కారాగారంలో ఉన్న దేవతలను విముక్తి చేశాడు. తమకు విముక్తిని కలిగించిన శ్రీహరిని స్తుతిస్తూ దేవతలు ఎంతో సంతోషించారు. అజ్ఞాన జనితమైన వేదనే నరకం. ఆ వేదనను నివారించే జ్ఞాన దీపకాంతి దైవత్వం. 'ఆత్మనో మోక్షార్థం జగత్ హితాయచ' స్వార్థ ప్రయోజనం కంటే లోకహితమే మిన్న – అన్న వేద ప్రబోధాన్ని భూదేవి అంశ అయిన సత్యభామ ఆచరించి చూపింది.

ఆహ్లాదాన్ని కలిగించే ఈ దీపావళి పండుగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకుందాం. అందరూ సుఖ సంతోషాలతో విరాజిల్లాలని ఆకాంక్షిస్తూ సర్వలోకైక జనని లక్ష్మిని త్రికరణశుద్ధిగా వేడుకుందాం.

**"సిద్ధి బుద్ధి ప్రదే దేవీ మహాలక్ష్మీ నమోస్తుతే"**


# వారాహి అమ్మవారు

– మందరపు
వి.జి.శంకరాచారి

దుర్గాదేవి... మహాశక్తి స్వరూపిణి...

లక్ష్మి, సరస్వతి, పార్వతులకు మూలమైన మహాతల్లి.

సప్త మాత్రికలను (బ్రాహ్మణి, వైష్ణవి, మహేశ్వరి, ఇంద్రాణి, కౌమారి, వారాహి, చాముండి) సృజించిన సర్వశక్తి స్వరూపిణి. అటువంటి మహాతల్లి అయిన దుర్గాదేవి నుండి ఉద్భవించిన ఆరవశక్తి స్వరూపమే వారాహి అమ్మవారు. ఆమె గురించి క్లుప్తంగా.



ఏడేడు లోకాల్లో భూమికి దిగువన గల రాక్షస లోకాల్లో రక్తబీజుడు అనే రాక్షసుడు ఉండేవాడు. వాడు అతి క్రూరుడు, భయంకరుడు. ముల్లోకాలలో యున్న వారినందరినీ తన యొక్క రాక్షస చర్యలతో అమితంగా బాధిస్తూ అందరినీ కష్టాలకు గురి చేసేవాడు. మాంత్రిక, తాంత్రిక శక్తులన్నిటినీ కలిగియున్న రక్తబీజుణ్ణి సంహరించడం అంత సులభం కాదు. ఎందుకంటే.. ఇతడు అందరి దానవుల్లా విధాతను తనకు మరణం సంభవించకూడదు అని కోరుకోలేదు.

తను ఎవరితోయుద్ధం చేసినా...తన శరీరంగాయపడినప్పుడు రక్తపు బొట్టు క్రింద పడిన వెంటనే మరియొక రక్తబీజుడు జన్మించాలని కోరుకున్నాడు. ఆ విధంగా ఎన్ని రక్తపు బొట్లు నేలన పడితే అన్ని వేల మంది రక్తబీజులు జన్మించాలని కోరుకున్నాడు. ఈ వరం వలన అతడు అత్యంత శక్తివంతుడిగా మారాడు. తన రాక్షస రూపానికి అంతం లేదని భావించాడు. అందువల్లనే తనకు అమృతం త్రాగిన దేవతల వలె జీవించేశక్తి ఉన్నదని – అది ఎన్నటికీ నశించదన్న అహంకారంతో రెచ్చిపోయి ఒకవైపు దేవతలను మరియొక వైపు భూలోక ప్రజలను హింసిస్తూ కాలం గడుపుతూ యుంటాడు.

రక్తబీజుడు పెట్టే బాధలను భరించలేక దేవతలందరూ కలిసి ఒకసారి కైలాసానికి వెళ్ళి పార్వతీదేవికి రక్తబీజుడి గురించి మరియు అతడి అకృత్యాలను గురించి వివరిస్తారు.

దేవతలు పడుతున్న బాధలను కష్టాలను పోగొట్ట దలచి పార్వతీదేవి దుర్గాదేవి రూపంలోకి మారి రక్తబీజుడితో యుద్ధానికి సిద్ధపడుతుంది. ఇరువురి మధ్య భీకర యుద్ధం జరుగుతోంది.

దుర్గాదేవి రక్తబీజుడిని శూలంతో పొడిచినప్పుడు అతడి శరీరం నుండి క్రిందపడిన రక్తపు బొట్ల నుండి వేలకొలది రక్తబీజులు ఉద్భవిస్తారు. వీరందరినీ ఎదుర్కోవడానికి దుర్గాదేవి తన శరీరం నుండి సప్త మాత్రికలను ఉద్భవింప చేస్తుంది. ఈ సప్త మాత్రికలలో ఆరవది అయిన వారాహి అమ్మవారికి తాంత్రిక శక్తులతో పాటు రక్తబీజుడిలా వేల వేల రూపాలను సృజించుకునే అద్వితీయ శక్తిని ఇస్తుంది.

దుర్గాదేవి వారాహి అమ్మవారికి అటువంటి అద్వితీయమైన శక్తిని ఇచ్చిన తర్వాత వేలవేలుగా ఉద్భవించిన రక్తబీజులను సంహరించమని ఆదేశిస్తుంది. అప్పుడు వారాహి అమ్మవారు ఉగ్రరూపధారిణియై వేనవేలుగా ఉద్భవించి రక్తబీజులు ఒక్కొక్కరిపైన ఎగిరి కూర్చుని వాడియైన తన కోరలతో సంహరిస్తూ ఉంటుంది. అటువంటి సందర్భంలో రక్తబీజుడు దుర్గాదేవిని ద్వంద్వ యుద్ధానికి రమ్మని ఆహ్వానిస్తాడు. అప్పుడు దుర్గాదేవి తను సృజించిన సప్త మాత్రికలను మరల తనలో కలుపుకుని మహాశక్తి స్వరూపిణిగా మారి రక్తబీజుణ్ణి సంహరిస్తుంది. ఈ విధంగా వారాహి అమ్మవారు రక్తబీజుడి సంహారంలో ప్రముఖ పాత్రని వహించింది.

ఇదిలా ఉండగా...

సనక సనందాది మునుల ఆగ్రహానికి లోనై శపించబడిన జయవిజయులు (వైకుంఠం ద్వార పాలకులు) భూలోకంలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాల, దంతవక్త్రులుగా జన్మిస్తారు.

కృతయుగంలో జన్మించిన హిరణ్యాక్ష హిరణ్యకశిపులు సోదరులు ఇద్దరూ అమిత బలసంపన్నులే. అయితే హిరణ్యాక్షుడు తను అత్యంత శక్తివంతుడిగాను, మరణం లేకుండా జీవించే వరాన్ని పొందడానికి గాను, వారాహి అమ్మవారి అనుగ్రహానికై అత్యంత కఠోరమైన తపస్సు చేస్తాడు. అతడు చేసిన తపస్సుకి మెచ్చి వారాహి అమ్మవారు ప్రత్యక్షమై వరం కోరుకోమని అడుగుతుంది.

అప్పుడు హిరణ్యాక్షుడు "తల్లీ! ముల్లోకాలలోను నేను అత్యంత శక్తివంతుడిగా మారాలి. అంతేకాదు ఎట్టి పరిస్థితిలోను నాకు మరణం సంభవించకూడదు" అటువంటి వరాన్ని అనుగ్రహించమని అడిగాడు.

అప్పుడు వారాహి అమ్మవారు "మరణం లేకుండా జీవించాలనే నీ కోరిక ప్రకృతి విరుద్ధమైనది. అటువంటి కోరికను నెరవేర్చలేను. మరియొక కోర్కెను కోరుకోమని" అంటుంది.

అంత ట హిరణ్యాక్షుడు ఆలోచించి "అమ్మా! నీవు కోరుకొమ్మన్నట్లే మరియొక కోరిక కోరుకుంటాను. అనుగ్రహించు తల్లీ అంటూ భవిష్యత్తులో నన్ను సంహరించేవాడు నీ రూపు కలిగి యున్నవాడు కావాలి. అంతేగానీ నీ చేతిలో ఎట్టి పరిస్థితిలోనూ నాకు మరణం సంభవించకూడదు" అని అడిగాడు.

వారాహి అమ్మవారు అతడి కోరికను అనుగ్రహించింది.

వరాహ రూపంలో గల వ్యక్తులు ఎవరూ లేరు. భవిష్యత్తులో ఎవరూ జన్మించరు అన్న ఉద్దేశ్యంతోను, తనకు మరణం సంభవించే అవకాశం లేదనే ఉద్దేశ్యంతోను అహంకారం గలవాడై పేట్రేగిపోయి దేవతలను, భూలోక ప్రజలను హింసించసాగాడు.

హిరణ్యాక్షుడు పెట్టే బాధలను భరించలేక దేవతలందరూ విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి తమ గోడును వెలిబుచ్చుతారు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు వారితో "నేను హిరణ్యాక్షుడి వధించవలెనన్న వరాహ రూపంలో జన్మించాలి. ఆ రూపంతోనే నేను అతడితో యుద్ధానికి తలపడి సంహరించాలి. మామూలుగా అతడిని సంహరించడం సాధ్యం కాదు.

హిరణ్యాక్షుడి వలన మీరు పడుతున్న బాధలను, కష్టాలను పోగొట్టడానికై నేను దుర్గాదేవి సృజించిన సప్త మాత్రికలలో ఒకరైన వారాహి అమ్మవారిని ప్రార్థన చేసి ఆమె అనుగ్రహంతో ఆమె గర్భాన వరాహస్వామిగా ఉద్భవించి హిరణ్యాక్షుడిని వధిస్తాను. మీరిక చింతించవలదు" అని దేవతలకు అభయమిస్తాడు శ్రీమన్నారాయణుడు. తదనంతరం శ్రీమన్నారాయణుడు వారాహి అమ్మవారిని ప్రార్థించి ఆమెకు విషయాన్ని తెలియపరచి తనలోని అంశని వారాహి అమ్మవారి గర్భం నందు ప్రవేశింప చేసి వరాహస్వామిగా అవతరిస్తాడు. ఈ విధంగా వరాహస్వామిగా అవతరించిన శ్రీహరి హిరణ్యాక్షుడిని వధిస్తాడు.

ఈ విధంగా వారాహి అమ్మవారు విష్ణుమూర్తి చేత కూడా ప్రార్థింపబడి కోరిన కోరికలను తీర్చేటటువంటి తల్లి. నారాయణుడు కాదు, పరమేశ్వరుడు కూడా వారాహి అమ్మవారిని అంధకాసురుడి సంహారం కొరకు ప్రార్థించినట్లుగా మత్స్యపురాణంలో ఉటంకించబడింది.

మత్స్యపురాణ కథనం ప్రకారం పరమేశ్వరుడి చెమట బిందువునుండి అంధకాసురుడు ఉద్భవిస్తాడు. ఆ విధంగా జన్మించిన అంధకాసురుడు పెరిగి పెద్దవాడై అతులిత బలధాముడౌతాడు. అమిత బలాన్ని కూడగట్టుకున్న అంధకాసురుడు – రోషంతోనూ, గర్వంతోనూ దేవతలపై దాడి చేస్తాడు. అతడి యొక్క భీకరమైన పోరాటానికి దేవతలందరూ బెంబేలెత్తుతారు.

అంధకాసురుడు శివుడి చెమట నుండి పుట్టినవాడని దేవతలందరికీ తెలుసు కాబట్టి, ఈ రాక్షసుడికి జన్మదాత యైన మహాశివుడి దగ్గరకు వెళ్ళి అంధకాసురుడు చేస్తున్న దుశ్చర్యలను, దురాగతాలను తెలియపరచి ఈ రాక్షసుణ్ణి వధించమని వేడుకొంటారు.

అప్పుడు మహాశివుడు వారితో "నా దగ్గరకు వచ్చిన మీ అందరికీ ఒక విషయం చెప్పదలచాను. అదేమిటంటే అంధకాసురుడు నా చెమట నుండి ఉద్భవించినవాడు. కనుకనే అతడు నన్ను మించిన శక్తివంతుడు కాగలిగాడు. ఇప్పుడతణ్ణి సంహరించడానికి నా శక్తి చాలదు. నా నుండి అష్ట కాలభైరవులు ఉద్భవించి అష్ట దిక్కులకూ రక్షణ కల్పిస్తున్నారు. ఈ అష్ట కాలభైరవులలో ఒకరైన ఉన్మత్త కాలభైరవుని భార్య వారాహి అమ్మవారు. నా సతీమణి అయిన పార్వతీదేవి నుండి ఉద్భవించిన సప్తమాత్రికలలో ఒకరు ఈ వారాహి అమ్మవారు. ఈమె తాంత్రిక శక్తులను, మంత్ర శక్తులను, దుష్టశక్తులను అన్నింటిని కలిగియున్న మహాశక్తివంతమైన అమ్మవారు. ఆమె శక్తి నాలో నిండినపుడు నేను అంధకాసురుడిని సంహరించగలను.

కావున నేను ఆమెను ప్రార్థించి ప్రసన్నం చేసుకుని అమిత శక్తివంతుడినై అంధకాసురుడిని వధిస్తాను. మీరందరూ ఇక నిశ్చింతగా ఉండండి" అని పరమేశ్వరుడు దేవతలకు అభయమిస్తాడు. దేవతలకు అభయమిచ్చిన తరువాత పరమేశ్వరుడు వారాహి అమ్మవారి గురించి తదేక ధ్యానం చేసి అమ్మవారిని ప్రసన్నం చేసకుని అమితమైన శక్తిని పొందాడు.

ఆ విధంగా పరిపూర్ణ శక్తివంతుడైన పరమేశ్వరుడు అంధకాసురునితో యుద్ధానికి తలపడి కొన్ని రోజులపాటు ఘోరయుద్ధం చేసి ఆ రాక్షసుణ్ణి సంహరిస్తాడు.

రాక్షసులను వధించడానికి శివకేశవులిద్దరూ వారాహి అమ్మవారిని ప్రార్థించినారంటే, ఆ తల్లి ఎంతటి మహాశక్తియో అర్థమౌతోంది కదా.

ఇంతటి శక్తివంతురాలైన వారాహి అమ్మవారి ఆలయాలు అతి తక్కువగా కనిపిస్తాయి. అయితే అన్ని ఆలయాలలో వలె ఈ అమ్మవారిని పగటిపూట దర్శించడం జరగదు. కేవలం రాత్రి సమయంలో గానీ, తెల్లవారు జాము సమయమున గానీ ఈ అమ్మవారు దర్శనానికి అనుగ్రహిస్తారు.

మిగిలిన సమయమంతా వారాహి అమ్మవారు గ్రామ, నగర సంచారం చేస్తూ... తన భక్తులు ప్రజలందరూ దుష్టశక్తుల బారిన పడకుండా పహరా కాస్తూ మనలను రక్షిస్తుందని పురాణ కథనం.

కావున మనమందరం దుష్టశక్తులు మరియు తాంత్రిక శక్తుల బారిన పడకుండా రక్షించమని వారాహి అమ్మవారిని వేడుకుందాం. ప్రతిక్షణం ప్రతి సెకను అందర్నీ రక్షిస్తూ యున్న వారాహి అమ్మవారికి కోటాను కోట్ల జోతలు.

# పాండవుల అజ్ఞాతవాసం

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి

మహాభారతంలో కౌరవులతో జూదం ఆడి పాండవులు ఓడి పోయారు. ఆట షరతుల ప్రకారం ఓడిపోయిన వారు 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చే యాలి. అజ్ఞాతవాసం చేస్తున్నప్పుడు వారెవరో ఎవరికీ తెలియకుండా జీవనం సాగించాలి. ఈ షరతుల ప్రకారం 12 సంవత్సరాలు అరణ్యవాసం సాగించిన పాండవులు, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం సాగించటానికి విరాటనగరం లోని విరాటరాజు ఆస్థానానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఒక జమ్మిచెట్టుపై తమ ఆయుధాలను భద్రపరచి, దుర్గాదేవిని ప్రార్థించారు. ఆ తరువాత యమధర్మరాజుని స్మరించి, ప్రార్థన చేశారు. యమధర్మరాజు ప్రత్యక్షమై, ధర్మరాజుకి సన్యాసి వేషం, భీముడికి వంటవాని వేషం, అర్జునునికి పేడి వేషం, నకులునికి అశ్వరక్షకుడి వేషం, సహదేవునికి పశుపాలకుడి వేషం, ద్రౌపదికి సైరంధ్రి వేషం ప్రసాదించాడు. యమధర్మరాజుకి నమస్కరించి విరాటరాజు కొలువుకి బయలుదేరిన పాండవులు, ద్రౌపది ఏయే పేర్లతో, ఏయే నైపుణ్యాలు ఉన్నాయని చెప్పి వారి వారి పాత అనుభవాలు ఎలా వివరించి విరాటరాజు కొలువులో అందరూ ఒకచోట ఎలా ఉద్యోగాలు సంపాదించారో ఇప్పుడు తెలుసుకుందాం.

ముందుగా ధర్మరాజు గురించి తెల్సుకుందాం. సన్యాసి వేషంలో ధర్మరాజు, విరాటరాజు కొలువులో ప్రవేశించాడు. తన పేరు కంకుభట్టు అనీ, కురుదేశంలో పుట్టాననీ చెప్పుకొన్నాడు. తాను సన్యాసం స్వీకరించాననీ, అయినప్పటికీ జూదం బాగా ఆడగలనని చెప్పాడు. శత్రువులతో జూదమాడి, అంతా పోగొట్టుకొన్నాననీ, ఆ అవమానం భరింపలేక రాజ్యం వదలి వచ్చేశానని, చెప్పాడు. రాజ్య నిర్వహణలో ఉత్తమ సలహాలు ఇస్తాననీ, జూదక్రీడతో ఆనందింప చేస్తానని, ఒక సంవత్సరం పాటు మాత్రమే కొలువులో ఉంటానని చెప్తూ అనుమతి ఇమ్మని కోరాడు. విరాటరాజు అంగీకరించాడు.

ఇక రెండవవాడైన భీముడు చేతిలో గరిటెతో విరాటరాజు కొలువులోకి ప్రవేశించాడు. తాను వంటవాడిననీ, తన పేరు "వలలుడు" అనీ, తనకు మల్లయుద్ధం కూడా బాగా వచ్చనీ చెప్తాడు. ఇంతకుముందు హస్తినాపురంలో ధర్మరాజు కొలువులో పని చేశానని, తన వంటలతో, మల్లయుద్ధ కౌశలంతో మిమ్మల్ని ఆనందపరుస్తానని చెప్తాడు. విరాటరాజు తన కొలువులో భీముడికి వెంటనే స్థానం కల్పిస్తాడు.

పాండవులలో మూడవవాడైన అర్జునుడు, పేడివాని రూపంలో విరాటరాజు కొలువులోకి ప్రవేశిస్తాడు. తాను పేడిదాన్ననీ, తన పేరు "బృహన్నల" అనీ, నాట్యకళలో తనకు అసాధారణమైన ప్రావీణ్యమున్నదనీ, మీ కొలువులో ఎవరికైనా సరే నాట్యాన్ని నేర్పగలను అంటూ అవకాశం ఇప్పించమని అడిగాడు. ప్రతిగా విరాటరాజు తనకు ఒక కుమార్తె ఉన్నదనీ, ఆమె పేరు "ఉత్తర" అనీ ఆమెకు నాట్యాన్ని నేర్పించమంటూ అర్జునునికి అవకాశం ఇచ్చాడు.

ఇక పాండవులలో నాల్గవవాడైన నకులుడు విరాటరాజు కొలువులోకి ప్రవేశించి తన పేరు "దామగ్రంధి" అనీ, తాను అశ్వపాలకుడిని అనీ, ఇంతకుముందు ధర్మరాజు కొలువులో పని చేశాననీ, కాలం కలిసిరాక అక్కడినుంచి వచ్చేశాననీ, అశ్వపాలకుడిగా మీ కొలువులో నాకు ఉద్యోగం ఇప్పించమని అడిగాడు. విరాటరాజు వెంటనే అంగీకరించాడు.

పాండవులలో ఆఖరివాడైన సహదేవుడు తాళ్ళమూటతో గోపాలకుడి వేషంలో విరాటరాజు కొలువుకు వచ్చాడు. తన పేరు తంత్రీపాలుడనీ, తన నైపుణ్యం గో సంరక్షణ అనీ ఇంతకు ముందు ధర్మరాజు కొలువులో పని చేశాననీ, కారణాంతరాల వలన అక్కడనుండి వచ్చేశాననీ, తనకు గో సంరక్షకునిగా మీ కొలువులో ఉద్యోగం ఇప్పించమని విరాటరాజుని కోరుకున్నాడు. గో సంరక్షణ భారాన్ని సహదేవుడికి అప్పగించాడు విరాటరాజు.

ఇక ద్రౌపది. ఈమె సైరంధ్రి వేషంలో విరాట నగరంలోకి ప్రవేశించి, పాటలు పాడుతూ పురవీధులలో తిరుగాడసాగింది. విరాటరాజు భార్య సుధేష్ణాదేవి ఆమెను చూసి చెలికత్తెల ద్వారా ఆమెను తన దగ్గరికి పిలిపించింది. ద్రౌపది తాను సైరంధ్రి జాతి స్త్రీనని, తన పేరు "మాలిని" అనీ, గతంలో పాండవుల భార్య ద్రౌపది వద్ద పని చేశానని, కొన్ని కారణాల వల్ల బయటకు వచ్చానని, మీ కొలువులో వుండడానికి అనుమతిస్తే మీ సపరిచర్యలు చేసుకుంటానని చెప్పింది. వెంటనే రాణి అందుకు అంగీకరించింది.

ఈ విధంగా పాండవులు, ద్రౌపది అజ్ఞాతవాసం గడపడానికి, అందరూ ఒకచోట విరాటరాజు కొలువులో ఉద్యోగాలు చాలా సులువుగా సంపాదించారు. వారికి అజ్ఞాతవాస భంగం కావించి మరొకసారి ఓడించాలని చేసిన కౌరవులకు నిరాశ మిగిలింది. పాండవులు విజయవంతంగా అజ్ఞాతవాసం పూర్తి చేసుకుని వెళ్తూ, జమ్మిచెట్టు మీద దాచిన తమ ఆయుధాలు తీసుకున్నారు. ఆ రోజు విజయదశమి. అందుకే విజయదశమి నాడు ఆయుధపూజ చేయడం ఆచారంగా వచ్చింది. అలాగే మహాభారతంలోని విరాటపర్వం చదివినా – విన్నా ఉద్యోగాలు లభిస్తాయనీ, ఉద్యోగం ఉన్నవారు చదివినా – విన్నా పదోన్నతులు లభిస్తాయనీ విశ్వాసం.

శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు మెరుగ్గా ఉంటుంది. తెలియకుండా ఆకస్మిక ధనలాభము ఉన్నది. ఒడిదుడుకులు ఉన్నవి. ఒక ప్లాన్ చేసుకొనగలరు. సంఘంలో గౌరవమన్ననలు, కుబేర పాశుపదం, లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం చేయువారికి అనుకూలంగా ఉంటుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలు ఉన్నవి. కనకదుర్గాదేవి నవరాత్రుల శోభతో అమ్మవారిపైన భారం వేయండి. అధిక ఆదాయ వనరులు, ఆకస్మిక అవరోధములు. పంతాలు, పట్టింపులకు తావు ఇవ్వరాదు. మీ ప్రతిభకు గుర్తింపు, సంఘంలో గౌరవమన్ననలు పొందుతారు.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు ఆదాయ వనరులు కలిగి ఉన్నారు. ఏకాగ్రత కలిగి ఇతరుల గురించి ఆలోచన చేయక నమ్మకంతో, పట్టుదలతో మీరు చేయు జీవన విధానంలో అద్భుతమైన మార్పు. పదిమందికి మంచి చేస్తూ ధన సంపాదన కలిగి ఉంటారు. అమ్మవారి పూజలు సంతృప్తి నివ్వగలవు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. అవసరానికి ధనము అందుతుంది. అనవసర వ్యవహారములలో తలదూర్చరాదు. అపార్థములు ఉన్నవి. అనుకూలత ఉన్నది. మీరు నమ్మిన వారి మీద నమ్మకం ఉన్నది. గ్రహారాధన, అమ్మవారి పూజలు శాస్త్రోక్తముగా ఆచరించండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రయాణ జాగ్రత్తలు అవసరం. బంధుమిత్రుల కలయిక ప్రయాణములలో చాలా మెలకువలు పాటించాలి. ఆభరణములు దోపిడీ జరుగును. అనుకొనిన పనులు పూర్తికావు. ఏ విషయంలో తొందరపాటు మంచిదికాదు. అమ్మవారి పూజలు దర్శనం చేసుకోండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు దూర ప్రయాణములలో జాగ్రత్త. ప్రతి విషయంలో చాలా జాగ్రత్తగా నడుచుకోవాల్సిన రోజులు. ధనవ్యయం. మిత్రులు కూడా శత్రువులుగా మారుట. అశాంతి, భయం. మనోవ్యథ. కనకదుర్గాదేవికి చండిహోమం చేయండి. అనుకున్న పనులు నెరవేరుతాయి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. అనారోగ్యములు భయము నకు కారణం తెలియదు. కొత్త పరిచయముల వలన అపాయములు. చాలా ఓర్పుగా స్థిమితంగా ఉండవలసిన రోజులు. ఒత్తిడి ఉన్నది. అమ్మవారిపైన భారం వేయండి. అమ్మ దయతో విపత్తు తొలగును.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఏకాగ్రతతో చేయు పనులు సఫలీకృతం అవ్వగలవు. విందులు వినోదములు బంధుమిత్రుల కలయిక ఆనందంగా ఉంటారు. మనసులో కొంత కలవరపాటు ఉంటుంది. పిల్లల విషయంలో కొంత సంతృప్తి ఉంటుంది. కనక దుర్గాదేవి పూజలు సంతృప్తినిస్తాయి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతన వ్యక్తులను నమ్మి మోసపోకండి. తొందరగా నమ్ముతారు. నమ్మకండి. పెద్దల సలహాలు తీసుకొనండి. వైద్యం అవసరమున్నది చాలా జాగ్రత్తగా ఆలోచన చేయండి. సంసారం గుట్టు, రోగం రట్టు వ్యాధి నివారణ జరుగుతుంది. గ్రహారాధన అవసరం.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. నూతన వ్యక్తుల పరిచయము కలిగి ఉన్నారు. చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు మీరు నమ్మితే మోసం చేస్తారు. మాట తేడాతో ఇరికించగలరు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి. దానాలు ఇవ్వండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. ప్రతి అడుగు ఆచితూచి వేయండి. ఎవరిని నమ్మితే వారు మోసం చేయుటకు అవకాశాలు ఉన్నవి. మీరు చాలా జాగ్రత్తగా మెలకువగా ఉండవలసిన రోజులు. ఇష్టదేవత ఆరాధనలు అమ్మవారి పూజలు చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. కొన్ని పనులు నిలిచిపోగలవు. అలా అని భయపడరాదు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే ఏమి చేసినా ఫలితం అంతగా లేదు. అమ్మవారిని మనసు పూర్తిగా పట్టుకొనగలిగితే ప్రతి విషయంలో మనశ్శాంతి ఉంటుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. "వికుంఠ"కి అర్థం ఏమిటి?
2. హరినామ క్షేత్రానికి క్షేత్ర పాలకుడు ఎవరు?
3. పాదసేవనానికి ప్రతీక ఎవరు?
4. శ్రీమన్నారాయణుని శంఖం పేరేమిటి?
5. కొల్హాపురం లోని జగన్మాత పేరేమిటి?
6. మానవుడికి రుణాలెన్ని? అవి ఏవి?
7. రావణుని మంత్రి ఎవరు?
8. "వింటే తెలుగు పాటే వినాలి" అన్నదెవరు?
9. తొండమనాడు – ఎక్కడుంది?
10. జనకుని కుల గురువు ఎవరు?
11. ప్రయాగ క్షేత్రానికి పాలకుడెవరు?
12. గంగాదేవి ఏ పర్వతం నుండి జన్మించింది?
13. అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని ఎవరు ఎవరికి చెప్పారు?
14. శ్రీవారి నిజనేత్ర దర్శనం ఏనాడు ఉంటుంది?
15. దండుడు ఎవరి కొడుకు?

1. ........................................................................
2. ........................................................................
3. ........................................................................
4. ........................................................................
5. ........................................................................
6. ........................................................................
7. ........................................................................
8. ........................................................................
9. ........................................................................
10. ........................................................................
11. ........................................................................
12. ........................................................................
13. ........................................................................
14. ........................................................................
15. ........................................................................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1.తృణావర్తుడు, 2. కె.వి.రాఘవాచార్యులు, 3. శంషాబాద్‌లో, 4. 7 రోజులు, 5. హుమాయూన్‌కి, 6.గాయత్రీ మంత్రంలోని అక్షరాలు, 7.ప్రహస్తుని కొడుకు, 8. బ్రహ్మాస్త్రానికి, 9. మాధవసింగ్, గుణవతి బాయి, 10. మాఘ పౌర్ణమి, 11. యోగ సమాధిలో, 12. తిరుమల నంబి, 13. షేక్ మస్తాన్, 14. హస్త, 15. దేవదారు పత్రం

## సరైన సమాధానాలు రాసినవారు

ఎవరూ సరైన సమాధానాలు రాయలేదు

పేరు: ____________________

చిరునామా: ____________________


____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________



గోవింద

RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

**Srivenkatesham Magazine in Google Drive**
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq